జులై
2017

135

సంపుటి : 12 సంచిక : 3 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

చరిత్రగతిని మార్చిన పెట్టుబడి గ్రంథం
పార్టీ - ప్రజాసంఘాలు
గల్ఫ్‌లో మరో కుంపటి రాజేసిన అమెరికా
కార్పొరేట్లకు సంబరం మోడీ పాలన
వ్యవసాయ సమస్యపై లెనిన్ అవగాహన
మోడి విధానాలపై రైతుల తిరుగుబాటు
ఆర్యుల వలసలకు జన్యుశాస్త్ర పరిష్కారం
'ఛలో నాగపూర్' ఉద్యమం
కమ్యూనిస్టు వ్యవస్థలో విలువలే మారిపోతాయి
ప్రగతివాద ప్రతిధ్వని, కళా సాహిత్య ఖని

# ప్రగతివాద ప్రతిధ్వని, కళా సాహిత్య ఖని

**తెలకపల్లి రవి**



29-07-1931 :: 12-06-2017

డాక్టర్ సి.నారాయణరెడ్డి మరణం తెలుగునాట ప్రగతిశీల కళా సాహిత్య ఉద్యమాలకు ఒక పెద్ద లోటు. అంతటి బహుముఖ ప్రతిభ, లౌకిక నిబద్ధత, నిరంతర కృషి కలబోసిన సాహిత్యకారులు అరుదనే చెప్పాలి. తను ఏ స్థానంలో ఉన్నా ఎర్రజెండానూ, ప్రజాస్వామ్య ఉద్యమాలను గౌరవించడం ఆయన ప్రత్యేకత. రచనా వ్యాసంగానికి ఏమాత్రం తీసిపోని క్రియాశీల జీవితం. అనునిత్యం సభలూ, సమావేశాలూ, సాహిత్య సృజన, అధికార బాధ్యతల మధ్యనే ఆయన తనలోని అభ్యుదయాంశను అప్రమత్తంగా కాపాడుకున్నారు.

కరీంనగర్ జిల్లా హనుమాజీ పేటలో ఒక రైతు కుటుంబంలో పుట్టిన సినారె చిన్నతనానే సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. సామాజిక విషయాల్లోనూ చైతన్యం చూపించారు. ఆ దశను గురించి ఆయనే ఇలా చెప్పారు:"నేను పుట్టి పెరిగిన వాతావరణంలో చదువు చాలా తక్కువ. ఏడవ తరగతి వరకు కరీంనగర్ జిల్లా హనుమాజీ పేటలో చదివాను. చిన్నప్పటి నుంచి గాయకుణ్ని, పాటలు పాడేవాన్ని. హరికథలు వింటుండేవాన్ని. సరదాగా చిన్న వయసులోనే సీస పద్యం రాశాను. ప్రణాళికా బద్ధంగా చెప్పేవారెవరూ లేరు. తల్లికి అక్షరజ్ఞానం లేదు. నేను ఆడిందే ఆట పాడిందే పాట. నాకు అప్పటికే కొంచెం విశాల భావాలు ఉండేవని చెప్పవచ్చు. కావాలని మాదిగ పాలేర్లను అంటుకోవడం, వాడల్లోని బావుల్లో చేదుకుని తాగడం చేసేవాణ్ని పల్లెపదాలు, హరికథలు నాకెంతో మేలు చేశాయి. వాటి నుంచి నాకు పదసంపద అబ్బింది. దరువులు నేర్చుకున్నాను. పండగలకు పందిళ్లలో వాటిని పాడుతుండేవాన్ని. ఏడవ తరగతి తర్వాత కరీంనగర్ వెళ్లాను. అక్కడ శేషాద్రి వెంకటరమణ గారు పని చేస్తుండే వారు. ఆనాటి నిజాం పాలనలో తెలుగుకు ఆదరణలేని స్థితి ఆయనను చాలా నిర్వేదానికి గురిచేసి వుంటుంది. నేను పద్యాలు రాస్తున్నట్లు నా స్నేహితులు చెప్పగా మొదట ఆయన నిరుత్సాహపరచారు. రెడ్డి కుర్రాడివి నీకు పద్యాలెందుకు అన్నారు. తర్వాత మాత్రం వాటిని చూసి బాగానే రాశావే అని మెచ్చుకున్నారు. వాటిలో చందోభంగం లేదు గాని యతి దోషాలుండేవి. అప్పుడాయన నాకు కొన్ని సూచనలు చేశారు. అలా గాలికి పుట్టి పెరిగి కవిత్వం రాయడం నేర్చుకున్నాను. అయితే గాలికి పోయే రచనలు చేయలేదని మాత్రం చెప్పగలను. చందస్సు తెలియకుండానే పదేళ్ళ వయసులోపులోనే పద్యనాటకాలు కూడా రాశాను. ... ఆ నాటి నుంచే నేను పదప్రయోగాలు, శబ్దం జాగ్రత్తగా ఉపయోగించడం అలవరచుకున్నాను."

### కవితా పరిణామం

సినారె తొలి కావ్యం నవ్వని పువ్వు. అప్పటికి ఇంకా అంత పరిపక్వత రాలేదు. తర్వాత ఆయన తన కవితా యాత్రను పునఃపరిశీలించుకున్నారు. కొంతకాలం పద్యకావ్యాలు రాశారు. దానికి దారి తీసిన పరిస్థితులను ఒక ఇంటర్వ్యూలో నాతో ఇలా చెప్పారు: "మా ప్రాంతం ఎంత వెనుక బడినదో చెప్పాను. తెలంగాణా పోరాటం నాటికి నేను చిన్నవాణ్ని, పోలీసు చర్యపై కవితలు రాశాను. దాశరథి నా కంటె అయిదేళ్ళ పెద్ద. అప్పుడు నేను 'క్విట్ స్కూల్' ఉద్యమంలో పాల్గొన్నాను. అది ఆదిమదశ, అప్పటికి నాకు నన్నయ్య, తిక్కన, పోతన, వేమన వంటి వారు మినహా ఆధునిక కవులు తెలియదు. డిగ్రీ చదువు కోసం హైదరాబాదు వచ్చాకే గురజాడ, రాయప్రోలు, జాషువా, శ్రీశ్రీ వంటి వారి గురించి తెలుసుకున్నాను. ఆంధ్ర ప్రాంతంతో పోలిస్తే మా ప్రాంతం సాహితీ ధోరణులలో చాలా వెనకబడివుంది. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, వచన కవిత్వం ఉద్యమాలుగా రాలేదు. కనుక నేను ఈ మూడు దశలు దాటవలసి వచ్చింది. కవిత్వం నన్ను ఎప్పుడూ వెన్నంటి తరుముతూనే ఉంది. అయినా ఈ కారణం చేతనే నా కావ్య రచనలో అనేక దశలు గడవాల్సి వచ్చింది. అప్పుడు నేను ఏమి రాయాలని తీవ్రంగా ఆలోచించాను. పద్యాలు రాస్తే అప్పటికే జాషువా, విశ్వనాథ వంటి వారు ప్రసిద్ధులు. ఇక గేయాలు ఎన్ని రాసినా శ్రీశ్రీని చేరుకోవడం జరిగేపని కాదు. చమత్కారాలు ఆరుద్ర ప్రదర్శించివున్నాడు. వచన కవిత్వానికి కుందుర్తి ప్రతినిధిగా కూచున్నారు. ఇలాటి స్థితిలో నా సొంత గొంతుక వినిపించడం, నా మార్గాన్ని సృష్టించుకోవడం సవాలే అనుకుని కావ్య మార్గం చేబట్టాను. గేయనాటికలు, పద్యకవిత్వాలు రాశాను. అప్పటికి కావ్యాలు ఉన్నా మహాకావ్యాలు రాలేదు. ఆ విధంగా చూస్తే నా 'నాగార్జున సాగరం' మొదటి మహాకావ్యం. సామ్యవాద భావాలు, మానవతా దృక్పథం నా కవిత్వానికి రెండు ప్రధాన లక్షణాలుగా స్వీకరించాను. గుణమో దోషమో తెలియదు గాని నేనెప్పుడూ ఏదో ఒక మార్గానికే కట్టుబడి ఉండలేదు. మానవీయ దృక్పథంలో మాత్రా ఛందస్సులో మహాకావ్యం రాయాలి. ఇక్ష్వాకుల కాలం నాటి ఇతి వృత్తం ఎనుకున్నాను. మత ప్రేమకు, వ్యక్తిగత ప్రేమకు మధ్య ఘర్షణ. వైదిక వ్యవస్థకు భిన్నంగా బౌద్ధం రావడమే ఒక విప్లవం కదా... గేయ చందస్సులో మహాకావ్యం రాయడం కూడా అదే ప్రథమం. ...... అయితే చరిత్ర గురించి రాస్తూ వెనక్కు పోతున్నానా అనిపించింది. సామాజిక సమస్యలపై గేయాలు రాయడం ప్రారంభించాను. "

### మామూలు భాషలో మహత్తర సత్యాలు

అలా గేయాలు రాయడం మొదలుపెట్టాక సినారె కవితా యాత్ర ఆగింది లేదు. ఏటేటా కవితా సంపుటాలు పుంఖానుపుంఖంగా వెలు

(మిగతా 34వ పేజీలో)

# ఈ సంచికలో...


**1. ప్రగతివాద ప్రతిధ్వని, కళా సాహిత్య ఖని**
తెలకపల్లి రవి .................... 2

**2. చరిత్రగతిని మార్చిన పెట్టుబడి గ్రంథం**
బివి రాఘవులు .................... 4

**3. పార్టీ - ప్రజాసంఘాలు**
ఎస్.వీరయ్య .................... 8

**4. గల్ఫ్‌లో మరో కుంపటి రాజేసిన అమెరికా**
ఎస్. వెంకట్రావు ................ 14

**5. కార్పొరేట్లకు సంబరం మోడీ పాలన**
ఎ కోటిరెడ్డి .................... 18

**6. వ్యవసాయ సమస్యపై లెనిన్ అవగాహన**
కొండూరి వీరయ్య................ 22

**7. మోడి విధానాలపై రైతుల తిరుగుబాటు**
వెంకటేష్ రామకృష్ణన్,
పూర్ణిమ ఎస్. త్రిపాఠి.......... 26

**8. ఆర్యుల వలసలకు జన్యుశాస్త్ర పరిష్కారం**
టోనీ జోసెఫ్ .................... 28

**9. 'ఛలో నాగపూర్' ఉద్యమం**
అభినయ రమేష్................ 30

**10.కమ్యూనిస్టు వ్యవస్థలో విలువలే మారిపోతాయి**
బి.వి. రాఘవులు................ 31



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటోరియల్ 9490099333**
**మేనేజర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# రోడ్డెక్కిన రైతాంగం

**కేం**ద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దశాబ్దాలుగా అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలతో భారత దేశ రైతులు విసిగిపోయారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టి మూడేళ్లయిన సందర్భంగా సంబరాలు జరుపుకుంటూ 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటనలు చేస్తుంటే మరోవైపు ప్రస్తుతం బిజెపి పాలనలో ఉన్న మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, అస్సాం, హర్యానా రాష్ట్రాల్లో రైతులు రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధరలకోసం ఆందోళనలకు దిగారు. పోలీసుల నిర్బంధాలను ఎదిరిస్తూ రోడ్లపైకి వచ్చారు. ఆందోళనలను అడ్డుకున్న పోలీసులపై రాళ్ల వర్షం కురిపించారు. మధ్యప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ ఆందోళనలు క్రమంగా పక్క ప్రాంతాలకు, పొరుగు రాష్ట్రాలకు విస్తరించాయి. మందసార్‌లో పోలీసుల కాల్పుల్లో ఆరుగురు రైతులు చనిపోవడంతో ఉద్యమం మరింత తీవ్రమయ్యింది. కాల్పులను నిరసిస్తూ దేశవ్యాప్తంగా రైతులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

భారత దేశంలో రైతాంగం ఆసేతుసీతాచలం ఆందోళన బాట పట్టడానికి కేంద్రం, పలు రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణం. 90వ దశకంలో ప్రారంభమైన నయా-ఉదారవాద ఆర్థిక విధానాలు దేశంలో వ్యవసాయ సంక్షోభానికి తెరతీయగా, అప్పటినుండి కేంద్రంలో వరుసగా అధికారం చేపట్టిన ప్రభుత్వాలు రైతులకు ఉన్న రక్షణలను ఉపసంహరిస్తూ వచ్చాయి. ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయ పెట్టుబడుల ఖర్చు పెరిగిపోయింది. అదే సమయంలో రైతు పండించిన పంట అంతర్జాతీయ పోటీకి తట్టుకోలేక నేలచూపులు చూడ్డం మొదలెట్టింది. అమ్మబోతే అడివి, కొనబోతే కొరివిలా తయారైంది రైతు పరిస్థితి. ఒకప్పుడు దేశంలో కరువు కాటకాలొచ్చి రైతులు చనిపోయేవారు. కానీ చివరివరకు బతకడానికి వారు ప్రయత్నించేవారు. కానీ ఇప్పుడు పంట బాగా పండించి కళ్లంలో రాసులు పోసి ఇంటికి వచ్చి వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన మూడేళ్ళలో సుమారు 37,000 మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారు. 2014లో 11,500 మంది, 2015లో 12,600 మంది, 2016లో 13,000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రజలు వ్యవసాయ రంగం నుండి వ్యవసాయేతర రంగాలకు పెద్ద ఎత్తున వలస పోతున్నారు.

వ్యవసాయ సంక్షోభం ఏదో ఒక ప్రాంతానికి, ఏదో ఒక పంటకు పరిమితమైలేదు. మొత్తం వ్యవసాయరంగాన్నే సంక్షోభం ఆవహించింది. ధాన్యం, పత్తి, మిర్చి, కూరగాయలు, ఉల్లి, వెల్లుల్లి, కంది మొదలగు పంటలు, పాడి పరిశ్రమ ఇలా అన్ని రంగాల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తులతో వ్యాపారం చేసే టాటా, బిర్లా, రిలయన్సు, ఆదాని, ఐ.టి.సి, బేయర్, పతంజలి వంటి కంపెనీలు వేల కోట్ల లాభాలు సంపాదిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మిర్చికి ధరలేక రైతులు ఆందోళన చేస్తున్న కాలంలోనే వినియోగదారులు కిలో రూ.200కి కొనుక్కోవాల్సి వచ్చింది.

ప్రభుత్వాలు ఈ రైతాంగ వ్యతిరేక విధానాలను అనాలోచితంగా, తెలివి తక్కువగా తీసుకోవడం లేదు. వీటి వెనుక లక్ష్యం ఉంది. ఒక వ్యూహం ఉంది. ప్రభుత్వాల విధానాల వల్ల దేశంలోని ఇతర రంగాలన్నీ స్వదేశీ, విదేశీ కార్పొరేట్ల వశమవుతున్నాయి. ఉత్పత్తి రంగం, సేవా రంగాలు విద్య, వైద్యం మౌలిక వసతులు, ఫైనాన్స్ రంగం, రక్షణ రంగం...ఇలా అన్ని రంగాలను కార్పొరేట్ శక్తులు చేజిక్కించుకుంటున్నాయి. కానీ దేశంలో 58శాతం మంది ప్రజలు ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగం మాత్రం వారి వశం కావడం కష్టంగా మారింది. ఎన్ని కష్టాలకైనా ఓర్చి రైతు భూమిని అంటిపెట్టుకుని ఉండడమే దీనికి కారణం. వ్యవసాయం చిన్న చిన్న ఉత్పత్తి దారులకు గిట్టుబాటు కాకుండా చేస్తే అప్పుడు వారు భూమిని వదులుకోడానికి సిద్ధపడతారు. కంపెనీలు వ్యసాయాన్ని చేజిక్కించుకోడానికి వీలవుతుంది. ఈ లక్ష్యంతోనే ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా రైతుకు పంట గిట్టుబాటు కాకుండా చేస్తున్నాయి. అందువల్ల ప్రస్తుత ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు అనుసరించే శక్తులు అధికారంలోకి వస్తేనే రైతులు ప్రస్తుత చెర నుండి విముక్తి పొందుతారు.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

ఈ మాసం ముఖ్యాంశం

# చరిత్రగతిని మార్చిన పెట్టుబడి గ్రంథం



రచయిత
సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

**బివి రాఘవులు**

*పెట్టుబడి గ్రంథం 150 వార్షికోత్సవ సభ 2017 జూన్ 13న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలోని చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రపంచ చరిత్ర గతిని మార్చిన మహాగ్రంథం 'పెట్టుబడి' గురించి సమగ్రంగా వివరించారు. ఆయన ప్రసంగాన్ని వ్యాసరూపంలో పాఠకులకు అందిస్తున్నాం.* **-ఎడిటర్**

❊ ❊ ❊

ప్రపంచాన్ని మార్చివేయడానికి తోడ్పడిన మూడు ఘటనలు, కారల్ మార్క్స్ ద్విశత జయంతి, పెట్టుబడి పుస్తకం ముద్రణకు 150 ఏళ్లు పూర్తికావడం, అక్టోబర్ మహా విప్లవ శతవార్షికోత్సవం ఒకేసారి రావడం విశేషం. ఈ ప్రాధాన్యత దృష్ట్యా పెట్టుబడి గ్రంథాన్ని మననం చేసుకోవడం ఎంతో అవసరం. వాస్తవానికి గత దశాబ్దకాలం నుంచీ కూడా పెట్టుబడి గ్రంథానికి ప్రాధాన్యత వచ్చింది. 1867లో పెట్టుబడి గ్రంథాన్ని రచించినతర్వాత మొదట్లో ఈ పుస్తకాన్ని ముద్రించేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదు. చివరకు ఓ ప్రచురణకర్త ముందుకొచ్చి జర్మనీ బాషలో ప్రచురించారు. కానీ అనుకున్నంతగా అమ్ముడు పోలేదు. సమీక్షలకు పంపినా వాటికీ నోచుకో లేదు. దీంతో పెట్టుబడి గ్రంథాన్ని సమీక్షిస్తూ ఏంగిల్స్ పత్రికలకు వ్యాసాలు పంపించారు. కొందరు ప్రచురించారు. ప్రారంభంలో ఆ విధంగా పెట్టుబడి గ్రంథం ప్రజల్లోకి వెళ్లింది. ఒకసారి ప్రజల్లోకి వెళ్లిన తర్వాత అది దావాగ్నిలాగా కార్మికవర్గంలో వ్యాపించింది. అనతికాలంలోనే ప్రచురణల సంఖ్య పెరిగింది. ఐరోపాలోని అన్ని భాషల్లోకి అనువాదం జరిగింది. కార్మికులు బృందాలుగా ఏర్పడి పెట్టుబడి గ్రంథాన్ని అధ్యయనం చేశారు. అందుకే పెట్టుబడి గ్రంథం ఉపోద్ఘాతంలో 'ఇది కార్మిక వర్గ బైబిల్' అని ఏంగిల్స్ అభివర్ణించారు. తర్వాత పెట్టుబడి గ్రంథానికి ప్రభావితమై అనేక పోరాటాలు, ఉద్యమాలు వచ్చిన సంగతి తెలిసిందే.

'పెట్టుబడి'ని నిశ్శబ్దం ద్వారా హత్య చేయా లని ప్రయత్నించారనీ, అది సాధ్యపడలేదని ఏంగిల్స్ చెబుతారు. తర్వాత కాలంలోనూ ఈ ప్రయత్నం చేశారు. ముఖ్యంగా 1990 దశకం తర్వాత పెట్టుబడి గ్రంథాన్ని ప్రస్తావించడం తగ్గిపోయింది. సోవియట్ యూనియన్, ఇతర సోషలిస్టు వ్యవస్థలు పతనమైన అనంతరం మార్క్సిజం లేదు, సోషలిజం లేదు, మార్క్స్ లేడు, ఆయన 'పెట్టుబడీ' లేదు అనే స్థితికి వచ్చే సింది. ఒకప్పుడు ప్రపంచంలోని అన్ని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లోనూ మార్క్స్ 'పెట్టుబడి'ని బాగా అధ్యయనం చేసేవాళ్లు. మార్క్స్‌ని ఉద హరించకుండా, ఆయన వ్యాఖ్యలను ప్రస్తావించ కుండా పరిశోధన పత్రాలే ఉండేవికావు. 1990 తర్వాత కనీసం ప్రస్తావన చేసేవాళ్లే లేరు. ఆ రకంగా మళ్లీ 'నిశ్శబ్దం' ఆవరించింది. మార్క్స్‌ని, మార్క్స్ ఆలోచనలని సమాజం మర్చిపోయేస్థితిని తీసుకొచ్చారు. 2008 తర్వాత పరిస్థితి మళ్లీ మారింది. పెట్టుబడిదారి వ్యవస్థలో పెను సంక్షోభం ఏర్పడింది. 2008లోనే కాదు, అంత కు ముందు రష్యాలో, బ్రెజిల్, దక్షిణ కొరియా లోనూ మొత్తంగా తూర్పు ఆసియా లోనూ సంక్షోభం వచ్చింది. కానీ 2008లో అమెరికా లోనే వచ్చి, ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది.

ప్రపంచ ఆర్థికవ్యవస్థ మందగమనంలో ఉంది. అంటే 2008లో ఏర్పడిన మాంద్యం దశాబ్దకాలమైనా ఇప్పటికీ కొనసాగుతోంది. సంక్షోభం ఎందుకు కొనసాగుతోందో అర్థం చేసుకోవడానికి ఇప్పుడు మళ్లీ మార్క్స్‌ను అధ్యయ నం చేయడం మొదలు పెట్టారు. అప్పట్లోనే ఫ్రాన్స్ అధ్యక్షులుగా ఉన్న సర్కోజీ 'పెట్టుబడి' చదువుతున్నానని చెప్పాడు. అంటే ఆయనకు మార్క్సిజం మీద నమ్మకం కలిగిందని కాదు. మార్క్స్ చేసిన విమర్శల్లోంచి పెట్టుబడిదారి వ్యవస్థను రక్షించుకునే మార్గాలేమైనా దొరుకు తాయేమోనని పెట్టుబడి గ్రంథాన్ని అధ్యయనం చేస్తున్నారు. సోవియట్ యూనియన్ పతనం తర్వాత 'చరిత్ర ఆగిపోయింది' అని పుస్తకాలు కూడా వచ్చాయి. చరిత్ర అంతమైపోయింది. ఇక ఏ సిద్ధాంతానికి తావులేదు, పెట్టుబడిదారి వ్యవస్థ శాశ్వతమైపోయిందని దానర్థం. ఈ పుస్తకం రాసిన రచయితే 2008 మాంద్యం తర్వాత పెట్టుబడి మనుగడ కష్టమని రాశారు. ఆ విధంగా పరిష్కారం వెతుక్కునేవాళ్లూ పెట్టుబడి గ్రంథాన్ని చదవడం మొదలు పెట్టారు. 150 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో 'పెట్టుబడి' గ్రంథంపై మరింత ఆసక్తి పెరుగు తున్నది. ప్రస్తుతం నెలకొన్న సమస్యలను అర్థం చేసుకోవాలంటే ప్రజల్లో 'పెట్టుబడి' పుస్తక అధ్యయనం పట్ల ఆసక్తిని పెంచాల్సిన అవసరం కూడా ఉంది.

1945 వరకు హద్దులు లేని పెట్టుబడిదారి విధానాన్ని అమలు చేసేలా ప్రపంచంలో


పరిణామాలు జరిగాయి. రెండో ప్రపంచయుద్ధం తర్వాత (1980వ దశకం వరకు) ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ కొన్ని కొత్త లక్షణాలను సంతరించుకుని పనిచేసింది. రెండు ప్రపంచ యుద్ధాలు జరిగి సోషలిస్టు వ్యవస్థ వచ్చిన తర్వాత 1945 నుంచి 1980వ దశకం దాకా పెట్టుబడిదారి వర్గం హద్దులు లేని పెట్టుబడి దారీ విధానం నుండి వెనక్కుతగ్గింది. పెట్టు బడికి హద్దుమీరిన స్వేచ్ఛ ఇస్తే అసలుకే ప్రమాదం వస్తుందని భావించబడింది. హద్దులు లేని పెట్టుబడిదారి విధానం అంటూ కూర్చుంటే ఇప్పటికే మూడింట ఒక వంతు సోషలిజమైంది. ఇది మొత్తం విస్తరిస్తుందని, పెట్టుబడిని నియంత్రణ చేయాలని నిర్ణయించారు. అందుకోసం సోషలిస్టు వ్యవస్థ నుంచి కొన్ని తీసుకొని వినియోగించుకున్నారు. ప్రభుత్వ రంగాన్ని బల పర్చారు. ప్రభుత్వ ప్రాధాన్యతను పెంచారు. సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. గుత్త పెట్టుబడిదారి వ్యవస్థను అడ్డుకునేందుకు చర్యలు తీసుకున్నారు. అంతర్జాతీయ ద్రవ్య చలామణిలో సంక్షోభాలు రాకుండా ఐఎంఎఫ్‌ని, వరల్డ్ బ్యాంకుని ఏర్పాటు చేశారు. మళ్లీ సోషలిజం ప్రజల్లో మనసుల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే 1980 దశకం అంతానికి పరిస్థితులు మారాయి. సోషలిస్టు దేశాలు దెబ్బ తిన్నాయి. కొన్ని దేశాలలో సోషలిజం పతన మయింది. పెట్టుబడిదారీ దేశాల్లో సంక్షేమ విధానాలు పెట్టుబడి లాభాన్ని తగ్గించాయి. ఈ పరిస్థితు లు పెట్టుబడి లాభతృష్ణకు అడ్డంగా ఉండే నియంత్రణలను, విధానాలను తొలగించేందుకు దారితీశాయి. ఈ విధానాలనే సరళీకరణ విధానాలని పిలుస్తున్నాం.

మార్క్స్ పెట్టుబడి గ్రంథంలో హద్దులు లేని, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో వివరించాడు. అందువలన ఈ గ్రంథం పెట్టుబడికి హద్దులు లేని ప్రస్తుత సరళీకరణ విధానాలను, మోడి నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకుంటున్న నిర్ణయాలను అర్థం చేసుకోవటానికి బాగా తోడ్పడుతుంది.

"మార్క్స్ పెట్టుబడి దారీ విధానం యొక్క మౌలిక సూత్రాలను వెలికి తీసి చూయించాడు. ప్రధాన వైరుధ్యాలను బట్ట బయలు చేశాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత పెరిగినా, ఎంత సంక్లిష్టరూపం తీసుకున్నా ఈ మౌలిక లక్షణాలు కొనసాగుతాయి. అందువలన మార్క్స్ విశ్లేషణలను వినియోగించుకుని పెట్టుబడి దారీ విధానంలోని మార్పులను అవగాహన చేసుకోవచ్చు."




జర్మన్‌లో వెలువడిన పెట్టుబడి గ్రంథం రెండవ ముద్రణ



కారల్ మార్క్స్

### పెట్టుబడి ప్రాసంగికత

మార్క్స్ కాలంలో 'పర్యావరణం' వంటి సమస్యలు లేవు. ఇలాంటి కొత్త సమస్యలపై పెట్టుబడి చదివి ఏం అర్థం చేసుకుంటామనే మీమాంస కొంతమందికి ఉంటుంది. కానీ మనిషికి ప్రకృతికి సంబంధం ఎలా ఉండాలి, సమతుల్యత ఎలా ఉండాలనే విషయాలు కూడా మార్క్స్ ఆనాడే చెప్పాడు. అవి ఇప్పుడు కూడా ఉపయోగపడతాయి. 'లేబర్ ఈజ్ ద ఫాదర్ ఆఫ్ మెటీరియల్ వెల్త్, ద ఎర్త్ ఈజ్ ఇట్స్ మదర్' అని విలియం పెట్టీ పేర్కొన్న వ్యాఖ్యలను మార్క్స్ ఒక చోట ప్రస్తావిస్తారు. అంటే శ్రమ అనేది తండ్రి, ప్రకృతి అనేది తల్లి. పెట్టుబడిదారీ లాభార్జన కోసం ప్రకృతికి, మానవ మనుగడకున్న పరస్పర పోషక సంబంధాన్ని దెబ్బతీసి, ప్రకృతిని దోచుకోవటం మూలంగానే ఈనాడు పర్యావరణ సమస్యలు తీవ్రం అవుతున్నాయి. మానవ సంబంధాలు కూడా అంతే. పెట్టుబడిదారి విధానంలో మానవ సంబంధాలు పోయి, వ్యాపార సంబంధాలే మిగులుతాయి. ఇది కూడా మార్క్స్ ఆరోజే రాశారు.

పెట్టుబడిదారి విధానానికి ఉండే ఒకే ఒక నీతి పెట్టుబడికి లాభం తేవడం మాత్రమే. లాభం, స్వార్థం ఇవన్నీ కూడా పెట్టుబడిలోనే ఉన్నాయి. మార్క్స్ పెట్టుబడి గ్రంథం రాసిన 150 సంవత్సరాల క్రితం నాటికి, ఇప్పటికి పెట్టుబడిదారి విధానంలో ఎన్నో మారులొచ్చాయని, ఎన్నో కొత్త సమస్యలు వచ్చాయని, వాటిని వివరించటానికి పెట్టుబడి గ్రంథం సరిపోదని అనేవారున్నారు. అనేక మార్పులు, సమస్యలు వచ్చిన మాటనిజం. కాని వాటిని అర్థం చేసుకోవటానికి పెట్టుబడి గ్రంథం ఉపయోగపడదనుకోవటం అజ్ఞానం అవుతుంది. మార్క్స్ పెట్టుబడి దారీ విధానం యొక్క మౌలికసూత్రాలను వెలికి తీసి చూయించాడు. ప్రధాన వైరుధ్యాలను బట్ట బయలు చేశాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత పెరిగినా, ఎంత సంక్లిష్టరూపం తీసుకున్నా ఈ మౌలిక లక్షణాలు కొనసాగుతాయి. అందువలన మార్క్స్ విశ్లేషణలను వినియోగించుకుని పెట్టుబడి దారీ విధానంలోని మార్పులను అవగాహన చేసుకోవచ్చు.

పెట్టుబడిదారీ విధానానికి మూలం లాభార్జన. లాభార్జనను అడ్డుకునేదానిని దేనినీ అది సహించలేదు. లాభార్జనకు తోడ్పడేదానిని దేనినీ వదులుకోదు. పెట్టుబడిదారీ సమాజంలోని అన్ని పార్శ్వాలను– ఆర్థిక, సామాజిక,రాజకీయ వ్యవస్థలను, మానవ సంబంధాలను– ఇదే శాసిస్తుంది. ప్రభావితం చేస్తుంది. ఈ అంశం గమనంలో ఉంటే అన్ని సమస్యలను అర్థం చేసుకోవచ్చు.

పాత విలువలు పోయి కొత్త ఆర్థిక విలువలు ముందుకొస్తున్నాయి. కన్జూమరిజం (వినయోగ దారిత్వత్వం) వంటి వాటి గురించి కూడా పెట్టు బడి గ్రంథంలో సమాధానం దొరుకుతుంది.

అప్పులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. రైతులు అప్పులు చేస్తున్నారు. తీర్చలేక ఆత్మ హత్యలు చేసుకుంటున్నారు. లక్షల జీతం వచ్చే ఉద్యోగులు కూడా అప్పులు చేస్తున్నారు. ప్రతి

> “ మొదటి పేజీలోనే చివరివి అర్థం కావాలను కుంటే కుద రదు. చివరివి చివరనే అర్థం అవుతాయి. రోజు వారీ కనిపించే ద్రుగ్విషయాలన్నీ చివరలో వస్తా యి. ధరల గురించి మొదట్లో ప్రస్తావనే ఉండదు. మూడో భాగంలో ఉంటుంది. అలాగే లాభం గురించి కూడా మొదట్లో ఏమీ ఉండదు.చివర్లో వివరిస్తారు. ”



తమ భూములు ప్రభుత్వం తీసుకోవడానికి వ్యతిరేకంగా దళితుల ఆందోళన

ఒక్కరూ ఏదో రకంగా అప్పులు చేస్తున్నారు. ఇవి మనం చేస్తున్న అప్పులు కాదు. మన చేత చేయిస్తున్న అప్పులు. ఇప్పుడు ఎంత ఎక్కవ అప్పుందంటే అంత స్టేటస్. ప్రతిదానికి వాయి దాల పద్ధతిలో అప్పులు ఇస్తున్నారు. వీటిని తీర్చడంపైనే మన ధ్యాస అంతా ఉంటే ఇక మానవత్వం అంటూ సేవ చేసే అవకాశం ఎక్క దుంటుంది? ఈ రుణ విధానం గురించి కూడా మార్క్స్ పెట్టుబడిలో రాసినంత గొప్పగా ఇంకెవ్వ రూ ఎక్కడా రాయలేదు.

ప్రస్తుతం విద్య, వైద్యం, రైల్వేలు ఇలా అన్నీ వ్యాపారమవుతున్నాయి. సేవారంగాలన్నీ ఎందుకు వ్యాపారం అవుతున్నాయంటే పెట్టు బడిదారి విధానంలో సర్వం సరుకులవ్వాల్సిందే నని కమ్యూనిస్టు ప్రణాళికలో చెబుతారు. పెట్టుబడి గ్రంథం మొదట్లోనూ 'సర్వం సరుకుల మయం' అని చెబుతారు. అందుకే దేవుడు, పెళ్ళిళ్ళు ఇలా అన్నీ వ్యాపారమే అయ్యాయి. మీనాక్షి దేవాలయంలో ఏ రేటుకు ఎంత సేవో నిర్ణయిస్తున్నారు. చావును, పుట్టకను కూడా వ్యాపారం చేసేశారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు పెద్ద ఎత్తున భూసేకరణ చేస్తున్నాయి. పెట్టుబడిదారి మౌలిక లక్షణమేమంటే సొంతంగా వ్యవ సాయం చేసుకునేవాళ్ళు, వ్యాపారం చేసుకునే వాళ్లు, వృత్తులు చేసుకునేవాళ్లు సాధ్యమైనంత మేరకు ఉండకూడదు. వారి వ్యవసాయాన్ని, వాపారాలని, వృత్తులని పోగొట్టుకోవాలి. అలా పోగొట్టుకుంటేనే పెట్టుబడికి తగినంతగా శ్రమను అమ్ముకునేవాళ్లు దొరుకుతారు. అందుకనే ప్రభుత్వాలు భూములు లాక్కుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నోట్లరద్దు, జియస్‌టి నిర్ణయాలు ఈకోవలోనివే. దీనికి అభివృద్ధిఅని ముద్ర వేస్తారు. దీనినే కారల్ మార్క్స్ ప్రిమిటివ్ అక్యుములేషన్ (ప్రాథమిక సంచయం) అని పేర్కొంటారు.

### పెట్టుబడి గ్రంథం ప్రాధాన్యత

పెట్టుబడి గ్రంథం వాస్తవానికి ఆర్థిక శాస్త్ర గ్రంథమే కావచ్చు, కానీ ఇందులో గొప్ప సాహితీ సౌరభం కూడా ఉంది. మార్క్స్ అధ్య యనం చేసినంత సాహిత్యం, పెట్టుబడి గ్రంథం లో ప్రస్తావించినంత సాహితీ సామగ్రి గురించి ఇక ఎక్కడా ప్రస్తావించలేదు. దాదాపు 400 మంది సాహితీ వేత్తలను 'పెట్టుబడి' గ్రంథంలో ప్రస్తావించినట్లు ఒక అంచనా. విద్య, మతం, కుటుంబం, జెండర్ విషయాలు కూడా పెట్టు బడితో ఉన్న సంబంధాన్ని విశ్లేషిస్తూ ఆయన రాశారు. మానవ హక్కులు, స్వేచ్ఛ, సౌభ్రాతృ త్వం వంటి విషయాల ప్రస్తావన కూడా ఉంది. పెట్టుబడి గ్రంథాన్ని రాయడానికి 20 ఏళ్లు కృషి చేశారు. దుర్భర దారిద్ర్యం ఎదు ర్కొంటూ ఆయన ఈ గ్రంథం రాశారు. బిడ్డ పాలు తాగుతుంటే రక్తమొస్తోంది..తినడానికి తిండి లేదంటూ జెన్నీ ఒకసారి మిత్రునికి ఉత్తరం రాస్తారు. అంతటి కటిక దారిద్ర్యంలో మార్క్స్ ఈ పెట్టుబడి పుస్తకాన్ని రాశారంటే ఆయన ఎంత ప్రాధాన్యత ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. అయినా జెన్నీ మార్క్స్‌కు ఈ కృషిలో చేదోడువాదోడుగా నిలిచారు. మార్క్స్‌కు ఏంగెల్స్‌కు తోడ్పాటునందించారు. ఏ సమా జాన్ని అయినా అర్థం చేసుకోవాలంటే దానికి పునాదిగా పనిచేసే ఆర్థిక సంబంధాలను అధ్య యనం చేయాల్సిందేననీ వారివురు పెట్టుబడి గ్రంథ రచనకు అంతటి ప్రాధాన్యత ఇచ్చారు. జీవిత అనుభవం నుంచి పాఠాలు నేర్చుకొని మరీ ఈ పుస్తకాన్ని రాశారు. మార్క్స్ తత్వ శాస్త్రంలో పిహెచ్‌డి చేశారు. లా చదివారు. బతుకుదెరువు కోసం జర్నలిజం చేశారు. 1848లో విప్లవాలన్నీ విఫలమైన తర్వాత, విప్లవం విజయం సాధించాలంటే కార్మిక వర్గానికి శాస్త్రీయమైన పరిజ్ఞానాన్ని అందజేయా లని పెట్టుబడి రాశారు. సమాజాన్ని మార్చ డానికి ఒక ఆయుధంగా ఉపయోగపడాలని ఆయన ఈ గ్రంథం రాశారు.

### పెట్టుబడి గ్రంథం అధ్యయనం ఎలా

ఒక విశాలమైన ప్రదేశాన్ని తనివిదీరా చూసి, అస్వాదించాంటే ఎత్తైన్న కొండ ఎక్కాలి. అలాగే సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే 'పెట్టు బడి' గ్రంథం అసాంతం చదవాలి. మొదటి పేజీలోనే చివరివి అర్థం కావాలనుకుంటే కుద రదు. చివరివి చివరనే అర్థం అవుతాయి. రోజు వారీ కనిపించే ద్రుగ్విషయాలన్నీ చివరలో వస్తాయి. ధరల గురించి మొదట్లో ప్రస్తావనే ఉండదు. మూడో భాగంలో ఉంటుంది. అలాగే లాభం గురించి కూడా మొదట్లో ఏమీ ఉ ండదు. చివర్లో వివరిస్తారు. అందుకనే బృందా లుగా ఏర్పడి క్రమబద్ధంగా పెట్టుబడిని అధ్యయ నం చేయాల్సివుంటుంది.

పెట్టుబడిదారి విధానానికి, బానిస సమాజా నికి, రాచరిక వ్యవస్థకు కొన్ని సామ్యమైన విషయాలు ఉంటాయి. వాటిని అధ్యయనం చేస్తే ఏ వ్యవస్థనూ అర్థం చేసుకోవటం సాధ్యంకాదు. పెట్టుబడిదారి విధానం యొక్క ప్రత్యేకత గురించి అధ్యయనం చేస్తేనే దాని గురించి అర్థమౌతుంది. అందుకనే మార్క్స్ గ్రంథం పెట్టుబడి గురించే ప్రత్యేకంగా వివరిస్తుంది. ఇందులో సరుకు గురించి చెబుతారు. మానవశరీరంలో కణం

ఎలాంటిదో పెట్టుబడిదారీ విధానంలో సరుకు అలాంటిది.

పెట్టుబడి గ్రంథంలో మార్క్స్ కూడా కొన్ని ఊహలు చేశారు. అయితే ఈ ఊహలు బూర్జువా ఆర్థిక వేత్తలు చేసే ఊహల్లా అశాస్త్రీయమైనవి కావు. 'మనిషి ఎప్పుడూ స్వార్థపరుడు. అందరూ ఇలా స్వలాభం కోసం పనిచేస్తే సమాజమంతా బాగుంటుంది' అని ఆడమ్ స్మిత్ ఊహిస్తే మార్క్స్ 'సరుకులు సమాన విలువకి మారకం అవుతాయి' అని ఊహించాడు. సమాజంలో ధరలు మారకుండా దేని ధర దానికే ఉంటే ఏ మోసం లేకుండా మారకం జరుగుతుంది' అని మార్క్స్ ఊహించారు. ఈ ఊహలు శాస్త్రీయమైనవి. ఎందుకంటే సరుకులు సమాన విలువకు (ధరలకు) మారకం అయినా పెట్టుబడిదారులకు లాభం వస్తుందని రుజువు చేయగలిగితే అసమానంగా మారకం జరిగితేనే లాభం వస్తుందనే వాదన తప్పని ప్రత్యేకంగా రుజువు చేయాల్సిన అవసరం ఉండదు. తక్కువకు కొని ఎక్కువకు అమ్ముతున్నందున లాభం వస్తుందని చెప్పి, మభ్యపెట్టే వాదనల డొల్లతనాన్ని రుజువు చేసేందుకు ఇటువంటి ఊహలు అవసరం అయ్యాయి.

బూర్జువా ఆర్థికవేత్తలు 'సరుకులకీ సరుకులకీ మధ్యనే సంబంధాలుంటాయని చెబుతారు. మార్క్స్ దీనిని తప్పు అని చెప్పి మనిషికీ మనిషికీ మధ్య సంబంధాలే అలా కన్పిస్తాయని రుజువు చేశారు. కాబట్టి మనుషుల మధ్య సంబంధాలను అధ్యయనం చేయాలని మార్క్స్ చెబుతారు. సరుకు ధర నిర్ణయంపైనా బూర్జువా వర్గం చెప్పేదేమిటి? వినియమదారుడి యొక్క ఆసక్తిని, ఉపయోగాన్ని బట్టి ధర నిర్ణయమవుతుందని చెబుతారు. ధరకు, ఉపయోగానికి ఏమీ సంబంధం లేదని మార్క్స్ చెబుతారు. ఆ సరుకు తయారీకి ఎంత శ్రమకాలం పట్టిందో దానిని బట్టి విలువ ఉంటుందని మార్క్స్ చెప్పారు. అలాగే గతితార్కిక భౌతికవాదం అర్థం కావాలన్నా పెట్టుబడి గ్రంథం చదవాలి. భూస్వామ్య వ్యవస్థలో కానీ, బానిస వ్యవస్థలో కానీ అదనపు శ్రమను దోచుకోవడం స్పష్టంగా కనిపిస్తుంది. కానీ పెట్టుబడిదారి వ్యవస్థలో వాస్తవాలను మరుగుపర్చి ఈ అదనపు శ్రమను ఏ విధంగా దోచుకుంటారో మార్క్స్ పెట్టుబడి గ్రంథంలో ఫెటిసిజం (వాస్తవాన్ని మరుగునపర్చడం) పేరిట చక్కగా వివరించారు.

శ్రమకీ, శ్రమ శక్తికి ఉన్న వ్యత్యాసాన్ని మార్క్స్ కనుగొన్నారు. ఈ విషయాన్ని ఆయనే చెబుతారు. ఈ శ్రమశక్తిని పెట్టుబడిదారుడు కొంటాడు. మనం ఎనిమిది గంటలో, పది గంటలో అతని దగ్గర పనిచేస్తాం. దానిని శ్రమ అంటారు. అది శ్రమశక్తి కాదు. శ్రమ మాత్రమే. శ్రమశక్తి కోసం పెట్టుబడిదారుడు వేతనం ఇస్తాడు. ఆరు గంటలో, ఏడుగంటలో పనిచేస్తే మనకు ఇచ్చిన వేతనానికి సరిపోతుంది. శ్రమశక్తి లక్షణమేమిటంటే తాను వినియోగించే వస్తువుల కన్నా ఎక్కువ ఉత్పత్తి చేసే శక్తి దీనికి ఉంది. ఈ లక్షణాన్ని పెట్టుబడిదారుడు వినియోగించుకుంటున్నాడు. దీనినే అదనపు విలువ అని మార్క్స్ వివరించారు. దీనినే బూర్జువా ఆర్థికవేత్తలు ట్రినిటి ఫార్ములా, అంటే కార్మికుడు శ్రమ చేసినందుకు వేతనం, పెట్టుబడిదారుడు పెట్టుబడి పెట్టినందుకు లాభం, భూస్వామికి కౌలు అని ఎవరి ఆదాయం వారిది అని చెప్తారు.

"మార్క్స్ దీనితో విభేదించి కార్మికుడే అదనపు విలువను సృష్టించారు. దీనినే మిగిలిన వాళ్లు పంచుకుంటారు అని చెబుతారు. దీనిపై చాలా ప్రశ్నలు తలెత్తుతాయి, వాటన్నిటికీ మార్క్స్ సమాధానమిస్తారు. అలాగే డబ్బు అనేదానికి విలువ లేదని మార్క్స్ స్పష్టం చేస్తారు. డబ్బు అనేది సామాజిక సంబంధాల వ్యక్తీకరణే కానీ దానికి సహజ సిద్ధమైన విలువ లేదని ఆయన తేల్చారు."

మార్క్స్ దీనితో విభేదించి కార్మికుడే అదనపు విలువను సృష్టించారు. దీనినే మిగిలిన వాళ్లు పంచుకుంటారు అని చెబుతారు. దీనిపై చాలా ప్రశ్నలు తలెత్తుతాయి, వాటన్నిటికీ మార్క్స్ సమాధానమిస్తారు. అలాగే డబ్బు అనేదానికి విలువ లేదని మార్క్స్ స్పష్టం చేస్తారు. డబ్బు అనేది సామాజిక సంబంధాల వ్యక్తీకరణే కానీ దానికి సహజ సిద్ధమైన విలువ లేదని ఆయన తేల్చారు.

పెట్టుబడిదారి విధానంలో వైరుధ్యాల తీవ్రత ఎక్కువై పతనమైపోతుందని మార్క్స్ చెబుతారు. వైరుధ్యాలు తీవ్రం కావడమంటే మనుషుల యొక్క వర్గ ఆలోచనలు తీవ్రమవ్వడం, సంఘర్షణలు ఎక్కువ కావడం. అదే సమయంలో పెట్టుబడి కూడా తనను తాను కాపాడుకోవడానికి మనిషి తీరిక సమయాన్ని కూడా సరుకుగా మార్చేసి ఆలోచనలను, తిరుగుబాటుతత్వాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తుంటుంది. కానీ ఆ ప్రయత్నాలు ఎక్కువ కాలం సాగవు. ఈ పరిణామాలను అర్థం చేసుకొని శ్రామికవర్గాలు సంఘటితమైనపుడు పెట్టుబడి పతనం తథ్యం. అందుకనే పెట్టుబడి గ్రంథం అనేది శాస్త్రం. ఈ శాస్త్రాన్ని అర్థం చేసుకుంటే పెట్టుబడి పతనం తథ్యం. పెట్టుబడి ముసుగును తొలగించి, అసలు వాస్తవాలను వెలుగులోకి తెస్తే దాని పతనం సులభం అవుతుంది. అందుకని సాధ్యమైనంత మంది సామాన్యులను పెట్టుబడి గ్రంథం అధ్యయనం ద్వారా చైతన్యవంతులను చేయాల్సిన అవసరముంది.

(రాఘవులు గారి ప్రసంగానికి వ్యాసరూపం ఇచ్చినవారు)

**బి. అమరనారాయణ** ❋

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# పార్టీ - ప్రజాసంఘాలు

**ఎస్.వీరయ్య**



రచయిత
సిపిఐ(ఎం)కేంద్రకమిటి సభ్యులు

ప్రజాసంఘాలను, వర్గ సంఘాలను నడపడంలో అనేక లోపాలు వ్యక్తమవుతున్నాయని కోల్‌కతా ప్లీనం ఎత్తిచూపింది. ప్రజా సంఘాలను నడపడంలో పార్టీ ప్రత్యక్ష జోక్యం చేసుకునే ధోరణి కొనసాగకూడదని చెప్పింది. ఈ ధోరణి వల్ల ప్రజాసంఘాల స్వతంత్ర పని విధానం దెబ్బతింటున్నదనీ, వాటి ద్వారా ప్రజలను విస్తృతంగా కదిలించాలనే లక్ష్యానికి విఘాతం కలుగుతున్నదని హెచ్చరించింది. ప్రజా సంఘాలను ప్రజాతంత్రయుతంగా నడపడంలో కూడా వైఫల్యాలు కొనసాగుతున్నాయనీ, తక్షణం ఈ లోపాలను సరిదిద్దుకోవాలని చెప్పింది. ప్రజాసంఘాల కృషి ప్రధానంగా ప్రాథమిక కమిటీల ఆధ్వర్యంలోనే జరగాలనీ, ప్రాథమిక కమిటీల పని విధానమే ప్రజాసంఘాల పనికి కొలబద్దగా ఉండాలని చెప్పింది. అప్పుడే క్షేత్ర స్థాయిలో కృషి సమర్ధవంతంగా జరుగుతుంది. కిందిస్థాయి కార్యకర్తలను కూడా నిర్ణయాలలో భాగస్వాములను చేయటం ద్వారా ప్రజాతంత్ర పనివిధానానికి గ్యారెంటీ ఏర్పడుతుంది. పార్టీకీ, ప్రజాసంఘానికీ మధ్య ఉండవలసిన సంబంధం విషయంలో అనేక సందర్భాలలో కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారు. ఈ విషయంలో పార్టీ కేంద్రకమిటీ 1981లో ఆమోదించిన తీర్మానాన్ని పార్టీ శ్రేణులు లోతుగా అధ్యయనం చేయటం అవసరం. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, సభ్యులు ప్రజాసంఘాల్లో పని చేయాల్సిన తీరు గురించి ఈ తీర్మానం స్పష్టంగా వివరించింది. ఈ విషయంలో జరిగే లోపాల దుష్ఫలితాలు అనేక సందర్భాలలో వెనువెంటనే అర్థం కావు. ఆ నష్టాలు దీర్ఘకాలంలో మాత్రమే అర్థం చేసుకోగలుగుతాము. అందువల్ల ప్రజాసంఘాలతో వ్యవహరించే తీరు విషయంలో పార్టీ కేంద్రకమిటీ తీర్మానం చెప్పిన పద్ధతులను జాగ్రత్తగా పాటించాలి. ఎప్పటికప్పుడు అవసరం రీత్యానే కేంద్రకమిటీ సూచించిన పద్ధతులకు భిన్నంగా వ్యవహరిస్తున్నామని అనిపిస్తూంటుంది. అందుకే 2004లో పార్టీకి, ప్రజాసంఘాలకు మధ్య ఉన్న సంబంధాల మీద కేంద్రకమిటీ మరోసారి సమీక్షించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ కృషిని, ప్రజాసంఘాల కృషిని కలగాపులగం చేయవద్దని చెప్పింది. తక్షణ ప్రయోజనాల పేరుమీద కమ్యూనిస్టు అవగాహనకు భిన్నంగా వ్యవహరించడం వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలు దెబ్బతింటాయి.

**పార్టీకి, ప్రజాసంఘాలకు తేడా ఏమిటి?**

ప్రజాసంఘాలు గానీ, వర్గ సంఘాలు గానీ కమ్యూనిస్టు పార్టీకి అనుబంధ సంఘాలు కాదని చెప్పినప్పుడు పార్టీ శ్రేణులలోనే కొందరు గందరగోళానికి గురవుతున్నారు. మనం కమ్యూనిస్టులమయి ఉండీ మన నాయకత్వంలో నడుస్తున్న సంఘానికి కమ్యూనిస్టు పార్టీతో సంబంధం లేదని చెప్పడం సరైంది కాదేమోనన్న సందేహం వ్యక్తం చేస్తుంటారు. మనం నటిస్తున్నామేమోనని భావిస్తారు. పార్టీకి, ప్రజాసంఘాలు అనుబంధం కాదని చెప్పినంత మాత్రాన ఇది దాగేది కాదనీ, అందువల్ల బహిరంగంగానే చెపితే నష్టమేమిటని అనుమానం వ్యక్తం చేస్తారు. అంటే ఈ సంఘాలు కమ్యూనిస్టు పార్టీకి అనుబంధ సంఘాలుగానే ఇలాంటి సందేహాలున్న కామ్రేడ్స్ భావిస్తున్నారన్నమాట. లేదా పార్టీకి, ప్రజాసంఘాలకు మధ్య ఉన్న సంబంధం పట్ల స్పష్టత లేకపోవడం వల్ల గందరగోళానికి గురికావడం కూడా కావచ్చు. అందుకే పార్టీ కేంద్రకమిటీ తీర్మానాన్ని అధ్యయనం చేయడం తప్ప మరొక మార్గం లేదు. దగ్గరి దారి లేదు. అధ్యయనం చేస్తున్న సందర్భంలో వచ్చే సందేహాలను నాయకుల ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. తీర్మానాన్ని అధ్యయనం చేయకుండా నాయకులు ఆయా సందర్భాలలో చెప్పే విషయాల ఆధారంగానే పని చేసినప్పుడు కొన్ని సందర్భాలలో పొరపాట్లు దొర్లవచ్చు. ఎందుకంటే ఈ విషయంలో పొరపాట్లు కేవలం కిందిస్థాయిలో మాత్రమే కాదు, అన్ని స్థాయిల్లోనూ జరుగుతున్నాయని కేంద్రకమిటీ హెచ్చరించింది. అందుకే కేంద్రకమిటీ తీర్మానం ప్రాతిపదికగానే దేన్నయినా పరిశీలించాలి, ఆచరించాలి.

సాధారణ ప్రజలను సంఘటితం చేసేది ప్రజాసంఘం. ఆయా వర్గాలకు సంబంధించిన సాధారణ ప్రజలను సంఘటితం చేసేవి వర్గ సంఘాలు. కార్మికులను, వ్యవసాయ కార్మికులను, రైతులను, వృత్తిదారులను, మధ్యతరగతి ఉద్యోగులను సమీకరించి, సంఘటితం చేసేవి వర్గ సంఘాలు. యువజనులను లేదా విద్యార్థులను లేదా మహిళలను లేదా కులవివక్షకు గురవుతున్న తరగతులను తదితర ప్రజానీకాన్ని సమీకరించి సంఘటితం చేసేవి ప్రజా సంఘాలు. అంటే ఈ ప్రజాసంఘాలలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు భాగస్వాములు కావచ్చు. అందుకే వీటిని బహుళవర్గ సంఘాలు అంటారు.

ఆయా తరగతులు లేదా వర్గాలకు చెందిన ప్రజల తక్షణ సమస్యల పరిష్కారం కోసమే సంఘాలు పనిచేస్తాయి. దీర్ఘకాలిక లేదా శాశ్వత పరిష్కారాల కోసం పనిచేసేది కమ్యూనిస్టు పార్టీ. హక్కులు సాధించుకోవాలన్న స్థితి నుంచి వ్యవస్థనే మార్చాలన్న స్థితిలోకి ప్రజా చైతన్యాన్ని పెంచేది కమ్యూనిస్టు పార్టీ. అందుకే ప్రజాసంఘాలు ఆయా తరగతులు లేదా బాధిత ప్రజలను, వర్గ సంఘాలు ఆయా వర్గాలకు చెందిన ప్రజలను క్షేత్రస్థాయిలో సంఘటితం చెయ్యాలి. తక్షణ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనా పోరాటాలు నిర్వహించాలి. సాధ్యమైనంత విస్తృతంగా ఆయా పోరాటాలలో ప్రజలను భాగస్వాములను చెయ్యాలి. వారి సంసిద్ధతను బట్టి సమరశీల పోరాటాల వైపు నడిపించాలి.

ప్రజాసంఘంలో పార్టీ కృషి ఫ్రాక్షన్ కమిటీల ద్వారా జరగాలి. ఆయా సంఘాలలో పనిచేసే పార్టీ కార్యకర్తలు, సభ్యులు సాధారణ ప్రజలకన్నా చైతన్యయుతంగా పాల్గొనాలి. ఆందోళనా పోరాటాలలో ముందుపీఠిన నిలవాలి. పోరాటాలలో పాల్గొంటున్న సాధారణ ప్రజానీకాన్ని తాము ఎదుర్కొనే సమస్యలకు శాశ్వత పరిష్కారం గురించి చైతన్యపరచాలి. తక్షణ సమస్యల పరిష్కారం కోసం ఇచ్చే నినాదా

లు శాశ్వత లక్ష్యానికి ఆటంకం కాకుండా జాగ్రత్త పడాలి. ఆందోళనా పోరాటాలలో చురుకుగా, సమరశీలంగా పాల్గొంటున్న వారిని గుర్తించి ఆ సమస్యల పూర్వాపరాలు వివరించాలి. శాశ్వత పరిష్కారాల పట్ల ఆసక్తికల వారిని గుర్తించి ఆగ్జిలరీ శాఖలలోకి వారిని తీసుకుని కమ్యూనిస్టు అవగాహనను కల్పించాలి. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమంతో ఏకీభవించి పార్టీలో చేరేందుకు సిద్ధపడిన వారిని వారి అర్హతలను బట్టి పార్టీలోకి తీసుకోవాలి.

పార్టీని నిర్మించడం కోసం ప్రజాబాహుళ్యాన్ని విస్తృతంగా సమీకరించడం కోసం పార్టీ కార్యకర్తలు, సభ్యులు ప్రజాసంఘాల్లో చురుకుగా పనిచెయ్యాలి. విప్లవ సిద్ధాంతాన్ని నమ్ముతూ విప్లవ పార్టీని నిర్మాణం చెయ్యాలన్న దృక్పథంతో పని చెయ్యాలి.

**పొరపాటు ధోరణులు**

కొంతమంది కామ్రేడ్స్ విప్లవమే ప్రజాసంఘాల లక్ష్యం అనుకుంటున్నారు. వివిధ వర్గాలలో లేదా తరగతులలో విప్లవ కార్యాచరణ కోసమే ప్రజాసంఘాలు అని పొరపాటు పడుతున్నారు. ఆయా వర్గాలు లేదా తరగతుల్లో ఈ సంఘాలను పార్టీ విభాగాలుగా అర్థం చేసుకుంటున్నారు. కానీ ఈ అవగాహన సరైంది కాదని పార్టీ కేంద్రకమిటీ స్పష్టం చేసింది. విప్లవం, మౌలిక మార్పు, జనతా ప్రజాతంత్ర విప్లవం, రాజ్యాధికారం హస్తగతం చేసుకోవడం వంటివి కమ్యూనిస్టు పార్టీ నినాదాలు. రాజకీయంగా చైతన్యవంతులైన వారికి మాత్రమే అర్థమయ్యే నినాదాలు. సాధారణ ప్రజలను ఈ నినాదాలు ఆకర్షించవు. ఈ నినాదాలు దీర్ఘకాలిక పరిష్కారాలకు సంబంధించినవి. శాశ్వత పరిష్కారం గురించి చెప్పేవి. సాధారణ ప్రజలు అనునిత్యం తాము ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారాలు కావాలని కోరుకుంటారు. ఇలాంటి సమస్యల మీద వారిని కదిలించినప్పుడు విస్తృతంగా బాధితులంతా పెద్ద సంఖ్యలో పోరాటాల్లో పాల్గొనడానికి సిద్ధపడతారు. అంతే కాదు, వారికి స్థానికంగా వివిధ రాజకీయ పార్టీలతో అనుబంధాలు లేదా మొహమాటాలు లేదా భయాలు ఉంటాయి. అందువల్ల పార్టీ పిలుపులో పాల్గొనడానికి కొందరు వెనుకాడవచ్చు. ప్రజాసంఘం పిలుపయితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. అందుకే ప్రజాసంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రజా బాహుళ్యాన్ని సమీకరించేందుకు అవకాశాలు ఎక్కువ.

ఆయా రంగాలలో ప్రజాసంఘాలను పార్టీ విభాగాలుగా భావించడమంటే ఆచరణలో వాటిని పార్టీకి తోకలుగా మార్చడమే. పార్టీకీ, ప్రజాసంఘానికీ ఉండవలసిన విభజన రేఖను తుడిచివేయటం వల్ల విశాల ప్రజానీకాన్ని ఆకర్షించడానికి ఆటంకాలు ఏర్పడతాయి. అత్యంత వెనుకబడిన ప్రజానీకాన్ని ఆకర్షించవలసిన బాధ్యత ప్రజాసంఘాలది. సాధారణ ప్రజలంతా ఆయా ప్రజాసంఘాల్లో చేరడానికి అనుగుణమైన పరిస్థితులను ఏర్పరచాలి. ఇందుకు తోడ్పడే విధంగానే ఆయా ప్రజా లేదా వర్గ సంఘాలు తమ నినాదాలను, ఎత్తుగడలను రూపొందించుకోవాలి. 2004లో కేంద్రకమిటీ చేసిన తీర్మానం "ప్రజాసంఘమే పార్టీ ప్రతినిధిగా వ్యవహరించటం ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుంది" అని హెచ్చరించింది. "ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ కృషిని, ప్రజాసంఘాల కృషిని కలగాపులగం చేయవద్ద"ని, "ఇది ప్రజాసంఘాలను గైడ్ చేసే తిరుగులేని సూత్రం" అని చెప్పింది.

పార్టీకీ, ప్రజాసంఘానికీ ఏ విధమైన సంబంధం ఉండకూడదని కూడా కొంతమంది భావిస్తారు. సాధారణ ప్రజలు సహజంగానే ఇట్లా భావిస్తారు. కానీ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, సభ్యులు వారికన్నా చైతన్యవంతులుగా వ్యవహరించాలి. పార్టీ సభ్యులు కూడా ఇలా భావించడమంటే విప్లవ లక్ష్యాన్ని వదిలిపెట్టి సంస్కరణ వాదానికి లోను కావటమే. ఇలాంటి పొరపాటు అవగాహనలను సరిదిద్దేందుకే 1981లో కేంద్రకమిటీ ఆమోదించిన తీర్మానం స్పష్టమైన దిశానిర్దేశం చేసింది. కమ్యూనిస్టు పార్టీ సభ్యులు ఏ ప్రజాసంఘంలో పనిచేసినప్పటికీ వ్యక్తిగతంగా తాము కమ్యూనిస్టులు. అందువల్ల కమ్యూనిస్టు పార్టీ క్రమశిక్షణకు బద్ధులై వ్యవహరించాలి. కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి కట్టుబడి నడుచుకోవాలి. ఇక్కడే పార్టీ నిబంధనావళికి కట్టుబడటమా లేక ఆ ప్రజాసంఘం నిబంధనావళికి కట్టుబడటమా అనే సమస్య ముందుకొస్తుంది. కమ్యూనిస్టు పార్టీలో సభ్యులు కాబట్టి కమ్యూనిస్టు పార్టీ క్రమశిక్షణకు లోబడి పనిచేయవలసిందే. అదే సమయంలో ఒక ప్రజాసంఘంలో పనిచేస్తున్నప్పుడు ఆ ప్రజాసంఘం నిబంధనావళికి అతీతంగా వ్యవహరించే హక్కు ఎవరికీ ఉండదు. ఆయా ప్రజాసంఘాలలో నిర్ణయాలు చేసేటప్పుడు తాను కమ్యూనిస్టు కాబట్టి కమ్యూనిస్టు అవగాహనతో లేదా కమ్యూనిస్టు పార్టీ నిర్ణయానికి అనుగుణంగా ప్రతిపాదనలు పెట్టాలి. అవి ఆ ప్రజాసంఘంలోని ఇతర కమిటీ సభ్యులకు ఆమోదమయితే ఇబ్బంది రాదు. ఆమోదం కానప్పుడు చర్చ జరుగుతుంది. ఈ క్రమంలో తన ప్రతిపాదనల ప్రాధాన్యతను లేదా శాస్త్రీయతను ఇతరులు కూడా అంగీకరించే విధంగా వాస్తవ పరిస్థితుల ఆధారంగా చర్చ నడిపి ఒప్పించగలగాలి. ఆ సమస్య లోతుపాతుల గురించి, దేశంలో ఉన్న పరిస్థితుల గురించి తగిన అవగాహన ఉన్నప్పుడు మాత్రమే ఇతరులను ఒప్పించగలరు. అంతే కాదు, రోజువారీ కార్యక్రమాలలో ఇతరులకన్నా చురుకుగా, సమర్ధవంతంగా పనిచేసినప్పుడే వీరి ప్రతిపాదనలను ఇతరులు కూడా తీవ్రంగా పరిగణించి లోతుగా పరిశీలించే ప్రయత్నం చేస్తారు. కార్యక్రమాలలో చురుకుగా, సమర్ధవంతంగా పాల్గొనలేకపోవడం లేదా ఆ సమస్యల పట్ల లోతైన అవగాహన లేనప్పుడు తాను కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త అయినప్పటికీ పార్టీ అవగాహనకు అనుగుణంగా ఇతరులను ఒప్పించుకోవడంలో విఫలమవుతారు. అందువల్ల ఒప్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చెయ్యాలి. అయినా మెజారిటీ అంగీకరించనప్పుడు సంబంధిత ప్రజాసంఘం నిర్ణయమే తుది నిర్ణయం అవుతుంది. పార్టీ అవగాహనకు అనుగుణమైన నిర్ణయం చేయటంలో తామెందుకు విఫలమయ్యారో పార్టీ శాఖలో లేదా ఫ్రాక్షన్ కమిటీలో లేదా సంబంధిత కమిటీలో సమీక్షించుకోవాలి. స్థూలంగా పార్టీ కార్యకర్తలుగా ప్రజాసంఘాల బాధ్యతలు చూడాలి. పార్టీలో ప్రజాసంఘాల ప్రతినిధులుగా వ్యవహరించకూడదు. ప్రజాసంఘం వేదిక పైన, ప్రజాసంఘం పిలుపుతో విస్తృతంగా సమీకరించే ఆ తరగతి లేదా వర్గానికి చెందిన ప్రజల ప్రాథమిక

**"పార్టీకీ, ప్రజాసంఘానికీ ఏ విధమైన సంబంధం ఉండకూడదని కూడా కొంతమంది భావిస్తారు. సాధారణ ప్రజలు సహజంగానే ఇట్లా భావిస్తారు. కానీ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, సభ్యులు వారికన్నా చైతన్యవంతులుగా వ్యవహరించాలి. పార్టీ సభ్యులు కూడా ఇలా భావించడమంటే విప్లవ లక్ష్యాన్ని వదిలిపెట్టి సంస్కరణ వాదానికి లోను కావటమే."**

> “ఈ క్రమంలో పార్టీ ప్రత్యక్ష జోక్యాన్ని నివారించాలి. ప్రజాసంఘాల స్వతంత్రతను కాపాడాలి. పార్టీ మార్గదర్శక పాత్ర నిర్వహించాలి. ఆయా సంఘాలను ఫ్రాక్షన్ కమిటీల ద్వారా గైడ్ చెయ్యాలి. అంతే తప్ప పార్టీ నిర్ణయాన్ని ఆ ప్రజాసంఘం అమలు చెయ్యాలని ఆదేశించకూడదు.”

చైతన్యం పెంచగలుగుతాము. ఈ వెనుకబడిన చైతన్యంతో ఉన్న ప్రజలను పార్టీ కార్యక్రమాలతో అనుసంధానం చేయటం ఆ సంఘంలో పని చేస్తున్న పార్టీ సభ్యుల పని. ఇక్కడే సంఘంలో చురుకైన వారిని పార్టీతో అనుసంధానం చేయ వలసిన బాధ్యతను గుర్తించడంలో గందర గోళానికి గురై సంఘాన్నే పార్టీకి అనుబంధంగా పొరపాటుగా అర్థం చేసుకుంటున్నారు.

**అధిగమించే మార్గాలు**

ముందే చెప్పుకున్నట్టు ఈ లోపాలను అధిగమించడానికి పార్టీ కేంద్రకమిటీ తీర్మానాన్ని అధ్యయనం చేయటమే అత్యంత కీలకం. సరైన అవగాహనను ఏర్పరుచుకోవడం ద్వారా ఆయా ప్రజాసంఘాలలో పనిచేస్తున్న పార్టీ శాఖలు, ఫ్రాక్షన్ కమిటీలను రెగ్యులర్‌గా పనిచేయించాలి. వీటి ద్వారా ఆయా రంగాల ప్రజా సమస్యల మీద శాశ్వత పరిష్కారం కోసం కృషి కొనసాగించాలి. ఈ క్రమంలో పార్టీ ప్రత్యక్ష జోక్యాన్ని నివారించాలి. ప్రజాసంఘాల స్వతంత్రతను కాపాడాలి. పార్టీ మార్గదర్శక పాత్ర నిర్వహించాలి. ఆయా సంఘాలను ఫ్రాక్షన్ కమిటీల ద్వారా గైడ్ చెయ్యాలి. అంతే తప్ప పార్టీ నిర్ణయాన్ని ఆ ప్రజాసంఘం అమలు చెయ్యాలని ఆదేశించకూడదు. పార్టీ నిర్ణయాలను పార్టీ సభ్యులు, కార్యకర్తలు తమ తమ సంఘాలలో సమర్ధవంతంగా అమలు చేయగల నైపుణ్యాన్ని పెంచడంలో పార్టీ శ్రద్ధ వహించాలి. అందుకవసరమైన మెలకువలు నేర్పాలి. సందర్భోచితమైన సూచనలు చేస్తూ వారికి సహకరించాలి. ఆయా తరగతుల ప్రజలు బాధల్లో ఉన్నప్పుడు పార్టీ ప్రత్యక్షంగా సహాయపడాలి. ఆయా రంగాల ప్రజలు పోరాటాల్లో ఉన్నప్పుడు బహిరంగంగా సంఘీభావం తెలపాలి. ఆ పోరాటాల్లో జోక్యం చేసుకోవడం ద్వారా వారు విజయం సాధించడానికి సహాయపడాలి. తద్వారా పోరాటంలో ఉన్న సాధారణ ప్రజానీకానికి రాజకీయ నాయకత్వాన్ని అందించాలి. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు సహాయపడుతూ వారి పోరాటాల్లో అండగా నిలవడం ద్వారా కమ్యూనిస్టు పార్టీ ఆయా తరగతుల ప్రజానీకం విశ్వాసాన్ని చూరగొన గలుగుతుంది. ఇలాంటి సందర్భాలలో ఆయా పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్న సాధారణ ప్రజలందరి చైతన్యం పెంచేందుకు అవకాశం లభిస్తుంది. ఆయా ప్రజల మీద విస్తృతంగా పార్టీ ప్రభావం పడుతుంది. బూర్జువా పార్టీల విధానాలకు, ఆయా రంగాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ఉన్న సంబంధం గురించి కమ్యూనిస్టు పార్టీ వివరించినప్పుడు ప్రజలు అర్థం చేసుకుంటారు.

పై విషయాలు అర్థం చేసుకోవడానికి గత అనుభవాల నుండే కొన్ని ఉదాహరణలు పరిశీలించవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆర్‌టీసీ కార్మికులు 24 రోజుల పాటు సుదీర్ఘ సమ్మె చేశారు. సమరశీలంగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని పార్టీ శ్రేణులన్నీ తాము పనిచేస్తున్న ప్రజాసంఘాలతో నిమిత్తం లేకుండా ఈ సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొని కార్మికులకు అండగా నిలిచారు. ఆర్‌టీసీ కార్మికులు, వారి నాయకులకన్నా సీపీయం సభ్యులు, కార్యకర్తలే ఎక్కువ సంఖ్యలో అరెస్టయ్యారు. జైలుకు వెళ్ళారు. ఈ పోరాటాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను ఇతర రంగాల ప్రజల నుండి సంఘీభావం సమీకరించడం ద్వారా తిప్పికొట్టారు. కాంగ్రెస్ పాలనలో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో సాగుభూమి కోసం, ఇండ్ల స్థలాల కోసం సమరశీల భూపోరాటం సాగింది. తెలంగాణ సాయుధ పోరాటం తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలు భూపోరాటంలో సమరశీలంగా పాల్గొనడం మళ్ళీ ఇప్పుడే. సుదీర్ఘ కాలం సాగిన ఈ పోరాటంలో కూడా పార్టీ శ్రేణులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. సమరశీల పోరాటంలో అగ్రభాగాన నిలిచారు. వేలాదిగా కేసులను ఎదుర్కొన్నారు. జైళ్ళకు వెళ్లారు. విద్యుత్తు ఉద్యమం సందర్భంగా ఒకవైపు వివిధ ప్రజాసంఘాలు విస్తృతంగా ప్రజానీకాన్ని కదిలిస్తున్న సమయంలో పార్టీ కూడా ప్రత్యక్షంగా అండగా నిలవడం ద్వారా చారిత్రాత్మక పోరాటానికి నాయకత్వం వహించగలిగింది. కుల వివక్షకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లోనూ, ఎస్‌సీ ఎస్‌టీ సబ్‌ప్లాన్ కోసం జరిగిన ఉద్యమంలోనూ పార్టీ యావత్తూ ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారా ఆయా సామాజిక తరగతుల పోరాటాలకు అండగా నిలిచింది. ఆయా రంగాలకు సంబంధించిన ప్రజా పోరాటాలలో పార్టీ ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని ప్రజలకు అండగా నిలిచిన ఫలితంగా వారి మీద పార్టీ ప్రభావం విస్తృతంగా పడింది. సాధారణ పరిస్థితుల్లో ఆయా ప్రజాసంఘాలలో పనిచేసే పార్టీ సభ్యులు శాఖల ద్వారా, ఫ్రాక్షన్ కమిటీల ద్వారా చేసే కృషి వల్ల వచ్చిన ఫలితం కన్నా పోరాట సమయంలో పార్టీ జోక్యం ద్వారా విశాల ప్రజానీకం చైతన్యం పెంచడంలో వచ్చిన ఫలితం అనేక రెట్లు ఎక్కువ. తెలంగాణ రాష్ట్రంలో పారిశుధ్య కార్మికుల దీర్ఘకాలిక సమ్మెకు సంఘీభావంగా వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర బంద్ కూడా మంచి ప్రభావం చూపింది. 5 మాసాల పాటు సాగిన మహాజన పాదయాత్ర ఆయా సామాజిక తరగతుల మీద పార్టీ ప్రభావం పడడానికి తోడ్పడింది.

**కమిటీల పనిలో లోపాలు**

వివిధ రంగాలలో ఫ్రాక్షన్ కమిటీలు ఏర్పడి పనిచేస్తున్నప్పటికీ అనేక సందర్భాలలో ప్రజాసంఘాల ఎజెండాలే ఫ్రాక్షన్ కమిటీల్లో కూడా చర్చించడం చూస్తుంటాము. ఇది సరైంది కాదు. దీనివల్ల రెండు నష్టాలుంటాయి. ఆ రంగంలో జరగవలసిన పార్టీ కృషి నిర్లక్ష్యానికి గురవుతుంది. పార్టీ కృషికి సంబంధించిన చర్చ లేకపోవడం వల్ల ప్రణాళికాబద్ధంగా పార్టీ అభివృద్ధి కోసం కృషి జరగదు. ఆయా రంగాల ప్రజానీకం మీద పార్టీ ప్రభావం ప్రసరింపజేసేందుకు ప్రత్యేక ప్రయత్నం జరగదు. మరోవైపు ప్రజాసంఘం కమిటీలు నామమాత్రమైపోతాయి. నిర్ణయాలలో ప్రజాసంఘం కమిటీ సభ్యుల భాగస్వామ్యం తగ్గుతుంది. నిర్ణయాలు ఎక్కడో జరిగిపోతున్నాయన్న అసంతృప్తులు పెరుగుతాయి. ప్రజాసంఘం కమిటీలో ప్రజాస్వామ్య వాతావరణం దెబ్బతింటుంది. క్రమంగా ప్రజాసంఘం స్వతంత్రత కోల్పోతుంది. మరి కొన్ని సందర్భాలలో ఫ్రాక్షన్ కమిటీల పనినే

నిర్లక్ష్యం చేయడం గమనిస్తుంటాము. ఫ్రాక్షన్ కమిటీ ఉన్నప్పటికీ అది పనిచేయనప్పుడు ప్రయోజనం ఉండదు. పార్టీ కృషి పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతుంది. ఇవన్నీ లోతుగా పరిశీలించిన కోల్‌కతా ప్లీనం ప్రజాసంఘాల స్వతంత్రతను కాపాడాలనీ, ప్రజాస్వామికంగా పని చేయించాలనీ పునరుద్ఘాటించింది. 1981 లోనూ, 2004లోనూ పార్టీ కేంద్ర కమిటీ చేసిన తీర్మానాలను ఎక్కువ సందర్భాలలో ఉల్లంఘించారని ప్లీనం ఆందోళన వ్యక్తం చేసింది.

### ప్రాధాన్యతలు

అనేక ప్రజాసంఘాలకు పార్టీ మార్గదర్శకత్వం వహిస్తున్న నేపథ్యంలో, ఆయా ప్రజాసంఘాల ప్రాధాన్యతలకు సంబంధించిన చర్చ కూడా సహజమే. ఎవరికి వారు తాను పనిచేసే ప్రజాసంఘంలో వేగంగా ఫలితాలు సాధించాలని కోరుకోవడంలో తప్పులేదు. కోరుకోవాలి కూడా. కానీ విప్లవ లక్ష్యాలను, పరిమిత వనరులను గమనంలో ఉంచుకున్నప్పుడు అనేక ప్రజాసంఘాల మధ్య ప్రాధాన్యతల సమస్య కూడా ముందుకొస్తుంది. విప్లవ దశను బట్టి ఏ ప్రజాసంఘం పట్ల ఎలాంటి వైఖరి ఉండాలో నిర్ణయించబడుతుంది. జనతా ప్రజాతంత్ర విప్లవంలో ఆయా తరగతుల లేదా వర్గాల పాత్రను బట్టి ఆ ప్రజాసంఘం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది.

### ప్రధాన బలహీనతలు

పార్టీకి, ప్రజాసంఘాలకు మధ్య ఉన్న సంబంధాన్ని, ఎదురవుతున్న సమస్యలను 2004లో పార్టీ కేంద్ర కమిటీ సమీక్షించినప్పుడు మూడు ముఖ్యమైన బలహీనతలను గుర్తించింది. స్థూలంగా అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అందుకే కోల్‌కతా తీర్మానం పునరుద్ఘాటించింది. వీటిలో ప్రజాసంఘాల స్వతంత్రతను పాటించకపోవటం మొదటిది. అనేక సందర్భాలలో ఇది వ్యక్తమవుతున్నది. ప్రజాసంఘాల కార్యక్రమాల్లోనూ, సమావేశాల్లోనూ పార్టీ నినాదాలు ఇవ్వడం కొన్ని సందర్భాల్లో గమనిస్తాము. ప్రజాసంఘాల సభలలో ఆ సంఘంతో ప్రత్యక్ష సంబంధం లేని పార్టీ నాయకులు సందేశాల పేరుతో పాల్గొనడాన్ని కూడా కేంద్రకమిటీ ఎత్తిచూపింది. మరికొన్ని సందర్భాలలో ప్రజాసంఘాలే ప్రధాన బాధ్యతగా ఉన్న నాయకులు కూడా పార్టీ వేదికల మీద, పార్టీ నిర్వహించే విలేకర్ల సమావేశాలలో పాల్గొనడం కూడా మంచిది కాదు. పార్టీ కార్యాలయాలలోనే ప్రజాసంఘాల కార్యాలయాలు కూడా ఉండటం కూడా గమనిస్తున్నాము. ఇవన్నీ పార్టీని, ప్రజాసంఘాలను కలగాపులగం చేసేందుకు దారి తీస్తాయి. ప్రజాసంఘం స్వతంత్రతను కాపాడటంలో ఇబ్బందులు ఎదురవుతాయి. స్వతంత్రంగా ఆఫీసు నిర్వహించుకోగల ఆర్థిక స్తోమత లేనప్పుడు కొన్ని ప్రజాసంఘాలు కలిసి కార్యాలయం ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రజాసంఘాలలో నాయకత్వం ఎన్నిక సందర్భంగా అనుసరించాల్సిన పద్ధతుల విషయంలో కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. పార్టీ ప్రత్యక్ష జోక్యాన్ని నివారించడానికి మార్గదర్శకాలు తోడ్పడతాయి. కేంద్ర కమిటీ గుర్తించిన మరో లోపం ప్రజాసంఘాలలో ప్రజాతంత్ర పనివిధానం లోపించడం. పార్టీ దిశానిర్దేశం చేయవలసిన విషయాలు తప్ప రోజువారీ కార్యకలాపాలు, ఆయా రంగాల ప్రజా సమస్యలు, కర్తవ్యాలు ప్రజాసంఘాల కమిటీలలోనే చర్చించాలి. నిర్ణయాలు చేసేటప్పుడు గానీ, మహాసభలు నిర్వహించేటప్పుడు గానీ నాయకత్వాన్నీ, కమిటీలను ఎన్నుకునేటప్పుడు గానీ ఆ ప్రజాసంఘం నిబంధనావళిని తూచ తప్పకుండా పాటించాలి. పార్టీ అవగాహనకు అనుగుణంగా నిర్ణయం జరగాలంటే, ఆ అవగాహన ప్రాధాన్యతను, ఆ రంగంలో పనిచేసే పార్టీ కార్యకర్త, తన తోటి కమిటీ సభ్యులను ఒప్పించగలగాలి. నాయకత్వం ఎన్నిక సందర్భంగా కూడా తన ప్రతిపాదన ఔచిత్యాన్ని, ప్రాధాన్యతను ఇతరులకు అర్థమయ్యేటట్టు చెప్పగలగాలి. అంతే తప్ప ఇతరులను ఒప్పించలేని స్థితి ఏర్పడినప్పుడు ఇది పార్టీ నిర్ణయం కాబట్టి మీరు పాటించాలని చెప్పటం బలహీనతే అవుతుంది. ప్రజాసంఘం మీద పార్టీ నిర్ణయాన్ని రుద్దినట్టువుతుంది. ప్రజాసంఘంలో పనిచేసే పార్టీ కార్యకర్తలు ఇతరులకన్నా చురుకుగానూ, సమరశీలంగానూ పనిచేస్తూ లోతైన అధ్యయనం చేసినప్పుడు మాత్రమే ఇతరులు తమను నాయకులుగానూ, మార్గదర్శకులుగానూ స్వీకరిస్తారు. పార్టీ అవగాహనకు అనుగుణంగా ఇతరులను ఒప్పించలేనప్పుడు మెజారిటీ నిర్ణయానికి కట్టుబడటం తప్ప మరో మార్గం లేదు. అయితే పార్టీ కార్యకర్తగా పార్టీ నిర్ణయాలకు తాను బద్ధుడై ఉండవలసి ఉంటుంది. కాబట్టి తాను మైనారిటీలో పడిపోయి ఉండవచ్చు. అయినా మెజారిటీ నిర్ణయానికి తలొగ్గక తప్పదు. ప్రజాసంఘం నిబంధనావళిని అమలు జరపవలసిందే. పార్టీ అవగాహనకు అనుగుణంగా ఇతరులను ఒప్పించడంలో తామెందుకు విఫలమయ్యారో ఫ్రాక్షన్ కమిటీలోను, పార్టీ కమిటీలలోనూ సమీక్షించి తగిన గుణపాఠాలు తీసుకోవాలి. ప్రజాసంఘాల మహాసభల సందర్భంగా అనేక సోదర సంఘాల నాయకులు సంఘీభావ సందేశాల పేరుతో సుదీర్ఘ ఉపన్యాసాలు చేయటం కూడా సరైంది కాదని కేంద్రకమిటీ చెప్పింది. దీనివల్ల ఆ మహాసభలో పాల్గొంటున్న ఆ ప్రజాసంఘం ప్రతినిధులకు సమయం కోత పడుతుంది. ఇది ప్రజాతంత్ర పనివిధానానికి ఆటంకమే. కేంద్రకమిటీ ఎత్తిచూపిన మూడవ లోపం పార్టీ గైడెన్స్ పట్ల, పార్టీ నిర్మాణం పట్ల అవగాహన లోపం. మనం ముందే చెప్పుకున్నట్టు ఈ లోపాల వల్ల ప్రజాసంఘాలను పార్టీ తోకలుగా మలచటం లేదా ప్రజాసంఘాల నాయకులు పార్టీ కమిటీలను లెక్కచేయకపోవటం మనం గమనించవచ్చు. విప్లవ లక్ష్యాలు నెరవేరాలంటే ప్రజాసంఘాలు తమ పాత్రను సమర్థవంతంగా నిర్వహించే విధంగా పార్టీ తోడ్పడాలి. పార్టీ మార్గదర్శకత్వ

“పార్టీ దిశానిర్దేశం చేయవలసిన విషయాలు తప్ప రోజువారీ కార్యకలాపాలు, ఆయా రంగాల ప్రజా సమస్యలు, కర్తవ్యాలు ప్రజాసంఘాల కమిటీలలోనే చర్చించాలి. నిర్ణయాలు చేసేటప్పుడు గానీ, మహాసభలు నిర్వహించేటప్పుడు గానీ నాయకత్వాన్నీ, కమిటీలను ఎన్నుకునేటప్పుడు గానీ ఆ ప్రజాసంఘం నిబంధనావళిని తూచ తప్పకుండా పాటించాలి.”




సిఐటియు ప్రదర్శన దృశ్యం

"తాను పనిచేస్తున్న రంగానికి సంబంధించిన పూర్తి అవగాహన కలిగి ఉండాలి. మార్పులను నిరంతరం గమనిస్తూ ఉండాలి. పోరాటాలలో ఐక్య కార్యాచరణకు ప్రాధాన్యత నివ్వాలి. ఆ రంగానికి చెందిన ప్రజలు ఏ సంఘం లేదా ఏ రాజకీయ పార్టీ ప్రభావంలో ఉన్నప్పటికీ తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటంలోకి దిగవలసిన ప్రాధాన్యతను గుర్తించే విధంగా కృషి చెయ్యాలి."

పాత్ర నిర్వహిస్తూనే ప్రజాసంఘాల విశాల స్వభావాన్ని కాపాడాలి. ప్రజాసంఘాల పని ప్రాథమిక కమిటీల ఆధ్వర్యంలోనే జరగాలనీ, ప్రాథమిక కమిటీల పనే ప్రజాసంఘాల పనికి కొలబద్ధగా ఉండాలని కోల్‌కతా ప్లీనం దిశానిర్దేశం చేసింది. అంటే ట్రేడ్‌యూనియన్ రంగంలో యూనియన్ల పని విధానం, ఇతర ప్రజా సంఘాల విషయంలో ప్రాథమిక కమిటీల పని విధానం కీలకమవుతుంది. అప్పుడే క్షేత్రస్థాయిలో కృషి సమర్ధవంతంగా జరుగుతుంది.

**పని పద్ధతులు**

ప్రజాసంఘాలలో పనిచేసే కార్యకర్తలు ఆయా రంగాల ప్రజల సమస్యలను అధ్యయనం చెయ్యాలి. తక్షణ సమస్యలు, స్థానిక సమస్యలను గుర్తించాలి. నిరంతరం వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి. వారితో మమేకం కావాలి. వారి కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలి. వారికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్న విశ్వాసం కల్పించాలి. ప్రజల సంసిద్ధతను బట్టి ఆందోళనా పోరాట రూపాలను ఎంచుకోవాలి. అత్యంత ప్రాథమిక స్థాయిలో వారి చైతన్యం ఉన్నప్పుడు లేదా సమస్య వ్యక్తిగతం లేదా కొద్దిమందికి సంబంధించినది అయినప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించి వారికి సహాయం చెయ్యాలి. ప్రకృతి వైపరీత్యాలు లేదా సంఘ వ్యతిరేక శక్తుల నుండి ఇబ్బందులు ఎదురయినప్పుడు సహాయపడాలి. పెరుగుతున్న ఆర్థిక సమస్యల రీత్యా విద్యా, వైద్యం తదితర రంగాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రజా చైతన్యం పెంపొందించేందుకు, ఉద్యమబాట పట్టించేందుకు నిరంతరం ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాలి. వారి కదలికను బట్టి, సంసిద్ధతను బట్టి పోరాటాలకు కూడా పిలుపునివ్వాలి. ఒక సమస్య మీద కృషిని మధ్యలో వదిలిపెట్టవద్దు. ఆందోళనా పోరాటాలు పోడు వ్యవసాయం లాగా చేయకూడదు. ఒక సమస్య మీద కృషి ప్రారంభించినప్పుడు ఫలితం వచ్చేదాకా కొనసాగించాలి. ఆయా తరగతుల లేదా వర్గాల ప్రజలతో మమేకమై నిరంతరం కృషి చేయడం ద్వారా ఆయా రంగాలకు చెందిన ప్రజలను పెద్ద ఎత్తున కదిలించగలగాలి. వారి సమస్యను ఛాంపియన్ చేయాలి. ఆయా రంగాలలోని చురుకైనవారు, విద్యావంతులు అందరినీ ప్రభావితం చేయగలిగే విధంగా కృషి చేయాలి. జిల్లావ్యాపిత, రాష్ట్రవ్యాపిత ప్రభావం చూపించగల క్యాంపెయిన్స్, పోరాటాలు నిర్వహించాలి. మొత్తం మీద నిరంతర కార్యాచరణ ఉండాలి. ప్రజలు కదలనప్పుడు సహాయ కార్యక్రమాలు, ఆందోళనా రూపాలు, కదిలినప్పుడు పోరాటాలు, సందర్భోచితంగా రాజకీయ సైద్ధాంతిక కృషి నిరంతరం జరగాలి. తాను పనిచేస్తున్న రంగానికి సంబంధించిన పూర్తి అవగాహన కలిగి ఉండాలి. మార్పులను నిరంతరం గమనిస్తూ ఉండాలి. పోరాటాలలో ఐక్య కార్యాచరణకు ప్రాధాన్యతనివ్వాలి. ఆ రంగానికి చెందిన ప్రజలు ఏ సంఘం లేదా ఏ రాజకీయ పార్టీ ప్రభావంలో ఉన్నప్పటికీ తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటంలోకి దిగవలసిన ప్రాధాన్యతను గుర్తించే విధంగా కృషి చెయ్యాలి. స్థూలంగా విశాల జన బాహుళ్యాన్ని కదిలించటం ప్రజాసంఘం పని. పార్టీయెడల సదభిప్రాయం లేని సాధారణ ప్రజానీకం కూడా చేరడానికి, వారిని ప్రజాసంఘాల్లోకి సమీకరించడానికి కృషి చేయటం అతి ముఖ్యమైన కర్తవ్యంగా ఉండాలి. ఈ మొత్తం ప్రక్రియలో నిరంతరం పార్టీ మార్గదర్శక పాత్ర పోషించాలి. ప్రత్యక్ష జోక్యం నివారించాలి. మానవ శరీరంలో మెదడు అన్నింటికన్నా గొప్పది. కానీ అది ఎక్కడా కనిపించదు. కనిపిస్తే మనిషి బతకడు. అట్లానే పార్టీ చాలా గొప్పది. కానీ ప్రజాసంఘాల రోజువారీ కార్యక్రమాలలో ప్రత్యక్షంగా కనిపించాలనుకోకూడదు. పోరాటాల సందర్భంగా వ్యవహరించవలసిన తీరు ముందే చెప్పుకున్నాము.

**కోల్‌కతా ప్లీనం దిశానిర్దేశం**

వ్యవసాయ రంగంలోనూ, కార్మిక, మధ్య తరగతి రంగాలలోనూ సరళీకృత ఆర్థిక విధానాల ప్రభావాలను కేంద్ర కమిటీ లోతుగా అధ్యయనం చేసింది. ఆయా రంగాలలో ప్రజా జీవితంలో, వర్గ పొందికలో వచ్చిన మార్పులకు అనుగుణంగా ప్రజాసంఘాల పని తీరులో రావలసిన మార్పుల గురించి దిశానిర్దేశం చేసింది.

వ్యవసాయ రంగంలో గ్రామీణ పేదల సమస్యల మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలి. గ్రామీణ ప్రాంతాలలో ఇప్పుడు కేవలం భూస్వాములే కాకుండా కొత్తగా ఎదిగిన ధనిక వర్గాలు కూడా పట్టు కలిగి ఉన్నాయి. భూస్వాములు కూడా కేవలం వ్యవసాయ రంగంలో వచ్చే ఆదాయం మీద మాత్రమే ఆధారపడటం లేదు. వ్యవసాయ రంగం నుండి సంపాదించిన సొమ్మును ఇతర వ్యాపారాలు, పరిశ్రమలలో పెట్టుబడిగా పెడుతున్నారు. పేదల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించడంలో వీరంతా పరస్పరం సహకరించుకుంటున్నారు. అందువల్ల భూస్వాములకు, ఈ కొత్తగా ఎదిగిన గ్రామీణ ధనిక వర్గాలకు కూడా వ్యతిరేకంగా పోరాడాలి. సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో సైతం విస్తరిస్తున్న వ్యవసాయేతర కార్మికులు, వృత్తిదారులను కూడా సమీకరించడంలో శ్రద్ధ వహించాలి. వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, కౌలు రైతులు, మధ్యతరగతి రైతులు, వ్యవసాయేతర గ్రామీణ కార్మికులు, వృత్తిదారుల సమస్యల మీద పని చేయాలి. వీరి మధ్య ఐక్య పోరాటాలకు కృషి చేయాలి. పేదలకు భూమి పంపకం భూమి సమస్యలో ఒక భాగం. ఇప్పటికే భూమి కలిగి ఉన్న రైతులకు తమ భూమి మీద ఉన్న హక్కును కాపాడేందుకు కూడా పోరాడాలి. పరిశ్రమలు, ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో ప్రభుత్వాలు రైతుల భూములను బలవంతంగా గుంజుకోవడాన్ని వ్యతిరేకించాలి. తెలంగాణలో మల్లన్నసాగర్ ఉద్యమం గానీ, ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి రైతుల ఉద్యమం గానీ ఇలాంటివే. అంతేకాదు, పెట్టుబడిదారీ అభివృద్ధి ఫలితంగా గ్రామీణ ప్రాంతాల నుండి మండల కేంద్రాలకు, పట్టణ కేంద్రాలకు పెద్ద ఎత్తున వలసలు పెరుగుతున్నాయి. స్థిర నివాసం లేని వీరికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. అందువల్ల వలస కార్మికుల సమస్యల మీద కూడా పని చేయాలి.

కార్మిక రంగంలో కూడా ఈ కాలంలో తీవ్రమైన మార్పులు చోటు చేసుకున్నాయి. కార్మికవర్గ పొందికలో అనేక మార్పులొచ్చాయి.

పరిశ్రమలలో గానీ, ఇతర రంగాలలో గానీ శాశ్వత స్వభావం గల పనులలో కూడా అత్యధి కులను తాత్కాలిక ప్రాతిపదికపైనే నియమి స్తున్నారు. వలంటీర్లు, అప్రంటిస్‌లు, మహిళా గ్రూపులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, దినసరి వేతన కార్మికులుగానూ, ఉద్యోగులుగానూ రకరకాల పేర్లతో నియమిస్తున్నారు. ఫలితంగా ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడింది. అనుక్షణం భయపడుతూ పనిచేయవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వీరిని సంఘటితం చేసేందుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. పని స్థలంలో వీరిని కలవడం, సంప్రదించటం కూడా కష్ట మవుతున్నది. కాంట్రాక్టర్లకు, యజమానులకు భయపడి వృత్తి స్థలంలో యూనియన్ నాయకులతో మాట్లాడేందుకు వెనుకాడుతున్నారు. అందువల్ల పని స్థలంలో కార్మికులను కలిసేం దుకు ఏర్పడిన పరిమితులను అధిగమించేందుకు నివాస ప్రాంతాలలో వారిని సంప్రదించాలి. నివాస ప్రాంతాలలో ప్రత్యేక కృషి చేయటం ద్వారా పని స్థలంలో వారిని సంఘటితం చేయడానికి మార్గం ఏర్పడుతుంది. భారీ, మధ్య తరహా పరిశ్రమలలో సైతం పర్మినెంటు కార్మి కుల సంఖ్య తగ్గిపోతున్నది. అత్యధికులను తాత్కాలిక ప్రాతిపదిక మీదనే నియమిస్తున్నారు. అందువల్ల ఈ తాత్కాలిక కార్మికుల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టకుండా, వీరిని సంఘటితం చేయకుండా యాజమాన్యానికి వ్యతిరేకంగా పోరాడలేము. కేవలం పర్మినెంటు కార్మికులకు పరిమితమైతే యూనియన్ల బేరసారాల శక్తి బలహీనపడు తుంది. ఉత్పత్తిని స్థంభింపజేయగల శక్తి కూడా కోల్పోతారు. ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలక పాత్ర వహించే రక్షణ తదితర ప్రభుత్వరంగ పరిశ్రమలలో కూడా తాత్కాలిక కార్మికుల వినియోగం బాగా పెరిగింది. కీలక పరిశ్రమల మీద, తయారీ రంగ పరిశ్రమల క్లస్టర్స్ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి కార్మికవర్గాన్ని ఐక్యపోరాట దిశగా నడిపించాలి. ఈ మొత్తం కృషిలో శ్రామిక మహిళలు, దళితులు, గిరిజనులు, యువతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నిర్దిష్టంగా వారి సమస్యల మీద కూడా పని చేయాలి. యూనియన్ల కార్యకలాపాలలో, నాయకత్వంలో వీరి భాగస్వా మ్యం పెంచాలి. పని స్థలంలో లైంగిక వేధింపు లకు వ్యతిరేకంగా కృషి చేయడం ద్వారా యూని యన్లు శ్రామిక మహిళలకు అండగా నిలవాలి. పారిశ్రామిక రంగంలో దళిత, గిరిజన కుటుంబా ల నుంచి వచ్చిన కార్మికుల ప్రత్యేక హక్కుల అమలు కోసం కృషి చేయడం తమ బాధ్యతగా యూనియన్లు గుర్తించాలి. సమాజంలో వ్యక్త

**"కీలక పరిశ్రమల మీద, తయారీ రంగ పరిశ్రమల క్లస్టర్స్ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి కార్మికవర్గాన్ని ఐక్యపోరాట దిశగా నడిపించాలి. ఈ మొత్తం కృషిలో శ్రామిక మహిళలు, దళితులు, గిరిజనులు, యువతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నిర్దిష్టంగా వారి సమస్యల మీద కూడా పని చేయాలి. యూనియన్ల కార్యకలాపాలలో, నాయకత్వంలో వీరి భాగస్వా మ్యం పెంచాలి."**



సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కార్మికసంఘం ప్రదర్శన

మవుతున్న కుల వివక్షకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని సమీకరించాలి.

మధ్యతరగతి రంగంలో కూడా ఈ రెండు న్నర దశాబ్దాలలో అనేక మార్పులు సంభవిం చాయి. సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా మధ్యతరగతి కూడా ఎంతో కొంత లాభపడింది. ఫలితంగా ఈ విధానాలకు వ్యతిరేకంగా జరగ వలసిన పోరాటంలో మధ్యతరగతి కదలికకు కొన్ని పరిమితులేర్పడ్డాయి. మరో రూపంలో కొత్త కొత్త సమస్యలు కూడా వస్తున్నాయి. విద్య, వైద్య రంగాల్లో పెరుగుతున్న కార్పొరేటీకరణ, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల్లో వచ్చిన మార్పు లు మధ్యతరగతి జీవితాలను కూడా కుదుపుకు గురి చేస్తున్నాయి. పర్యావరణ సమస్యలు, పెన్షన్ హక్కు మీద జరుగుతున్న దాడి, ప్రపంచీకరణ విధానాల ఫలితంగా పెరుగుతున్న మానసిక ఒత్తిడులు, సామాజిక సమస్యలు వీరిని కూడా వెన్నాడుతున్నాయి. అందువల్ల ఈ రంగంలో ఇప్పటివరకూ చేస్తున్న కృషిని కొనసాగిస్తూనే అనేక నూతన పద్ధతులను కూడా అన్వేషించాలి, పాటించాలి. పౌర వేదికలను ఏర్పాటు చేయాలి. పౌర సమస్యలపైన ఇవి స్పందించాలి. పట్టణ మధ్యతరగతి ప్రజలు నివసించే కాలనీలలో సాంస్కృతిక వేదికలు ఏర్పాటు చేయాలి. తీరిక సమయాలలో సాంస్కృతిక కార్యక్రమాలలో వారిని భాగస్వాములను చేయాలి. పెన్షనర్లను కూడా వారి సంఘాలలో విస్తృతంగా సమీకరిం చాలి. అవినీతి, కాలుష్యం, సుపరిపాలన, పార దర్శకత వంటి ప్రత్యేక సమస్యల మీద నిరం తరం చర్చా గోష్ఠులు నిర్వహించాలి.

సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా వస్తున్న మార్పులను గమనించి మన పని పద్ధతులలో కూడా తగు మార్పులు చేసుకోవటం అవసరం. ఇక ముందు కూడా అనేక మార్పులు జరుగుతూనే ఉంటాయి. మన చుట్టూ సమా జంలో వస్తున్న మార్పుల ప్రభావాలు ఆయా రంగాలను నిరంతరం ప్రభావితం చేస్తాయి. ఈ మార్పులను గమనిస్తూ, మారిన పరిస్థితుల్లో కూడా ఆయా రంగాల ప్రజలను సమీకరిం చేందుకు అవసరమైన పని పద్ధతులను ఎంచు కోవాలి. ఎన్ని పరిమితులేర్పడ్డా, ఎన్ని ఆటంకాలు ఎదురయినా ప్రజల భాగస్వామ్యం లేకుండా విప్లవాలు జయప్రదం కావు. తమ సమస్యల పరిష్కారం కోసం తామే రంగంలోకి దిగాలనీ, ఈ సమాజ మార్పు కోసం తామే స్వయంగా పోరాడాలనీ ప్రజలు గ్రహించేదాకా, వారు రంగంలోకి దిగే దాకా ఈ కృషి నిరంతరం సాగవలసిందే. అందుకే కమ్యూనిస్టుకు విరామం లేదు. విరామం కోరుకుంటే కమ్యూనిస్టు కాజాలరు. ❋

# గల్ఫ్‌లో మరో కుంపటి రాజేసిన అమెరికా

**ఎస్. వెంకట్రావు**



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, 'మార్క్సిస్టు' సంపాదకులు

గత ఏప్రిల్ 20న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొమ్మిది దేశాల పర్యటనలో భాగంగా సౌదీ అరేబియా, ఇజ్రాయిల్ సందర్శించి వెళ్లిన 15 రోజులకు గల్ఫ్ సహకార సంస్థ (జిసిసి) దేశాల మధ్య తీవ్రమైన ఉద్రిక్తతలు నెలకొన్నాయి. సౌదీ అరేబియా, యుఎఇ, బహ్రాయిన్, ఈజిప్టు, ఎమెన్ దేశాలు జిసిసిలో భాగస్వామిగా ఉన్న అతి చిన్న దేశమైన కతర్‌పై ఆర్థిక దిగ్బంధనం విధించడంతో పర్షియన్ గల్ఫ్ ప్రాంతం ఒక్కసారిగా తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయింది. మధ్య ఆసియాలో ఉగ్రవాదానికి కతర్ మద్దతిస్తోందని ఆరోపిస్తూ సౌదీ నేతృత్వంలో అయిదు దేశాలు జూన్ 5న కతర్‌తో దౌత్య సంబంధాలు తెంచుకున్నాయి. కతర్‌కు ఉన్న ఏకైక సరిహద్దు దేశం సౌదీ అరేబియా నుండి వాణిజ్య మార్గం మూసేశారు. కతర్‌కు వాణిజ్య, రవాణా రాకపోకలను నిలిపేశారు. విమానాలు తమ దేశాల గగన తలం పై ఎగర కుండా, ఓడలు రాకుండా నిషేధించారు. కతర్ రాజధాని దోహా నుండి జిసిసి దేశాలు తమ దౌత్యవేత్తలను వెనక్కు రప్పించాయి.

ఈ హఠాత్ పరిణామం నుండి తేరుకోక ముందే అయిదు దేశాల కూటమి కతర్‌కు 13 డిమాండ్లతో కూడిన ఫర్మానా జారీ చేసింది. ఇరాన్‌తో కతర్ సంబంధాలు తెంచుకోవాలి, అరబ్బు ప్రపంచంలో బాగా ప్రాచుర్యం పొందిన అల్ జజీరా టివీ ఛానెల్‌ను మూసేయాలి, ఉగ్రవాదులతో ముఖ్యంగా ముస్లిం బ్రదర్ హుడ్ సంస్థతో సంబంధాలు తెంచుకోవాలి... అనేవి షరతుల్లో ముఖ్యమైనవి. ఈ షరతులకు కతర్ ససేమిరా అంగీకరించలేదు. ఇవి తమ దేశ సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకోవడమేనని కతర్ ప్రభుత్వం ప్రకటించింది. ఉగ్రవాదులతో తమకెలాంటి సంబంధాలూ లేవని పేర్కొంది.

కతర్‌పై తోటి గల్ఫ్ సహకార సంస్థ (జిసిసి) సభ్యులు తీసుకున్న ఈ కఠిన ఆంక్షలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించగా అమెరికా ప్రభుత్వంలోని ఇతరులు ఆయనతో విభేదించారు. రష్యా, ఇరాన్, టర్కీలు కతర్‌కు దన్నుగా నిలిచాయి. కువైట్ రెండు పక్షాల మధ్య మధ్యవర్తిత్వానికి ఉపక్రమించింది. సంక్షోభం తలెత్తి నెలరోజులు కావస్తున్నా ప్రతిష్టంభన తొలగకపోగా రాను రాను మరింత బిగుసుకు పోతోంది. గల్ఫ్ సంక్షోభం యుద్ధానికి దారి తీయవచ్చునన్న భయాలూ వ్యక్తమవుతున్నాయి. 11 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 27 లక్షల జనాభా అందులోనూ 8.5 లక్షల మంది పౌరులు గల చిన్న దేశంపై విధించిన ఆర్థిక దిగ్బంధనం ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగించడానికి నేటి రాజకీయ భూగోళంలో కతర్‌కున్న ప్రత్యేకతే కారణం.

**కతర్ గురించి...**

ప్రపంచంలోనే అత్యంత ధనిక దేశం కతర్. దేశ జనాభాలో పౌరుల సంఖ్య తక్కువ. పనుల కోసం వలస వచ్చిన ప్రజలు ఎక్కువ. కతర్ పౌరుల సగటు తలసరి వార్షిక ఆదాయం 1.79 లక్షల డాలర్లు. 20వ శతాబ్దం ప్రారంభం వరకు చేపల వేటపై ఆధారపడ్డ చిన్న దీవి చమురు నిల్వలు బయట పడడంతో ధనిక దేశంగా మారింది. ప్రపంచంలో అత్యధిక సహజ వాయు నిల్వలు గల దేశాల్లో కతర్ ఒకటి. ప్రపంచ సహజ వాయు నిల్వల్లో 14 శాతం ఇక్కడున్నాయి. 2500 కోట్ల బ్యారెళ్ల చమురు నిల్వలను అక్కడ గుర్తించారు.

ప్రస్తుత కతర్ రాజు తమిమ్ బిన్ హమద్ అల్ థాని 2013లో తండ్రి నుండి అధికారం స్వీకరించాడు. తండ్రి షేక్ హమద్ బిన్ ఖలీఫా అల్ థాని తన 14 ఏళ్ల పాలనలో దేశంలోని చమురు నిల్వలను ఉపయోగించుకుని కతర్‌ను ఆధునిక ధనిక దేశంగా తీర్చిదిద్దాడు. కుమారుడు హమద్ అల్ థాని కూడా తండ్రి బాటలో నడుస్తున్నాడు. ఆధునిక ప్రపంచంలో అనేక అంతర్జాతీయ ఉత్సవాలకు కతర్ రాజధాని దోహా ఆతిథ్యమిస్తోంది. దోహా అంతర్జాతీయ ట్రేడ్ ఫెయిర్, దోహా వార్షిక సాంస్కృతిక ఉత్సవం, దోహా అంతర్జాతీయ బుక్ ఫెయిర్... ఇలా నిత్యం అక్కడ ఏదో ఒక అంతర్జాతీయ వేడుక జరుగుతుంటుంది. దోహా ఈ దఫా అంతర్జాతీయ వాణిజ్య చర్చలకు వేదికయ్యింది. నాలుగేళ్ల కొకమారు జరిగే అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలు ఫిఫా వరల్డ్ కప్ 2022లో దోహాలో జరుగుతాయి. ఇటీవలి కాలంలో దోహా అంత ర్జాతీయ క్రీడా వేదికగా మారింది. వీటన్నిటి వల్లా అక్కడ టూరిజం బాగా అభివృద్ధి చెందింది. దోహా అంతర్జాతీయ విమానాశ్రయం నిత్యం ట్రాన్సిట్ విమానాలతో రద్దీగా ఉంటుంది.

కతర్ మరో ప్రత్యేకతను కూడా సంపాదించింది. గల్ఫ్ సహకార సంస్థలోని పెద్ద రాజ్యమైన సౌదీ అరేబియా చెప్పిందే వేదంగా ఇతర దేశాల రాజులంతా వ్యవహరిస్తారు. కానీ కతర్ మాత్రం తన దంటూ సొంత వైఖరిని ప్రదర్శిస్తుంది. మధ్య ప్రాచ్యంలోనే అతి పెద్ద అమెరికా నౌకా స్థావరం కతర్‌లో ఉన్నప్పటికీ అనేక విషయాల్లో అది అమెరికా మాట కూడా వినకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తోంది. అందువల్లనే ఇటు సౌదీ అరేబియా, అమెరికా వంటి దేశాలకు కతర్ పొడ గిట్టకుండా ఉంది. ప్రస్తుత దిగ్బంధానికి కారణం అదే.

**ఎందుకీ దిగ్బంధనం?**


మధ్య ప్రాచ్యంలో స్వతంత్రంగా వ్యవహరిస్తున్న దేశాలన్నిటిపైనా అమెరికా సామ దాన భేద దండోపాయాలు ఉపయోగించింది. ఇరాక్, లిబియాలపై దాడులు చేసి ప్రభుత్వాలు మార్చేసింది. సిరియాను నాలుగేళ్లుగా దాడులతో అతలాకుతలం చేస్తోంది. ఈ ప్రాంతంలో ఇప్పటికీ అమెరికన్ సామ్రాజ్యవాదులకు లొంగని దేశం ఏదైనా ఉందంటే అది ఇరాన్. అందుకని ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డం పెట్టుకుని దానిపై దిగ్బంధనాలకు దిగింది. ఆర్థిక ఆంక్షలు పెట్టింది. యుద్ధం చేస్తామని నిత్యం బెదిరింపులకు పాల్పడుతోంది. ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోవాలని అన్ని దేశాలపై ఒత్తిడి తెస్తోంది. భారత్

వంటి పెద్ద దేశమే అమెరికా ఒత్తిడికి లొంగి దేశ ప్రయోజనాలను కూడా పణంగా పెట్టి ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు చాలా వరకు తెంచుకున్న సంగతి మనకు తెలుసు. కానీ కతర్ మాత్రం అటు అమెరికాతో ఆర్థిక, వాణిజ్య, సైనిక సంబంధాలు కొనసాగిస్తూనే ఇరాన్‌తో కూడా సన్నిహితంగా ఉంటోంది. ఇది అమెరికాకు గిట్టని విషయం. ఇరాన్‌కూ సౌదీ రాజరికానికీ ఎప్పటి నుండో శత్రుత్వం ఉంది. యుఎఇ, బహ్రాయిన్ ఇతర రాజరికాలు కూడా ఇరాన్ అంటే మండి పడతాయి. ఇవన్నీ సున్నీ రాజ్యాలు కావడం ఇరాన్ ఈ ప్రాంతంలో షియాలకు మద్దతివ్వడం ఒక కారణం. ఇరాన్‌తో కతర్‌కు ఎంతటి సన్నిహిత సంబంధాలున్నాయంటే 2006లో ఇరాన్ అణు కార్యక్రమానికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం చేసినప్పుడు ఒక్క కతర్ మాత్రమే ఇరాన్‌కు మద్దతుగా నిలిచింది. ఇరాన్ అణు కార్యక్రమం తమకు ప్రమాదమని ఇటు సౌదీ అరేబియా, అటు ఇజ్రాయిల్ భావిస్తున్నాయి.

సౌదీకి సామంత రాజ్యంగా ఉన్న కతర్ ఇరాన్‌తో సన్నిహితంగా మెలగడానికి ఆర్థిక సంబంధాలు ప్రధాన కారణం. పర్షియన్ గల్ఫ్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద సహజ వాయు ద్రవీకరణ ప్రాజెక్టులో కతర్, ఇరాన్ కలిసి పెట్టుబడి పెట్టాయి. ఈ ప్రాంతంలోని సముద్ర జలాల్లో ఉన్న గ్యాస్ నిక్షేపాలను వెలికి తీసి అమ్ముకోవాలంటే ఇరాన్ సహకారం తప్పనిసరి అని కతర్ భావిస్తోంది. తమ భూభాగంపై ఎప్పటి నుండో అమెరికా సైనిక స్థావరం ఉన్నప్పటికీ కతర్ దాన్ని నమ్మడం లేదు. కతర్‌లోని సెంట్రల్ కమాండ్ స్థావరం నుండి అమెరికా ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్, సిరియా తదితర దేశాలపై దాడులు చేస్తుంది. ఇరాన్‌తో యుద్ధం వస్తే కూడా దాడులకు ఈ స్థావరాన్ని ఉపయోగించే వీలుంది. ఇరాన్ అమెరికాల మధ్య యుద్ధం తమ దేశ ప్రయోజనాలకు ప్రమాదకరమని కతర్ భావిస్తోంది.

ప్రస్తుత కతర్ రాజు తండ్రి ఖలీఫా ఆల్ థాని 1995లో అధికారం చేపట్టింది మొదలు సౌదీ అరేబియా ఉపాంగంగా ఉన్న కతర్‌ను స్వతంత్ర దేశంగా నిలపడానికి ప్రయతిస్తూ వచ్చాడు. దాన్ని సహించలేక 2002 నుండి 2008 వరకు సౌదీ అరేబియా ఇతర గల్ఫ్ సహకార సంస్థ దేశాలు కతర్‌ను దౌత్యపరంగా బహిష్కరించాయి. దోహా నుండి తమ దౌత్యాధికారులను వెనక్కు రప్పించాయి. అయితే తరువాత అవి వెనక్కు తగ్గక తప్పలేదు. ఖలీఫా ఆల్ థాని కొడుకు ప్రస్తుత కతర్ రాజు హమద్ ఆల్ థాని కూడా ఈ విషయంలో తండ్రి బాటనే నడుస్తున్నాడు. కతర్ ప్రభుత్వం నెల కొల్పిన ఆల్ జజీరా టీవీ ఛానల్ అరబ్బు దేశాల్లో అమెరికా మీడియాకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చెందింది. ఆల్ జజీరా ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే మధ్య ప్రాచ్య పరిణామాలు తెలుసుకోడానికి ప్రజలు, ప్రభుత్వాలు కూడా దానిపై ఆధారపడుతున్నారు.

> **“ కతర్ ప్రభుత్వం నెలకొల్పిన ఆల్ జజీరా టీవీ ఛానల్ అరబ్బు దేశాల్లో అమెరికా మీడియాకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చెందింది. ఆల్ జజీరా ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే మధ్య ప్రాచ్య పరిణామాలు తెలుసుకోడానికి ప్రజలు, ప్రభుత్వాలు కూడా దానిపై ఆధారపడుతున్నారు. ”**




గల్ఫ్‌లో దేశాల మధ్య సంబంధాలు ఇరాన్ కు అనుకూలం, వ్యతిరేకం అనే విధంగా విడిపోయాయి. అయితే కతర్ ఇరాన్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ అనేక విషయాల్లో ఇరాన్‌తో కూడా విభేదిస్తోంది. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న హమస్‌కు కతర్ మద్దతిస్తోంది. దీన్ని అమెరికా, సౌదీలు వ్యతిరేకిస్తున్నాయి. ఈజిప్టులో హోస్నీ ముబారక్ ప్రభుత్వంపై 2011 లో ప్రజా తిరుగుబాటు ద్వారా అధికారంలోకి వచ్చిన ముస్లిం బ్రదర్ హుడ్‌కు కతర్ మద్ద తిచ్చింది. ప్రజా తిరుగుబాటు వార్తలు కవర్ చేయడంలో ఆల్ జజీరా ముందు పీఠిన నిలి చింది. ముస్లిం బ్రదర్ హుడ్ అధ్యక్షుడు మొహమ్మద్ మోర్సి ప్రభుత్వాన్ని సైనిక కుట్ర ద్వారా దించేసి అధికారంలోకి వచ్చిన సైనిక నియంత జనరల్ అబ్దెల్ ఫతా ఎల్ సిసి ప్రభుత్వ ఊచకోత ఘటనలను ఆల్ జజీరా పెద్ద ఎత్తున ప్రజల దృష్టికి తీసుకొచ్చింది. ముస్లిం బ్రదర్ హుడ్ ఉద్యమానికి సౌదీ వ్యతిరేకం. ఎందు కంటే అటువంటి ఉద్యమం తమ పరిపాలనకు ఎసరు తెస్తుందన్న భయం. మూడు దశాబ్దాల పాటు హోస్నీ ముబారక్ నియంతృత్వానికి మద్దతిచ్చిన అమెరికా కూడా 2011 ఈజిప్టు ప్రజా తిరుగుబాటును వ్యతిరేకించింది. సిసి నేతృత్వంలోని సైనిక తిరుగుబాటుకు అమెరికా మద్దతుంది.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాగతాలను వీరోచితంగా ఎదిరిస్తున్న హమస్‌కు కతర్ మద్దతివ్వడం కూడా అమెరికా, సౌదీ అరేబియాలకు నచ్చడం లేదు. పాలస్తీనా విముక్తి కోసం పోరాడుతున్న హమస్‌ను ఈ రెండు దేశాలు ఉగ్రవాద సంస్థగా పరిగణిస్తున్నాయి. ఇక సిరియాలోని సంక్షిష్ట పరిణామాల్లో అమెరికాతో కలిసి కతర్ అక్కడ ఆల్ ఖైదా ఉగ్రవాలకు మద్దతిచ్చింది. టర్కీ, కతర్, సౌదీ అరేబియాలు కూడా అమెరికాతో కలిసి సిరియాలోని అధ్యక్షుడు బషర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా

"ట్రంప్ తన ప్రసంగంలో ఇరాన్, సిరియా ప్రభుత్వాలపై విరుచుకు పడ్డాడు. 'ఉగ్రవాదంపై పోరు'లో అరబ్బు దేశాలకు అన్ని విధాలా మద్దతిస్తానని హామీ ఇచ్చాడు. నిజానికి వీరి దృష్టిలో ఉగ్రవాదం అంటే ఆయా దేశాల్లో వెల్లువెత్తుతున్న ప్రజా తిరుగుబాట్లే. ఉగ్రవాదాన్ని అణచివేసే పేరుతో వేల కోట్ల డాలర్ల ఆయుధాల అమ్మకం ఒప్పందాలు కుదిరాయి."


సౌదీ రాజు సాల్మన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

పనిచేశాయి. ఇరాన్ సిరియా ప్రభుత్వానికి మద్దతిచ్చింది. కానీ ప్రస్తుత గల్ఫ్ సంక్షోభంలో టర్కీ, ఇరాన్‌లు కతర్‌కు మద్దతుగా నిలిచాయి. ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబాన్‌లకు కతర్ ప్రభుత్వం మద్దతిస్తోంది. నిజానికి తాలిబాన్లకు కతర్‌లో కార్యాలయం కూడా ఉంది. 2016లో తాలిబాన్‌లకూ, ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వానికీ మధ్య రాజీ చర్చలకు కతర్ ఆతిథ్య మిచ్చింది. అమెరికా చెప్పినందునే తాను రాజీ ప్రయత్నాలు చేశానని కతర్ ప్రభుత్వం చెబుతోంది.

ఏమైనా తమ కాళ్లకింద పడి ఉండాల్సిన చిన్న రాజ్యం తలెత్తుకుని స్వతంత్రంగా వ్యవహరించడం గిట్టని సౌదీ అరేబియా ఇతర గల్ఫ్ రాజరికాలు కతర్‌పై నిరంతరం కత్తి నూరుతూనే ఉన్నాయి. సౌదీ రాజులకు వ్యతిరేకంగా అల్ జజీరా వార్తలిచ్చినందుకు 2002లో కతర్‌నుండి సౌదీ తమ దౌత్యవేత్తలను ఉపసంహరించుకుంది. ఇక నుండి అటువంటి వార్తలు ప్రచురించబోమని అల్ జజీరా హామీ ఇచ్చిన మీదట ఉపసంహరణను ఎత్తివేసింది. ఇదే కారణంలో 2014లో బహ్రెయిన్, యుఎఇ కూడా దౌత్యవేత్తలను ఉపసంహరించుకున్నాయి.

ఇలా చినికి, చినికి పరిస్థితి ఇప్పుడు గాలివానగా మారింది. ఈ గాలివానకు ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగిన ఘటనలకు సంబంధం ఉంది. ఇరాక్, సిరియాల్లో జరుగుతున్న అంతర్యుద్ధాల్లో షీతే, సున్నీ మిలిటెంట్ల మధ్య కతర్ ప్రభుత్వం రాజీ కుదిరింది. దీనికి రెండు కారణాలున్నాయి. ఒకటి, షీతే మిలిటెంట్ల వద్ద బందీలుగా ఉన్న కతర్ రాజ వంశీకులను విడిపించడం. దక్షిణ ఇరాక్‌లో గద్దలను వేటాడడానికి వెళ్లిన 26 మంది కతార్ రాజ వంశీకులను మిలిటెంట్లు బందీలుగా పట్టుకుని ఏడాదికి పైగా గడిచింది. వాళ్లను విడిపించాలంటే అక్కడ అంతర్యుద్ధం ఆగాలి. రెండో కారణం సిరియాలో రెండు పక్షాల మధ్య రాజీ కుదిరితే సిరియా యుద్ధంలో చిక్కుకున్న శరణార్థులకు ఆహారం పంపించవచ్చు, వాళ్లను సురక్షిత ప్రాంతాలకు తరలించవచ్చు. ఇది మానవతా దృక్పథంతో కతర్ తీసుకున్న చర్య. ఈ రాజీ చర్చల వల్ల సిరియాలోని మదయా అనే ఒక్క గ్రామం నుండే 2000 మంది ప్రజలను రక్షించ గలిగారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. ఇదంతా ప్రపంచానికి బాగానే ఉన్నా సౌదీ అరేబియాకు నచ్చలేదు. రాజీ కుదర్చడానికి కతర్ ప్రభుత్వం మిలిటెంట్లకు కోట్లాది డాలర్ల పరిహారం ఇచ్చిందని ఇది ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమేననేది సౌదీ అరేబియా ఫిర్యాదు.

దీని తరువాత మే నెలలో సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గల్ఫ్ పర్యటన సందర్భాన్ని పురస్కరించుకుని 55 ముస్లిం దేశాల శిఖరాగ్ర సభ జరిగింది. వాస్తవానికి మూడు శిఖరాగ్ర సమావేశాల సమాహారమిది. ముందు ట్రంప్, సౌదీ రాజుతో సమావేశమయ్యారు. తరువాత గల్ఫ్ సహకార సంస్థ దేశాధినేతల సమావేశం జరిగింది. తరువాత 55 ముస్లిం దేశాల శిఖరాగ్ర సభ జరిగింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరు జరపాలని శిఖరాగ్ర సభ పిలుపు నిచ్చింది. ట్రంప్ తన ప్రసంగంలో ఇరాన్, సిరియా ప్రభుత్వాలపై విరుచుకు పడ్డాడు. 'ఉగ్రవాదంపై పోరు'లో అరబ్బు దేశాలకు అన్ని విధాలా మద్దతిస్తానని హామీ ఇచ్చాడు. నిజానికి వీరి దృష్టిలో ఉగ్రవాదం అంటే ఆయా దేశాల్లో వెల్లువెత్తుతున్న ప్రజా తిరుగుబాట్లే. ఉగ్రవాదాన్ని అణచివేసే పేరుతో వేల కోట్ల డాలర్ల ఆయుధాల అమ్మకం ఒప్పందాలు కుదిరాయి. ఈజిప్టు నియంత అల్ సిసి వంటి ప్రజా కంటక నేతలు అక్కడ ప్రసంగాలు చేశారు. రియాద్‌లో 'ఉగ్రవాదంపై పోరాట ప్రపంచ కేంద్రాన్ని' ఏర్పాటు చేశారు. పశ్చిమ దేశాల రక్షణ నిపుణులు ఈ శిఖరాగ్ర సభను ముస్లిం దేశాల 'నాటో'గా అభివర్ణించారు.

ట్రంప్ పర్యటన ముగిసిన వెంటనే అరబ్బు దేశాలకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది. ప్రజా పోరాటాలపైనా, తమ దేశాల్లో ప్రతిపక్షాలపైనా దమనకాండకు దిగాయి. ఉదాహరణకు.. బహ్రెయిన్ పాలకులు తమ దేశంలోని మెజారిటీ షీతే ప్రజల పోరాటంపై ఉక్కుపాదం మోపారు. అయిదుగురిని చంపేశారు. 286 మందిని అరెస్టు చేశారు. ప్రతిపక్ష పార్టీని నిషేధించారు. దేశంలోని ఏకైక స్వతంత్ర పత్రికను మూసేశారు.

వెనువెంటనే సౌదీ అరేబియా, యుఎఇ, ఈజిప్టు, బహ్రెయిన్, ఎమెన్‌లు కతర్‌పై ఆర్థిక దిగ్బంధనం ప్రకటించాయి. ట్రంప్ సమావేశం తరువాత జరిగిన ఈ పరిణామాలను "యుద్ధోన్మాద నృత్య హేల" అని ఇరాన్ అధ్యక్షుడు హస్సన్ రౌహానీ ఒక ట్వీట్‌లో వర్ణించారు. వాస్తవానికి ఈ ప్రాంతంలోని కువైట్, ఒమన్‌లు సౌదీ అరేబియాను వ్యతిరేకిస్తున్నా తాము బహిరంగంగా ఆ పనిచేస్తే కతర్ పరిస్థితే తమకూ వస్తుందని భయానికి లోనైనాయి.

**అమెరికా ప్రభుత్వంలో భిన్నాభిప్రాయాలు**

గల్ఫ్‌లో సంక్షోభానికి తన ఘన కార్యమే కారణమని డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగానే ప్రకటించుకున్నాడు. "నేను ఇటీవల మధ్య ప్రాచ్యం వెళ్లినప్పుడు తీవ్రవాద సిద్ధాంతాలకు నిధులివ్వ కూడదని చెప్పాను. చూడండి! నేను చెప్పిన వెంటనే నాయకులంతా కతర్‌ను వేలెత్తి చూపారు" అని ఆయన ట్వీట్ చేశాడు. గంటన్నర తరువాత మరో ట్వీట్ చేస్తూ "సౌదీలో నా పర్యటన సత్ఫలితాలిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఉగ్రవాదానికి నిధులిచ్చే వారిపై కఠిన వైఖరి తీసుకుంటామని అందరూ చెప్పారు. కతర్‌నే అంతా దోషిగా చూపుతున్నారు. బహుశా ఉగ్రవాదం అంతానికి ఇది ప్రారంభం కావచ్చు" అని అన్నాడు.

ట్రంప్ ఇటువంటి ట్వీట్లు ఇచ్చినా అమెరికా ప్రభుత్వంలో అంతా ఇదే మాట మీద లేరు. అమెరికా రక్షణ శాఖ ట్రంప్ వైఖరికి భిన్నంగా ఆచితూచి స్పందించింది. కతర్‌లోని అమెరికా రాయబారి మాట్లాడుతూ సమస్యను శాంతియుత చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పిలుపు నిచ్చారు. ట్రంప్ ట్వీట్లు వెలువడిన గంట తరువాత అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్సన్ ఒక ప్రకటన చేస్తూ కతర్ మీద ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేయాలనీ అన్ని దేశాలూ పరిస్థితిని ఉపశమింపజేసేందుకు చర్యలు తీసుకోవాలనీ పిలుపునిచ్చాడు. ట్రంప్ వైఖరికి భిన్నంగా అమెరికా ప్రభుత్వంలోని ఇతర సెక్షన్లు స్పందించడానికి కారణం కతర్‌లో అమెరికా సైనిక స్థావరం ఉండడమే. కతర్‌లోని ఆల్ ఉదీద్ సైనిక స్థావరంలో 10,000 మంది అమెరికా సైనికు లున్నారు. నిత్యం ఇక్కడి నుండే ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్, సిరియాలపై అమెరికా దాడులు నిర్వహిస్తుంది.

"ట్రంప్ ఇటువంటి ట్వీట్లు ఇచ్చినా అమెరికా ప్రభుత్వంలో అంతా ఇదే మాట మీద లేరు. అమెరికా రక్షణ శాఖ ట్రంప్ వైఖరికి భిన్నంగా ఆచితూచి స్పందించింది. కతర్‌లోని అమెరికా రాయబారి మాట్లాడుతూ సమస్యను శాంతియుత చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పిలుపు నిచ్చారు."



కతర్ రాజు తమిన్ బిన్ హమద్ ఆల్-థాని

**కతర్‌కు మద్దతుగా...**

ఆర్థిక దిగ్బంధనంలో చిక్కుకున్న కతర్‌కు ఇరాన్, టర్కీ ప్రత్యక్షంగా రష్యా, ఒమన్, కువైట్‌లు పరోక్షంగా మద్దతుగా నిలిచాయి. జూన్ 5న కతర్‌పై దిగ్బంధనం విధించిన వెంటనే జూన్ 7న టర్కీ పార్లమెంటు సమావేశమై కతర్‌కు మద్దతుగా సైన్యాన్ని పంపాలని తీర్మానించింది. వెంటనే టర్కీ యుద్ధ నౌకలు, ట్యాంకులు, సైన్యం కతర్‌లోని టర్కీ సైనిక స్థావరానికి బయలు దేరాయి. కతర్‌కు కావలసిన ఆహారంలో 60 శాతం సౌదీ నుండి దిగుమతి అయ్యేది. అది ఆగిపోవడంతో వెంటనే టర్కీ విమానాలు, నౌకల ద్వారా ఆహార సరఫరా ప్రారంభించింది. కతర్‌కు కావలసిన ఆహారం, ఇతర సరఫరాలు అందించడానికి ఇరాన్ ముందుకొచ్చింది. ఒమన్ ద్వారా నౌకల్లో ఆహారం, సరఫరాలు అందడం ప్రారంభించాయి.

అమెరికా చర్యను మిత్రపక్షమైన యూరోపియన్ దేశాలు ముఖ్యంగా జర్మనీ వ్యతిరేకించింది. "అరబ్బు దేశాలు చిన్న గల్ఫ్ దేశంపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి" అని జర్మన్ విదేశాంగ మంత్రి సిగ్మార్ గాబ్రియెల్ పేర్కొన్నారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించు కోవాలని ఇతర యూరోపియన్ దేశాలు కోరాయి. ఇతర దేశాల మాట సాయం ఎలా ఉన్నా టర్కీ, ఇరాన్‌ల సాయం ప్రస్తుతానికి కతర్‌ను ఇబ్బందుల నుండి బయటపడేస్తుంది. గ్యాస్ ఎగుమతి ప్రధానంగా సముద్రం ద్వారా జరుగుతున్నందున కతర్ తక్షణ ప్రమాదం ఏమీ లేదు. ఆహార సరఫరాల కోసం ఇరాన్, ఒమన్ పోర్టులను ఆశ్రయించే అవకాశం ఉంది. ప్రపంచంలోనే అత్యంత ధనిక దేశం కనుక ఆర్థిక దిగ్బంధనం వల్ల దేశ పౌరుల నుండి వెంటనే వ్యతిరేకత వచ్చే అవకాశం తక్కువ. ఆర్థిక వ్యవస్థలో కూడా భయాందోళనలు వ్యక్తం కాలేదు. అందుకనే దిగ్బంధం విధించి నెల రోజులు గడుస్తున్నా కతర్ ప్రభుత్వం సౌదీ–అమెరికా షరతులకు తలొగ్గకుండా నిలబడింది. చర్చలకు సిద్ధమే కానీ సార్వభౌమత్వాన్ని వదులుకునే అవకాశం లేదని కతర్ పాలకులు కుండ బద్దలు కొడుతున్నారు.

కతర్ సమస్య గల్ఫ్‌లో మరో యుద్ధ ప్రజ్వరిల్లే ప్రమాదాన్ని కొనితెచ్చింది. ఆయుధాలు అమ్ముకోడానికి అమెరికాకు ఇది సంతోషకరమైన విషయమేగాని ఈ ప్రాంతంలోని దేశాలకు మాత్రం ప్రాణ సంకటం. అందుకే మెజారిటీ దేశాలు సౌదీ–అమెరికా వైఖరికి మద్దతివ్వడం లేదు. శాంతి యుత పరిష్కారాన్ని కోరుకుంటున్నాయి. ఈ విషయంలో కువైట్ నేరుగా మధ్యవర్తిత్వం నెరపడానికి ముందు కొచ్చింది. చమురు నిల్వలతో కళకళ లాడుతున్న గల్ఫ్ దేశాలు విజ్ఞత ప్రదర్శించి సమస్యను పరిష్కరించుకుంటాయో లేక సామ్రాజ్యవాదుల ఉచ్చులో చిక్కుకుని మరో యుద్ధాన్నే కొనితెచ్చు కుంటాయో కొంతకాలమైతేగానీ తెలియదు. ❊

# కార్పొరేట్లకు సంబరం మోడీ పాలన

ఎ. కోటిరెడ్డి



రచయిత
మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

'అచ్ఛేదిన్' తీసుకువస్తానన్న వాగ్దానంతో మోడి గద్దెనెక్కి మూడు సంవత్సరాలు పూర్తయింది. ఈకాలంలో అచ్ఛేదిన్‌కు బదులుగా 'బురేదిన్' రావటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దేశ ఆర్థిక పరిస్థితి, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు, శాంతిభద్రతలు, మహిళల పరిస్థితి, విద్యా, వైద్యరంగాలు, కాశ్మీర్ సమస్య, విదేశాంగ విధానం తదితరాలన్నింటిలోనూ పరిస్థితి దిగజారిపోతున్నది. మోడి, సంఘ్ పరివార్, కార్పొరేట్ మీడియా అంతా అద్భుతంగా ఉన్నదని ప్రజలను నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నారు. మోడి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు, పైస్థాయిలోని కొద్దిమంది వ్యాపారులు, కాంట్రాక్టర్లు, స్పెక్యులేటివ్ వ్యాపారాలు చేసేవారికి మాత్రమే ప్రయోజనం. సామాన్య ప్రజలకు నష్టం కలిగిస్తున్నాయి. ప్రజలకు, దేశాభివృద్ధికి నష్టం కలిగించే విధానాలను వ్యతిరేకించే వారిని దేశవ్యతిరేకులని, అభివృద్ధికి ఆటంకం కలిగించే వారని ముద్రవేయటం ద్వారా తమ విధానాలను ఎదురౌతున్న ప్రతిఘటనను నీరుగార్చటానికి ప్రయత్నం చేస్తున్నారు. అయితే మోడి, సంఘ్ పరివార్ ఆకాంక్షలకు భిన్నంగా ఈ విధానాల దుష్ఫలితాలను అనుభవిస్తున్న కార్మికులు, కర్షకులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటరంగంలోకి వస్తున్నారు.

### దిగజారుతున్న పారిశ్రామికరంగం

అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా', 'స్కిల్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' తదితర పథకాలతో దేశాన్ని ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా తయారు చేస్తానని మోడి ప్రచారం చేశాడు. సంవత్సరానికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తానని, పెద్ద మొత్తం విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం ద్వారా దేశాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పాడు.కాని ఆచరణలో ఇవేవీ అమలు జరగలేదు. మేక్ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా అదనంగా జరిగిన పారిశ్రామికీకరణ కనిపించటం లేదు. దేశంలోకి వస్తున్న పెట్టుబడులు ఉత్పత్తి రంగంలోకి కాకుండా త్వరగా లాభాలు సంపాదించే షేర్‌మార్కెట్, చట్టా వ్యాపార రంగాలలోకి వస్తున్నాయి. అతి తక్కువ ఉద్యోగాల కల్పన మాత్రమే జరిగింది. నిరుద్యోగం పెరిగింది. 15-29 సంవత్సరాల మధ్య వయసున్న యువకులలో 30 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారు. పారిశ్రామికాభివృద్ధి మందగించింది. ప్రభుత్వం నూతనంగా రూపొందించిన సూచి ప్రకారం కూడా జిడిపి పెరుగుదల 7.1 శాతానికి దిగజారింది.

2016 నవంబరు 8వ తేదీన ప్రభుత్వం చెలామణిలో ఉన్న 500, 1,000 రూపాయల నోట్లను చలామణి నుండి ఉపసంహరించటం దేశ ఆర్థికవ్యవస్థ, ప్రజల జీవితాలపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని కలిగించింది. నగదు ఆధారంగా నడిచే చిన్న పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు, వృత్తులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. తాము చేసిన పనికి వేతనాలు అందక, బ్యాంకులలో దాచుకున్న తమ డబ్బును అవసరాలకు ఉపయోగించుకోలేక ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తమ డబ్బును బ్యాంకులు, ఎటియంల నుండి తీసుకోవటం కోసం గంటలు, రోజుల తరబడి క్యూలలో నిలబడాల్సి వచ్చింది. ఫలితంగా 100 మందికి పైగా మరణించారు. ప్రజల వద్ద డబ్బులేక కూరగాయలు, ఇతర నిత్యావసరాలను కొనుగోలు చేయలేకపోవటంతో ప్రజలు నిత్యావసరాల కొరతతో ఇబ్బందులను ఎదుర్కోగా, మరోవైపు రైతులు తాము పండించిన కూరగాయలు, పండ్లు, ఇతర ఉత్పత్తులను కొనేవారు కరువవటంతో బజార్లలో పారబోయాల్సి వచ్చింది. పరిశ్రమలు, వృత్తులు, ఉపాధి రంగాల లో క్షీణత ప్రారంభం కావటంతో 2016-17 చివరి త్రైమాసికలో జిడిపి పెరుగుదల 6.1 శాతానికి పడిపోయింది.

### వ్యవసాయరంగం

తాము అధికారంలోకి వస్తే రైతుల ఆత్మహత్యలను నిరోధిస్తానని, వ్యవసాయ పెట్టుబడులకు 50 శాతం కలిపి పంటలకు గిట్టుబాటు ధరలను నిర్ణయిస్తానని, సాగుభూమి అంతటికీ నీటి సదుపాయం కల్పిస్తామని, పంటల బీమా పథకాన్ని సక్రమంగా అమలు జరుపుతామని, ఉపాధిహామి పథకం ద్వారా పనిదినాలు, వేతనా లను పెంచుతామని బిజెపి రైతులు, వ్యవసాయ కార్మికులకు వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత వాగ్దానాలను ప్రభుత్వం వమ్ము చేయటంతో రైతుల ఆత్మహత్యలు 40 శాతానికి పైగా పెరిగాయి. పెట్టుబడులకు 50 శాతం అద నంగా కలిపి వ్యవసాయోత్పత్తుల మద్దత్తు ధరను నిర్ణయించలేమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ సంవత్సరం కొన్ని పంటలకు పెట్టుబడులు కూడా రాని విధంగా మద్దత్తు ధరలను నిర్ణయించటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోనున్నది. ధాన్యం, గోధుమలకు కేంద్రం నిర్ణయించిన మద్దత్తు ధర కన్నా ఏ రాష్ట్రమైనా అదనంగా బోనస్ చెల్లించి సేకరిస్తే, ఆ రాష్ట్రాల నుండి ఆహారధాన్యాల సేకరణను ఆపివేస్తానని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం హెచ్చరించింది. ఈ సంవత్సరం అమెరికా, ఆస్ట్రేలియా, రష్యా తదితర దేశాలలో గోధుమ పంట బాగా పండటంతో అంతర్జాతీయంగా గోధుమ ధరలు పడిపోయాయి. దేశంలో గోధుమకు కనీస మద్దత్తు ధర 1625 రూపాయలుగా నిర్ణయించారు. దిగుమతిదారులు క్వింటాలు 1330-1430 రూపాయలకు దేశంలోకి దిగుమతి చేస్తున్నారు. అంతర్జాతీయ ధరల పతనం నుండి రైతులకు రక్షణ కల్పిం చాల్సిన ప్రభుత్వం దేశంలోకి దిగుమతి అయ్యే గోధుమలపై 25 శాతంగా

ఉన్న దిగుమతి సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. ఇపుడు వ్యాపారులు 50 లక్షల టన్నుల గోధుమలను విదేశాల నుండి దిగుమతి చేసుకోబోతున్నారు. గోధుమ వ్యాపారంలో ఉన్న అంబాని, ఆదాని, కార్గిల్, ఐటిసి తదితర సంస్థలకు లాభాలను కల్పించ టం కోసం ప్రభుత్వం రైతులను దివాళా తీయిస్తు న్నది. ప్రధాని ఫసల్ బీమా యోజనను విస్తరిస్తా మని చెబుతూ కేటాయింపులను 13,240 కోట్ల నుండి 9,000 కోట్ల రూపాయలకు తగ్గించారు. బీమా కంపెనీలు రైతుల నుండి 21,000 కోట్ల రూపాయల ప్రీమియం వసూలు చేశాయి. రైతులు 4,270 కోట్ల రూపాయల చెల్లింపులకు డిమాండ్ చేయగా బీమా కంపెనీలు 714 కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించాయి.

> “యుపిఎ హయాంలో ఆమోదించిన ఆహార భద్రతా చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నీరుగారుస్తున్నది. చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న పంచదార, కిరోసిన్‌లను కేంద్ర ప్రభుత్వం పంపిణి నుండి తొలగించింది. బియ్యానికి బదులుగా లబ్దిదారుల ఎకౌంట్లలో నగదును జమ చేస్తామని ప్రకటించింది. ఈ చర్యలు వాస్తవంలో ప్రజాపంపిణి వ్యవస్థ రద్దుకు దారి తీస్తాయి.”

కేంద్రంలో అధికారంలోకి రాగానే బిజెపి ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టాన్ని పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకు అనుగుణంగా సవరించటానికి పూనుకున్నది. రాజ్యసభలో చట్ట సవరణకు అవసరమైన మెజారిటీని సాధించటం సాధ్యం కాదని స్పష్టం అయిన తర్వాత ఆర్డినెన్స్‌ను జారీచేసింది. కార్పొరేట్, బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా చట్టాన్ని సవరించమని రాష్ట్రాలకు చెప్పింది. 2013 భూ సేకరణ చట్టాన్ని నీరుగార్చే విధంగా సవరణలు చేయటంలో బిజెపి పాలిత రాష్ట్రాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలు కూడా ముందున్నాయి. గిరిజనులకు రక్షణ కల్పించే చట్టాలను నీరుగారుస్తున్నది. ఉపాధిహామీ పథకానికి నిధుల కేటాయింపును తగ్గిస్తున్నది. పథకాన్ని సక్రమంగా అమలు చేయటానికి 80,000 కోట్ల రూపాయలు కావలసి ఉండగా 48,000 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించింది. చేసిన కేటాయింపులను కూడా సక్రమంగా ఖర్చు చేయటం లేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూలీలకు కల్పించే పనిరోజులు తగ్గాయి. చట్ట ప్రకారం పనిచేసిన 15 రోజులలోపు వేతనాలు చెల్లించాల్సి ఉండగా నెలల తరబడి వేతనాలు చెల్లించటం లేదు.

దేశంలోని సాగుభూమి అంతటికీ నీటిని అందిస్తామని చెప్పారు. దేశంలో 12 కోట్ల ఎకరా లకు పైగా సాగుభూమికి నీటి సదుపాయం లేదు. ఈ భూమి అంతటికీ నిర్ణీతకాలంలో సాగునీరు అందించాలంటే నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించి, తగిన వనరులను కేటాయించి, యుద్ధ ప్రాతిపదికపై పనులు జరపాలి. కాని ప్రభుత్వం మాటలు చెప్పటం తప్ప ఆచరణలో అడుగు ముందుకు వేయటం లేదు. నీటిపారుదల పథకాలకు బడ్జెట్‌లో 40,000 వేలకోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. ఈ విధంగా కేటాయింపులు చేస్తే సాగుభూములన్నింటికీ నీరందించటానికి ఎన్ని దశాబ్దాలు పట్టేను!

కరువులు, వరదలు తదితర ప్రకృతి వైపరీత్యాలకు గురైన రైతాంగానికి సహాయం అందించటంలో ఏ మాత్రం శ్రద్ధ చూపటం లేదు. 2015-16లో ఉత్తరాది రాష్ట్రాలలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. గత సంవత్సరం దక్షిణాది రాష్ట్రాలు కరువుకు గురయ్యాయి. కరువుకు గురైన రైతాంగానికి తగిన సహాయం అందించలేదు. తమిళనాడు రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఢిల్లీలో 40 రోజుల పాటు వివిధ రూపాలలో పోరాటాలు నిర్వహించారు. అయినా ప్రధాని, మంత్రులు కనీసం వారిని పరామర్శించిన పాపానపోలేదు. తమపై పడుతున్న భారాలను భరించలేక, పంటలకు గిట్టుబాటు ధరలు రాక మహారాష్ట్ర రైతులు సమ్మెకు పూనుకున్నారు. మధ్యప్రదేశ్ రైతులు పోరాటం చేస్తుంటే ప్రభుత్వం దుర్మార్గంగా కాల్పులు జరిపి, ఆరుగురు రైతులను పొట్టన పెట్టుకుంది. రైతుల సమస్యలను పరిష్కారం చేయాలని ఒకవైపున ఆందోళన చేస్తుంటే మరోవైపున రైతులపై కాల్పులు జరిపించిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా రైతులకు ఆందోళనకు పోటీగా నిరాహారదీక్షలకు పూనుకోవటం బిజెపి రైతు వ్యతిరేక వైఖరికి మచ్చుతునక.

## ప్రజాపంపిణి వ్యవస్థ

యుపిఎ హయాంలో ఆమోదించిన ఆహార భద్రతా చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నీరుగారుస్తున్నది. చౌకధరల దుకాణాల ద్వారా పంపిణి చేస్తున్న పంచదార, కిరోసిన్‌లను కేంద్ర ప్రభుత్వం పంపిణి నుండి తొలగించింది. బియ్యానికి బదులుగా లబ్దిదారుల ఎకౌంట్లలో నగదును జమ చేస్తామని ప్రకటించింది. ఈ చర్యలు వాస్తవంలో ప్రజాపంపిణి వ్యవస్థ రద్దుకు దారి తీస్తాయి. ఒకవైపున నిత్యావసరాలైన బియ్యం, పప్పులు, ఉల్లిపాయలు, కూరగాయలు, మందులు, బట్టలు తదితరాల ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా పెరుగుతున్నాయి. మరోవైపున ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను నీరుగార్చటం ద్వారా ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నది. ధరలు అందుబాటులో ఉంటేనే పేదప్రజలు తమ అవసరాల మేరకు నిత్యావసరాలను వినియోగించుకోగలరు. కాబట్టి నిత్యావసర సరుకులన్నింటినీ ప్రజలకు అందించటం కోసం ప్రజాపంపిణి వ్యవస్థను కొనసాగించాలి, విస్తరించాలి. ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆదాయాలు దిగజారుతున్న ప్రజానీకాన్ని కూడా ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురావలసిన అవసరం పెరుగుతున్నది. కాని యన్‌డిఎ ప్రభుత్వం అందుకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, ప్రజాపంపిణి వ్యవస్థను రద్దుచేయటానికి ప్రయత్నిస్తున్నది. ఆహారధాన్యాల సేకరణ, నిల్వ, సరఫరా విధానాలకు తిలోదకాలిస్తున్నది.

చౌకధరల దుకాణాల ద్వారా సరుకులు తీసుకునే వారిని గుర్తించటానికి దేశవ్యాపితంగా ఒకే విధమైన మార్గదర్శకాలు లేవు. వివిధ రకాలైన మార్గదర్శకాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు లబ్దిదారులను గుర్తిస్తున్నాయి. ఇది అనేక రకాలైన పొరపాట్లకు, పెద్దసంఖ్యలో లబ్దిదారులు అనర్హులు కావటానికి దారితీస్తున్నది. లబ్దిదారుల రేషన్‌కార్డులను ఆధార్‌తో ముడిపెట్టటం, బయోమెట్రిక్ విధానం అమలు చేయటం వలన గ్రామాలలో విద్యుత్, ఇంటర్‌నెట్ కనెక్షన్ లేకపోవటం, పిఒయస్ మిషన్లు సక్రమంగా పని చేయకపోవటం వలన అనేకమంది అర్హులు చౌకధరల దుకాణాల నుండి సరుకులను పొందలేకపోతున్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గడ్ వంటి రాష్ట్రాలలో 40 శాతం వరకు రేషన్ పొందలేకపోయారని ఆ రాష్ట్రాల నుండి వెల్లడౌతున్న సమాచారం స్పష్టం చేస్తున్నది. తెలంగాణాలో జారీచేసిన ఆధార్ కార్డులలో 30 శాతం తప్పులు దొర్లినట్లు ప్రభుత్వం వెల్లడించిన సమాచారం తెలుపుతున్నది. దారిద్ర్యరేఖకు ఎగువనున్న కుటుంబాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఆహార

> **"యుపిలోని సహరాన్‌పూర్‌లో దళితులపై దాడులు కొనసాగు తున్నాయి. ఎక్కడ తమ స్వతంత్రత, గౌరవాన్ని కాపాడుకోవటానికి దళితులు ప్రయత్నం చేస్తు న్నారో అక్కడ వారిపై సంఘ్ పరివార్ దాడులు చేస్తున్నది. కులవ్యవస్థలో అట్టడుగున ఉన్న దళితులను అదే స్థానానికి పరిమితం చేయాలనే లక్ష్యంతో ఈ దాడు లను కొనసాగిస్తున్నారు."**



గిట్టుబాటు ధరలకోసం మాందసౌర్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

ధాన్యాలను నిలిపివేయటంతో ఆహారధాన్యాల కొరతను ఎదుర్కొంటున్న కేరళ, త్రిపుర లాంటి రాష్ట్రాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి.

**దిగజారుతున్న మహిళల పరిస్థితి**

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు పెరిగాయి. మహిళలు వంటయింటికి, పిల్లల పెంపకానికి పరిమితం కావాలని సంఘ్ పరివార్ ప్రచారం చేస్తున్నది. వస్త్రధారణ, వ్యకిగత ప్రవర్తన గురించి సంఘ్ పరివార్ నాయకులు, మంత్రులు, బిజెపి యంపి లు, యంయల్ఎలు మహిళలను అవమానించే విధంగా వ్యాఖ్యానిస్తున్నారు. మహిళలను మధ్య యుగాల నాటి పరిస్థితులలోకి నెట్టాలని ప్రయత్ని స్తున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో మహిళ లపై అత్యాచారాలు పెరిగాయి. కేంద్ర ప్రభు త్వం శాంతి భద్రతలను నిర్వహిస్తున్న దేశరాజ ధాని ఢిల్లీలోనే మహిళలకు రక్షణ కరువైంది. మహిళలను అపహరించుకువెళ్ళి, అత్యాచారాలు, హత్య చేయటం పెరుగుతున్నాయి. జాతీయ ఆహారభద్రతా చట్టం ద్వారా గర్భవతులైన మహి ళలకు ఇవ్వాల్సిన ప్రయోజనాలను ఇద్దరు బిడ్డల నుండి ఒకరికి కుదించి, ఇచ్చేమొత్తాన్ని 6,000 నుండి 5,000 రూపాయలకు తగ్గించారు. దీనిని కూడా ఆధార్‌తో ముడిపెట్టటంతో అనేకమంది ఈ ప్రయోజనాన్ని కూడా పొందలేకపోతున్నారు.

శ్రామిక మహిళలకు సమానపనికి సమాన వేతనం లేదు. వారికి ప్రసవకాలంలో సెలవు లు, పిల్లలకు క్రెచ్‌లు ఏర్పాటు చేయటం లేదు. పురుషులతో పోల్చుకున్నపుడు మహిళలలో రెట్టింపు నిరుద్యోగం ఉన్నది. అక్షరాస్యతలో బాలుర కన్నా బాలికల శాతం తక్కువగా ఉ న్నది. లింగ సమానత్వం విషయంలో భారత దేశం 145 దేశాలలో 136వ స్థానంలో ఉ న్నదని ఐక్యరాజ్యసమితి నివేదిక స్పష్టం చేస్తున్నది.

**దళితులు**

మోడి అధికారానికి వచ్చిన తర్వాత దళి తుల పరిస్థితి క్రమంగా దిగజారుతున్నది. దళితులపై దాడులు పెరిగాయి. ప్రభుత్వ రంగా న్ని కుదించటం, ప్రభుత్వశాఖలు, పరిశ్రమలలో ఉన్న ఖాళీలను భర్తీచేయకపోవటంతో వారికి ఉపాధి కరువౌతున్నది. యస్‌సి, యస్‌టి సబ్ ప్లాన్‌ను ప్రభుత్వం నీరుగారుస్తున్నది. చట్ట ప్రకారం దళితులు, గిరిజనుల అభివృద్ధికి కేటా యించాల్సిన మొత్తాలలో 55, 66 శాతాలను, దళితులకు 91,386 కోట్ల రూపాయలకు 52,393 కోట్లు, గిరిజనులకు 47,276కోట్లకు 31,920 కోట్ల రూపాయలను మాత్రమే కేటా యించారు. కేటాయించిన మొత్తాలను కూడా పూర్తిగా ఖర్చు చేయటం లేదు. ఈ కాలంలో దళితులపై దాడులు పెరిగాయి ఉనాలో చని పోయిన ఆవుచర్మం వలుస్తున్న దళిత యువ కులను గోగూండాలు చితకబాదారు. యుపిలోని సహరాన్‌పూర్‌లో దళితులపై దాడులు కొనసాగు తున్నాయి. ఎక్కడ తమ స్వతంత్రత, గౌరవాన్ని కాపాడుకోవటానికి దళితులు ప్రయత్నం చేస్తు న్నారో అక్కడ వారిపై సంఘ్ పరివార్ దాడులు చేస్తున్నది. కులవ్యవస్థలో అట్టడుగున ఉన్న దళితులను అదే స్థానానికి పరిమితం చేయాలనే లక్ష్యంతో ఈ దాడులను కొనసాగిస్తున్నారు.

**శాంతిభద్రతలు**

శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా క్షీణిం చింది. మతోన్మాదమూకలు స్వైరవిహారం చేస్తు న్నాయి. మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమాయక ముస్లింలు, దళితులను గోరక్షకులు కొట్టి చంపుతున్నారు. గోమాంసం ఇంట్లో ఉందనే పేరుతో మహమ్మద్ అఖ్లాక్‌ను కొట్టిచంపారు. ఆవులను కొనుక్కెళుతున్నవారిపై దాడులు చేసి చంపుతున్నారు. లవ్‌జిహాద్, మత మార్పిడులకు పాల్పడుతున్నారనే పేరుతో ముస్లిం యువకులపై దాడులు చేస్తున్నారు. యుపిలో యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చిన తర్వా త దాడులు మరీ తీవ్రమయాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాంటి రోమియో, గోరక్షణ దళాలు ముస్లిం, దళితులపై దాడులు చేయటం తో పాటు తమ మాట వినని పోలీసు అధికారు లపై కూడా దాడులు చేస్తున్నాయి. సంఘ్‌పరివార్ దాడులకు సహకరించని, నిష్పక్షపాతంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం పనిచేస్తున్న పోలీసు అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బెదిరిస్తున్నది. వారిని దూరప్రాంతాలకు బదిలీ చేస్తున్నది. కేంద్రప్రభుత్వం జంతుహింస నిరోధక చట్టం 1960కి అనుబంధంగా జారీచేసిన నిబంధనలు పరిస్థితి మరింత దిగజారటానికి కారణమౌ తున్నాయి. ఈ నిబంధనల ఆధారంగా ఎక్కడ, ఎప్పుడు, ఎవరినైనా వేధించటానికి కేంద్ర ప్రభు త్వం అరాచకమూకలకు అవకాశం కల్పించింది.

**కాశ్మీర్ సమస్య పరిష్కారంలో విఫలం**

జమ్మూకాశ్మీర్ సమస్యను కేవలం శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యగా మాత్రమే చూస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆ సమస్య పరిష్కారం లో పూర్తిగా విఫలం అయింది. గతం నుండి పాలించిన ప్రభుత్వాలు కాశ్మీర్ ప్రజలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చకపోవటంతో అసంతృప్తి చెంది, ఆందోళనలు చేస్తున్న ప్రజలను ప్రభుత్వం శత్రువులుగా పరిగణిస్తున్నది. వారిపై పెల్లెట్‌లతో కాల్పులు జరపటంతో వందలాది మంది చూపు ను, కాళ్ళుచేతులను కోల్పోయారు. అసంతృప్తితో రాళ్ళు విసురుతున వారిపై సైనికులు కాల్పులు జరపటంతో అనేకమంది చనిపోయారు. ఈ

మధ్య పార్లమెంటుకు జరిగిన ఉప ఎన్నికలలో 7 శాతం మాత్రమే ఓట్లు పోలవటం కాశ్మీర్ ప్రజల మానసిక స్థితిని తెలియజేస్తున్నది. ఈ సందర్భంలో ఒక సైనికాధికారి తీవ్రవాదుల నుండి రక్షణ కోసమని ఒక కాశ్మీరీ ముస్లీం యువకుడ్ని జీపుకు ముందు కట్టుకుని ప్రయాణం చేయటం, ఆ అధికారిని ఆర్మీచీఫ్ అవార్డుతో సత్కరించటం, ఆ వైఖరిని ప్రభుత్వం బలపరచటం కాశ్మీరీయులను మానసికంగా మరింత దూరం చేసింది. గతంలో యువకులకు పరిమితమైన రాళ్ళు విసరటం లాంటి కార్యక్రమాలలో ఇపుడు యువతులు కూడా భాగస్వాములౌతున్నారు. బాల, బాలికలు కూడా సైన్యాన్ని వ్యతిరేకించే కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. కాశ్మీర్‌లోని అన్ని తరగతుల వారితో చర్చలు జరిపి, శాంతి పునరుద్ధరణకు కృషిచేయాలన్న సూచనలను ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. ప్రజలపై ప్రభుత్వ నిర్బంధం పెరగటంతో క్రమంగా వేర్పాటువాదులకు మద్దత్తు పెరుగుతున్నది. కాశ్మీర్ సమస్యపై ఈ ప్రభుత్వానికున్న తప్పుడు అవగాహన, సమస్యను రాజకీయంగా పరిష్కరించే ప్రయత్నాలకు బదులు శాంతిభద్రతల సమస్యగా పరిగణిస్తూ, సైన్యంతో అణచివేయటం ద్వారా పరిష్కరించాలని ప్రయత్నం చేయటంతో గతంలో ఏనాడు లేనంత ప్రమాదకరమైన పరిస్థితులు కాశ్మీర్‌లో నెలకొన్నాయి.

**"ప్రభుత్వం 2015లో అమెరికాతో 10 సంవత్సరాల సైనిక సహకార ఒప్పందాన్ని చేసుకున్నది. ఈ మధ్య కాలంలో మరోమూడు సైనిక ఒప్పందాలు చేసుకోవటంతో లొంగుబాటు మరింత తీవ్రమైంది. ఈ ఒప్పందాలన్నింటి ఫలితంగా మన విమాన, నౌకాశ్రయాలు అమెరికా సైన్యం వినియోగించుకోవటానికి అవకాశం ఏర్పడింది."**

### విదేశాంగ విధానం

విదేశాంగ విధానంలో స్వతంత్రంగా వ్యవహరించటం, దేశప్రయోజనాలలను కాపాడటంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దేశాన్ని అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మార్చింది. ఇరుగుపొరుగు దేశాలతో గతం నుండి కొనసాగుతున్న సత్సంబంధాలను విచ్చిన్నం చేసింది. ప్రభుత్వం 2015లో అమెరికాతో 10 సంవత్సరాల సైనిక సహకార ఒప్పందాన్ని చేసుకున్నది. ఈ మధ్య కాలంలో మరోమూడు సైనిక ఒప్పందాలు చేసుకోవటంతో లొంగుబాటు మరింత తీవ్రమైంది. ఈ ఒప్పందాలన్నింటి ఫలితంగా మన విమాన, నౌకాశ్రయాలు అమెరికా సైన్యం వినియోగించుకోవటానికి అవకాశం ఏర్పడింది. అమెరికా, ఇజ్రాయెల్ మనకు అతి పెద్ద ఆయుధ సరఫరాదారులుగా మారాయి. అమెరికా, జపాన్‌లతో కలిసి మనదేశం హిందు మహాసముద్రంలో సైనిక విన్యాసాలు నిర్వహించింది. గత సంవత్సరం అమెరికా, జపాన్‌తో కలిసి మనదేశం ఒకినావా తీరంలో జరిపిన సైనిక విన్యాసాలు దక్షిణ చైనా సముద్ర వివాదంలో తలదూర్చేలా చేశాయి. ఈవిధమైన పరిణామాలు చైనాతో మన సంబంధాలు దెబ్బతినటానికి కారణమౌతున్నాయి.



కాశ్మీర్‌లో సైన్యానికి వ్యతిరేకంగా ఆందోళన

పాకిస్థాన్‌తో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరులో స్థిరత్వం లేదు. కొన్ని సందర్భాలలో అనూహ్యమైన సాన్నిహిత్యం, మరికొన్ని సందర్భాలలో అనవసరంగా దూరం పెరిగే విధంగా వ్యవహరిస్తున్న తీరు సంబంధాల మెరుగుదలకు దోహదం చేసేదిగా లేదు. మోడి తన ప్రమాణ స్వీకారం సందర్భంగా పాకిస్థాన్ ప్రధానితో సహా దక్షిణాసియా దేశాల నాయకులను ఆహ్వానించటం సంబంధాల మెరుగుదలకు దోహదం చేసింది. తర్వాత పాక్ రాయబారి కాశ్మీర్ వేర్పాటువాదులతో మాట్లాడాడనే నెపంతో ద్వైపాక్షిక చర్చలను రద్దుచేసింది. తర్వాత నవాజ్‌షరీఫ్ మనవరాలి పెళ్ళికని మోడి హఠాత్తుగా పాకిస్థాన్ వెళ్ళాడు. ఈ తర్వాత పఠాన్‌కోట్ సైనిక స్థావరంపై దాడి పరిస్థితిని దిగజార్చింది. ఉభయ ప్రభుత్వాల ప్రతినిధులు వివిధ సందర్భాలలో చేసుకుంటున్న పరస్పర ఆరోపణలు మరింతగా దూరం పెరగటానికి దారితీస్తున్నాయి. నేపాల్ రాజ్యాంగాన్ని ఆమోదించిన తర్వాత ప్రభుత్వం వ్యవహరించిన తీరు, మదేశీల ఆందోళన సందర్భంగా నేపాల్‌కు నిత్యావసర సరుకులను పంపకుండా ఆపివేయటం, ఆ దేశంలో భూకంపం సంభవించినపుడు వ్యవహరించిన తీరు తదితరాలు నేపాల్ ప్రజలను భారతదేశానికి దూరం చేశాయి. ఈ విధంగా విదేశాంగ విధానంలో ఈ ప్రభుత్వం వైఫల్యం స్పష్టమౌతున్నది.


### ప్రభుత్వ విధానాలను సమైక్యంగా ప్రతిఘటించాలి

బిజెపి ప్రభుత్వం మూడు సంవత్సరాల సంబరాలను జరుపుకుంటున్న తరుణంలో ఈ విధంగా దేశంలోని వివిధ వర్గాలు, సామాజిక తరగతులు, మైనారిటీలు తీవ్రమైన ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. సమస్యలను ఎదుర్కొంటున్న ప్రజలు వాటి పరిష్కారం కోసం క్రమంగా పోరాటాలలోనికి వస్తున్నారు. ప్రజల పరిస్థితులను పట్టించుకోకుండా ఆర్‌యస్‌యస్ లక్ష్యమైన దురహంకారంతో కూడిన హిందు మతోన్మాద దేశంగా భారతదేశాన్ని రూపొందించటానికి మోడి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఆర్‌యస్‌యస్ ఇదేవిధంగా తన అజెండాను ముందుకు తీసుకుపోవటం జరిగితే దేశం విచ్ఛిన్నం అవుతుంది. దేశం బహిరంగ నిర్బంధ శిబిరంగా మారుతుంది. మైనారిటీలు, దళితులపై దాడులు, హత్యాకాండ తీవ్రం అవుతాయి. ఐయస్ఐ తీవ్రవాదులలాగా దేశంలోని గూండాగుంపులు తీవ్రవాదుల రూపం ధరించటంతో ప్రజల ఆస్తులు, ప్రాణాలకు భద్రతలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఆర్‌యస్‌యస్, మోడి ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలను కమ్యూనిస్టులు, వామపక్షశక్తులు, లౌకిక, అభ్యుదయవాదులు, మేధావులు వ్యతిరేకిస్తూ, ప్రజానీకాన్ని చైతన్యపరచాలి. కార్మిక వర్గం, రైతాంగం, చిన్న వృత్తులు, వ్యాపారాలు చేసుకునే కష్టజీవులు, దళితులు, మైనారిటీలు, గిరిజనులు, వివిధ సామాజిక తరగతుల ప్రజలను సమైక్యంగా పోరాటరంగంలోకి సమీకరించటం ద్వారా ఆర్‌యస్‌యస్ ప్రతీఘాతుక విధానాలను ప్రతిఘటించాలి. ❋

**అక్టోబరు సోషలిస్టు విప్లవ శతవార్షిక ప్రత్యేకం**

# వ్యవసాయ సమస్యపై లెనిన్ అవగాహన

**కొండూరి వీరయ్య**



రచయిత వ్యవసాయ కార్మికసంఘం వర్కింగ్ కమిటీ సభ్యులు

రష్యాలో బానిసత్వం చట్టపరంగా రద్దైంది మొదలు సోషలిస్టు విప్లవం సాధించేనాటికి యాభై ఏళ్లు గడిచింది. ఈ యాభై ఏళ్ల కాలంలో రష్యాలో వ్యవసాయక సమస్య, విప్లవ సాధనలో దాని పాత్ర గురించి ప్రజాతంత్ర శక్తుల్లో పెద్ద ఎత్తున చర్చ నడిచింది. 1890 దశకంలో రష్యా రాజకీయాలను అధ్యయనం చేయటం ప్రారంభించిన లెనిన్ తొలిసారిగా అధ్యయనం చేసింది వ్యవసాయక సమస్యనే. సాహిత్యం అందుబాటులో ఉన్నంతవరకు రష్యాలోనే కాక జర్మనీ, అమెరికాల్లో వ్యవసాయ సంబంధాల్లో వస్తున్న మార్పులను ఆయన నిరంతరం అధ్యయనం చేశాడు. పాలకవర్గాల అవసరాల కోసం సేకరించబడిన వ్యవసాయక గణాంకాలను పునఃసమీక్షించి మార్క్సిస్టు అవగాహన పెంపొందించుకోవటం కోసం అవే గణాంకాలు ఉపయోగించుకున్నాడు. వర్ధమాన దేశాల్లోని వ్యవసాయక సమస్యకు, మార్క్స్ సూత్రీకరించిన ప్రాథమిక సంచయానికి మధ్య ఉన్న సంబంధాన్ని ప్రపంచీకరణ నేపథ్యంలో అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి మరోసారి చర్చకు తెచ్చింది. ఈ నేపథ్యంలో రష్యాలో వ్యవసాయక సమస్యను విప్లవోద్యమంతో జోడించటానికి లెనిన్ సాగించిన నిరంతరాయమైనన కృషిని తెలుసుకోవటం విప్లవోద్యమ కార్యకర్తలకు ఎంతైనా అవసరం. ఈ వ్యాసం రష్యా విప్లవంలో వ్యవసాయక సమస్యపై లెనిన్ అవగాహన, దాని పరిణామాన్ని తెలుసుకోవటానికి సంక్షిప్త పరిచయంగా ఉపకరిస్తుందని భావిస్తున్నాను.

రష్యా వ్యవసాయక సమస్యను మార్క్సిస్టు కోణంలో అధ్యయనం చేసే క్రమంలో లెనిన్ కొన్ని ప్రామాణిక రచనలు చేశాడు. అవి 1893లో రైతాంగ జీవితంలో నూతన ఆర్థిక పరిణామాలు (దక్షిణ రష్యాలో రైతాంగ సేద్యం అన్న వివై పోస్ట్నికోవ్ గ్రంధానికి సమీక్ష), నరోద్నిజం యొక్క ఆర్థిక కోణం : దానిపై పి. స్ట్రూవె విమర్శ, (సంకలిత రచనలు, సంపుటి 1) 1895–96లో రాసిన "సోషల్ డెమోక్రటిక్‌పార్టీ ముసాయిదా కార్యక్రమం, వివరణ" (సంపుటి2) మొదటి దశకు చెందిన రచనలుగా వర్గీకరించవచ్చు. ఈ రచనల్లో ప్రధానంగా పెరుగుతున్న జనాభాతో వచ్చిన సమస్యలు, రైతాంగంలో వేళ్లూనుకుంటున్న అంతర్వర్గ విభజన, రష్యాలో విస్తరిస్తున్న పెట్టుబడిదారీ విధానం, రైతాంగంపై దాని ప్రభావం, స్వంత సేద్యంలో వస్తున్న సమస్యలు గురించి అధ్యయనం చేశాడు. ఈ పరిశీలన కొనసాగింపే రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావం అసంభవం అన్న నరోద్నిక్కుల వాదనను తుత్తునియలు చేస్తూ "రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి : భారీ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన దేశీయ మార్కెట్ కల్పన" (సంకలిత రచనలు, సంపుటి 3) 1899లో రాసిన ప్రపంచ మార్కెట్ : వ్యవసాయక సంక్షోభం అన్న గ్రంధ సమీక్షలో ప్రపంచ వ్యవసాయక సంక్షోభం నేపథ్యంలో కౌలు చెల్లింపు ఎలా సమస్యాత్మకమవుతుందో వివరిస్తాడు. 1899లోనే గోజ్డెవ్ గ్రంథం గ్రామీణ ధనికుల వడ్డీ దోపిడీ – దాని ఆర్థిక ప్రాధాన్యతను సమీక్షిస్తూ మధ్యయుగాల నాటి గ్రామీణ వ్యవస్థలు వ్యవసాయరంగంలో వ్యక్తిగత పెట్టుబడి ప్రవేశాన్ని నియంత్రిస్తున్న తీరును విశ్లేషిస్తాడు. ఈ కారణంగానే రష్యాలో వ్యవసాయ రంగం దివాళా తీసిందని, లక్షలాది మందిని పొట్టపోసుకోవటానికి వలస వెళ్లే కార్మికులుగా మారుస్తుందని సూత్రీకరిస్తాడు. కాట్స్కీ రచన వ్యవసాయక సమస్యను సమీక్షిస్తూ మార్క్స్ పెట్టుబడి మూడో సంపుటం తర్వాత అంత ప్రాధాన్యత కలిగిన గ్రంధం మరోటి రాలేదని వ్యాఖ్యానిస్తాడు. ఈ రచనలో చిన్న, సన్నకారు రైతాంగం పెద్దఎత్తున కుటుంబ శ్రమ చేయటం ద్వారా వ్యవసాయానికి అయ్యే ఖర్చులు తగ్గించుకుంటారని, దాంతో దివాళా తీయకుండా కాపాడబడతారన్న ముఖ్యమైన సూత్రీకరణను లెనిన్ ప్రశంసిస్తాడు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ ప్రధానంగా అప్పుడే తెరమీదకు వస్తున్న గ్రామీణ బూర్జువా వర్గం చొరవతో ప్రారంభమవుతుందన్న కాట్స్కీ నిర్ధారణను సమర్థిస్తాడు. ఈ శీర్షికలో ఉన్న మొత్తం ఏడు వ్యాసాలు 700 పేజీలకు పైగా ఉన్న కాట్స్కీ పుస్తకాన్ని అర్థం చేసుకోవటానికి ఉపోద్ఘాతంగా పని చేస్తాయి.

1901–1906 మధ్య కాలంలో లెనిన్ వ్యవసాయక సమస్యపై చేసిన రచనలు ప్రధానంగా క్రియాశీల రాజకీయాలతో ముడిపడి ఉన్నాయి. వ్యవసాయక సమస్యపై లెనిన్ అవగాహనకు నిర్దిష్టతను సమకూర్చే ప్రయత్నంలో ఈ రచనలను రెండో దశగా వర్గీకరించవచ్చు. ఈ దశకు చెందిన రచనలు మార్క్సిస్టు విశ్లేషణను 20వ శతాబ్దానికి, ప్రత్యేకించి వ్యవసాయక సమాజాలకు వర్తింప చేయటంలో జరిగిన కృషిగా కూడా గుర్తించవచ్చు. 1901లో రాసిన కార్మిక పార్టీ – రైతాంగం అన్న రచన 1903లో జరిగిన రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ (ఆరెస్డీఎల్పీ) రెండో మహాసభలో ఆమోదం పొంది, పార్టీ అధికారిక వైఖరిగా మారింది. ఈ రచనలో రష్యాలో రైతు చట్టబద్ధమైన వెట్టిచాకిరి నుండి విముక్తి పొందినా ఊరుమ్మడి భూమికి బందీ అయి తిరిగి స్వచ్ఛందంగా భూస్వాములకు వెట్టిచేసి బతకాల్సిన దుస్థితికి నెట్టబడ్డాడన్న అంచనాకు వస్తాడు. పెద్ద సంఖ్యలో రైతాంగం దివాళా తీసి భూములు కోల్పోయి, వేతన కార్మికులుగా మారిన నేపథ్యంలో కొద్ది మందిగా ఉన్న కులక్కులు భారీ భూఖండాలపై పెత్తనం చేస్తూ గ్రామీణ పాలకవర్గంగా ఎదిగారని తీర్మానిస్తాడు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వైరుధ్యాల గురించి విశ్లేషిస్తూ వేతన కార్మికులు, శ్రమ దోపిడీదారుల మధ్య ఒక తరహా వైరుధ్యం, యావత్ రైతాంగం, భూస్వామ్య వర్గాల మధ్య మరో తరహా వైరుధ్యం ఉన్నాయని చెప్తాడు.

రష్యన్ సోషల్ డెమోక్రాట్లకు వర్తమానంలో రెండో వైరుధ్యమే రాజకీయ ప్రాధాన్యత కలిగిందని కూడా ఆయన అంచనాకు వస్తాడు.

1902 మార్చిలో రాసిన రష్యన్ సోషల్ డెమోక్రసీ యొక్క వ్యవసాయక కార్యక్రమం రచన ప్రధానంగా ఆరెస్డీఎల్పీ పార్టీ ముసాయిదా కార్యక్రమంలో వ్యవసాయక సమస్య భాగంపై ఆయన వ్యాఖ్యానమే. ఇక్కడే కార్మిక కర్షక ఐక్య సంఘటన విప్లవానికి సారధ్యం వహించాలని ప్రతిపాదిస్తాడు. 1903లో రాసిన గ్రామీణ పేదలకు రచన గ్రామీణ ప్రాంతంలో నిర్వహించాల్సిన వర్గపోరాటానికి దిక్సూచిగా పని చేసింది. గ్రామీణ జనాభాను అందుబాటులో ఉన్న గణాంకాల ప్రాతిపదికన నాలుగు వర్గాలు : భూస్వాములు, రైతాంగ బూర్జువాలు (సమాంతర అర్థంలో ధనిక రైతువర్గంగా చెప్పుకోవచ్చు) మధ్యతరగతి రైతులు, అర్థ కార్మికులు (చిన్న, సన్నకారు రైతాంగం, వ్యవసాయ కార్మికులను ఒకే కోవ కింద పరిగణించాడు) అన్న వర్గాలుగా విభజించాడు. సోషల్ డెమొక్రాట్లు ఆశిస్తుందేమిటి అన్న సెక్షన్‌లో రాజకీయ స్వేచ్ఛ, పౌర స్వేచ్ఛలమధ్య ఉన్న వ్యత్యాసాన్ని సమకాలీన రష్యా సామాజిక జీవితానుభవాల నుండి ఉదాహరణలతో పోలుస్తూ వివరిస్తాడు. ప్రజలు తమ సామాజిక జీవితాన్ని, తమ ప్రతినిధులను, తమకోసం ప్రభుత్వం రూపొందించే విధానాలను, వాటిని అమలు చేసే అధికారులను, తమ భావాలు, అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు పత్రికలు నడుపుకోవటం వంటి అంశాల్లో ఉండే స్వేచ్ఛను రాజకీయ స్వేచ్ఛ, అని వివరిస్తాడు. ఇటువంటి స్వేచ్ఛనే మాక్జిం గోర్కీ ' వడ్రంగి చేతిలో ఉన్న రంపానికున్న స్వేచ్ఛ'గా వ్యాఖ్యానిస్తాడు. రాజకీయ స్వేచ్ఛ సాధించినంత మాత్రాన ప్రజలు పేదరికం నుండి విముక్తి పొందలేరని, అయితే పేదరికంపై పోరాటానికి రాజకీయ స్వేచ్ఛ సాధనంగా ఉపయోగపడుతుందని చెప్తాడు. అంతే కాదు. భూమిపై భూస్వాముల గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టకుండా కొద్దిపాటి రాయితీలు, చౌకగా వ్యవసాయ ఉపకరణాలు అందుబాటులోకి తెచ్చినంత మాత్రాన మధ్యతరగతి రైతులు భూస్వామ్యవర్గపు పీడన నుండి విముక్తి పొందలేరని, ఈ పీడన దోపిడీ నుండి విముక్తి పొందాలంటే ఇటువంటి విముక్తి కోసం పోరాడుతున్న పట్టణ ప్రాంత కార్మికవర్గంతో చేతులు కలపాలని ఉద్బోధిస్తాడు.

ఆరెస్డీఎల్పీ రెండో మహాసభలో వ్యవసాయక కార్యక్రమంపై జరిగిన చర్చల్లో ఉపన్యాసాలు, సమాధానం, (సంపుటి6)లో బూర్జువావర్గం అపరిష్కృతంగా వదిలిన ప్రజాతంత్ర విప్లవ

**“గ్రామీణ ప్రాంతాలను బూర్జువా దోపిడీ సంబంధాల నుండి విముక్తి చేయటం పార్టీ ప్రకటిత లక్ష్యంగా ఉండాలని ఆయన ప్రతిపాదిస్తాడు. ఏ ప్రాంతంలో ఏ తరహా ఫ్యూడల్ దోపిడీ సంబంధాలు ఉన్నాయన్నది నిర్ధారించి, వాటిపై పోరాటానికి స్థానిక ప్రత్యేకతలతో కూడిన వ్యూహాలు, ఎత్తుగడలు రూపొందించుకునే అవకాశం స్థానిక కమిటీలకు ఉండాలని కూడా లెనిన్ ఈ చర్చలో ప్రతిపాదిస్తాడు.”**

కర్తవ్యాలను కూడా సోషల్ డెమోక్రటిక్ పార్టీ నెరవేర్చాలని పిలుపునిస్తాడు. సమకాలీన రష్యాలో అటువంటి ఫ్యూడల్ బంధనాలను గుర్తించి వాటిపై పోరాట రూపాలను కూడా ఈ చర్చల్లో ప్రస్తావిస్తాడు. గ్రామీణ ప్రాంతాలను బూర్జువా దోపిడీ సంబంధాల నుండి విముక్తి చేయటం పార్టీ ప్రకటిత లక్ష్యంగా ఉండాలని ఆయన ప్రతిపాదిస్తాడు. ఏ ప్రాంతంలో ఏ తరహా ఫ్యూడల్ దోపిడీ సంబంధాలు ఉన్నాయన్నది నిర్ధారించి, వాటిపై పోరాటానికి స్థానిక ప్రత్యేకతలతో కూడిన వ్యూహాలు, ఎత్తుగడలు రూపొందించుకునే అవకాశం స్థానిక కమిటీలకు ఉండాలని కూడా లెనిన్ ఈ చర్చలో ప్రతిపాదిస్తాడు. ఈ భూస్వామ్య సంబంధాల నుండి దేశాన్ని విముక్తి చేయటానికి గల ఒకే ఒక మార్గం విప్లవం అన్న ప్రత్యామ్నాయాన్ని ముందుకు తేవటంతో ఈ చర్చను ముగిస్తాడు.

1904లో రాసిన ఒకడుగు ముందుకు : రెండడుగులు వెనక్కు అన్న గ్రంథంలో వ్యవసాయక సమస్య అధ్యాయం, (సంపుటి 7) పార్టీలో ఉన్న అంతర్గత సంక్షోభం నేపథ్యంలో సార్వత్రిక భూపంపకం అన్న డిమాండ్, దాని ఆచరణ సాధ్యా సాధ్యాలు, ఆరెస్డీఎల్పీ అనుసరించాల్సిన వైఖరి గురించి చర్చిస్తాడు. 1905లో ఆరెస్డీఎల్పీ మూడో మహాసభకు వ్యవసాయక కార్యక్రమంపై రాసిన లేఖ, రైతాంగ ఉద్యమాలను సమర్ధిస్తూ ముసాయిదా తీర్మానంలో పలు రకాల భూసంస్కరణల గురించి సోషలిస్టు రివల్యూషనరీలు ముందుకు తెచ్చిన ప్రతిపాదనలను విమర్శిస్తాడు. “రైతులకు భూములు కావాలి. భూస్వాముల భూములను ఆక్రమించటంలోనే రైతు తన ప్రజాతంత్ర చైతన్యాన్ని, స్వాభావిక కోర్కెను, విప్లవ కార్యాచరణను మేళవించి వ్యక్తం చేస్తాడు. కొన్ని పార్టీలు రైతాంగపు భూ ఆక్రమణ ఉద్యమానికి ఆంక్షలు విధిస్తున్నాయి. ఎటువంటి ఆంక్షలు లేకుండా అన్ని రకాల భూములను ఆక్రమించుకునేందుకు రైతాంగం సాగిస్తున్న ఉద్యమానికి బేషరతు మద్దతు ఇవ్వాలి” అని ప్రకటిస్తాడు. (సంపుటి8). రైతాంగ పోరాటాలను సమర్ధిస్తూ 1905 మేలో జరిగిన రెండో ఆరెస్డీఎల్పీ మహాసభలో సంఘీభావ తీర్మానాన్ని ప్రతిపాదిస్తాడు. ఈ తీర్మానంలో గ్రామీణ ప్రాంతంలోని భూస్వాముల భూములను, ఎస్టేట్లను స్వాధీనం చేసుకోవటం కనీస విప్లవ కార్యక్రమంగా ఉండాలని పిలుపునిస్తాడు. తద్వారా సోషలిస్టు రివల్యూషనరీల కంటే బోల్షివిక్ పార్టీ ఆందోళనలో ఉన్న రైతాంగాన్ని చేరుకోవటంలో మరో అడుగు ముందుంటుంది. అదేసమయంలో ప్రస్తుతం ఉన్న జారిస్టు రష్యాలో రైతాంగం స్వేచ్ఛగా భూస్వాముల భూములు స్వాధీనం చేసుకోవటం సాధ్యం కాదని, ఈ ఆకాంక్షను ఆచరణగా మార్చాలంటే దేశవ్యాప్త విప్లవోద్యమంలో రైతాంగ ఉద్యమాలు జతకట్టాలని లెనిన్, ప్లెఖనోవ్ పిలుపునిస్తారు. కార్మికవర్గం : రైతాంగం అన్న వ్యాసంలో (నవంబరు, 1905లో రాసింది) భూస్వాములు, పెట్టుబడి, ప్రభుత్వాధికారులకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో మొత్తం రైతాంగాన్ని సమైక్యం చేయాలని పిలుపునిస్తాడు. పైన చెప్పుకున్నట్లు మధ్యతరగతి రైతాంగం, వేతన కార్మికులు అన్న వ్యత్యాసాన్ని ఇక్కడ పాటించక పోవటాన్ని గమనించాలి.


మార్చి, 1906లో రాసిన వర్కర్స్ పార్టీ వ్యవసాయక కార్యక్రమం వివరణ స్థూలంగా రష్యాలో వ్యవసాయక సమస్యపై ఆరెస్డీఎల్పీ అవగాహన చరిత్రను వివరించటంతో పాటు సమకాలీన చర్చల్లో తలెత్తిన తప్పుడు అభిప్రాయాలు ఎత్తిచూపుతూ వాటిని సవరించే ప్రయత్నం చేస్తాడు లెనిన్. ఈ ప్రతిపాదనలే 1906లో జరిగిన బోల్షివిక్ మహాసభలో ఆమోదించిన వ్యవసాయక కార్యక్రమానికి భూమికగా ఉంటాయి. 1902 నాటి ప్రస్తావనలో సాధ్యమైనంత మెజారిటీని కూడగట్టుకోవటం కోసం, పార్టీలో ఐక్యత నిలపటం కోసం ప్లెఖనోవ్ అభిప్రాయాన్ని మన్నించి, భూముల జాతీయకరణ ప్రతిపాదనను వెనక్కు తీసుకుంటే దీనికి భిన్నంగా

> **“1905-06 ఉద్యమంలో వేతన కార్మికుల పాత్రను విశ్లేషిస్తూ 1891-1900తో పోల్చినపుడు 1910 నాటికి గ్రామీణ రష్యాలో వ్యవసాయ కార్మిక వేతనాలు 25 శాతం పెరిగినా నిజవేతనాలు పెరుగుదల మాత్రం నాలుగు శాతంలోపే ఉందని రాస్తాడు. గ్రామీణ రైతాంగ ప్రతిఘటనోద్యమంలో వేతన కార్మికుల ప్రాధాన్యతను ముందుకు తెచ్చే విశ్లేషణ ఇది.”**

1906లో బోల్షివిక్ మహాసభలో ఆమోదించిన వ్యవసాయక కార్యక్రమంలో భూముల జాతీయ కరణ నినాదం వెనక ఉన్న మార్క్సిస్టు అవగాహ నను కౌలు దోపిడీ తీరుతెన్నులతో ముడిపెట్టి వివరిస్తాడు.

భూసమస్య : స్వేచ్ఛ కోసం పోరాటం, వ్యవసాయక సమస్యపై చర్చకు సమాధానం (సంపుటి10)లో పార్లమెంట్ ముందున్న వ్యవసాయక సమస్య తీర్మానాలపై విమర్శ ఉ ంటుంది. 1907లో రాసిన వ్యవసాయక సమస్య : విప్లవంలో వర్గాలు (సంపుటి12)లో ప్రధా నంగా పార్లమెంట్ ప్రతిపాదించిన బలవంతపు బేదఖళ్ల చట్టం వెనక ఉన్న ఆర్థిక, రాజకీయ కోణాలు, ఈ చట్టం పట్ల వివిధ పార్టీల వైఖరు లు, రైతాంగ పోరాటాలపై వాటికున్న నిబద్ధతను చర్చకు పెడతారు. తద్వారా బోల్షివిక్ పార్టీ వ్యవసాయక కార్యక్రమం మిగిలిన పార్టీల కంటే ఎంత భిన్నమైనదో నిరూపించటం ద్వారా పోరా డుతున్న రైతాంగానికి నమ్మకమైన మిత్రులు బోల్షివిక్ పార్టీయే అని వాదిస్తారు.

1905-1907 మొదటి రష్యా విప్లవంలో సోషల్ డెమోక్రసీ యొక్క వ్యవసాయక కార్య క్రమం, (సంపుటి 13)లో రైతాంగ తిరుగుబాట్ల వెనక ఉన్న ఆర్థిక కారణాలు, రష్యా మొదటి విప్లవంతో ముందుకొచ్చిన డిమాండ్ల నేపథ్యంలో ఆర్ఎస్డీఎల్పీ వ్యవసాయక కార్యక్రమంతో తులనా త్మక పరిశీలన, భూముల జాతీయకరణకు సైద్ధాంతిక ప్రాతిపదిక, వ్యవసాయక కార్య క్రమంలో ఇమిడి ఉన్న రాజకీయ, ఎత్తుగడలకు సంబంధించిన సమస్యలు, పార్లమెంట్‌లో వ్యవ సాయక సమస్యపై చర్చలో వివిధ పార్టీలు, వర్గాలు తీసుకున్న వైఖరుల గురించి సవివరమైన విశ్లేషణ ఉంటుంది. 1905-07 రైతాంగ తిరుగుబాట్లు తర్వాత ప్రభుత్వం అమలు చేసిన స్టోలిపిన్ సంస్కరణలు ఫ్యూడల్ భూ సంబంధా లను బాగా బలహీనపర్చిన నేపథ్యంలో 1909 లో స్కోర్ట్సోవ్-స్టెపనోవ్‌లకు రాసిన లేఖలో (సంపుటి 15) ఈ సంస్కరణల ప్రభావాన్ని



విప్లవ నేత వి.ఐ. లెనిన్

లోతుగా విశ్లేషిస్తాడు. స్టోలిపిన్ సంస్కరణల కారణంగా గ్రామీణ పేదలు అంతకంతకూ వేతన కార్మికులుగా మారే పరిణామం వేగం పుంజుకున్నప్పటికీ, రష్యా వ్యవసాయరంగంలో పూర్తిస్థాయి బూర్జువా సంస్కరణలు చోటు చేసుకోలేదని అభిప్రాయపడతాడు. 1910లో రాసిన ఆధునిక సేద్యంలో పెట్టుబడిదారీ పద్ధతులు (సంపుటి 16) ప్రధానంగా జర్మనీలో వ్యవసాయ సంస్కరణలపై వ్యాఖ్యగా ఉంటే, 1911లో రాసిన రైతాంగ సంస్కరణలు : కార్మికవర్గ విప్లవం (సంపుటి 17)లో 1861 నాటి బానిస విముక్తి సంస్కరణలకు, వర్తమా నంలో రైతాంగం కోరుకుంటున్న సంస్కరణలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తాడు. ఈ సంస్క రణలు బానిసత్వం స్థానంలో భూస్వామ్య రష్యా కు పునాదులు వేశాయని, ఈ దశలోనే స్వంత రైతులు, తర్వాతి కాలంలో ముందుకొచ్చిన గ్రామీణ బూర్జువా వర్గం ఆవిర్భావానికి మూలా లు ఉన్నాయని లెనిన్ విశ్లేషిస్తాడు. ఈ వ్యాసం లోనే విప్లవానికి, సంస్కరణలకు మధ్య ఉన్న వ్యత్యాసాల గురించి కూడా చర్చిస్తాడు లెనిన్.

గ్రామీణ రష్యాలోని వర్గపొందికలో వస్తున్న మార్పులపై స్టోలిపిన్ భూసంస్కరణల ప్రభావాన్ని వివరిస్తూ తర్వాతి కాలంలో కూడా ఎన్నికల్లో రైతులు, రైతాంగ ప్రతినిధులు, (సంపుటి 17) రష్యా వ్యవసాయక సమస్యల సారాంశం, నరోద్నిజం వ్యవసాయక కార్యక్రమం – స్టోలిపిన్ సంస్కరణల తులనాత్మక పరిశీలన, రైతాంగ భూముల సమీకరణ, భూయాజమాన్యంలో బడా భూస్వాములు, చిన్న రైతుల మధ్య తేడాలు (సంపుటి 18), రైతాంగ స్థితిగతులు మెరుగుపడు తున్నాయా దిగజారుతున్నాయా? భూస్వామ్యుల దృష్టిలో పరిష్కారమైన భూ సమస్య, ప్రస్తుత ప్రభుత్వపు వ్యవసాయక విధానం, రైతాంగం – కార్మికులు, స్వంత సేద్యంలో బాల కార్మికుల శ్రమ, నూతన భూ సంస్కరణ చర్యలు, స్వంత సేద్యంలో బూర్జువా పెద్దమనిషి, భూసమస్య – గ్రామీణ పేదలు, సమకాలీన రష్యాలో వ్యవ సాయక సమస్య (సంపుటి 19) వంటి వ్యాసాలు రాశాడు. లెనిన్ సంకలిత రచనలు 20వ సంపు టంలో రైతులు – వేతన కార్మికులు, వ్యవసాయ కూలీ వేతనాలు వ్యాసాల్లో చిన్న కమతాల్లో శ్రమ వినియోగం మోతాదు పెరిగే కొద్దీ వేతన శ్రామికుల అవసరం పెరుగుతుందని, వేతనాల సమస్య ముందుకొస్తుందని, అంత మాత్రాన ఇది వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాల విస్తరణకు భిన్నంగా జరుగుతున్న పరిణామంగా భావించరాదని హెచ్చరిస్తాడు. 1905-06 ఉ ద్యమంలో వేతన కార్మికుల పాత్రను విశ్లేషిస్తూ 1891-1900తో పోల్చినపుడు 1910 నాటికి గ్రామీణ రష్యాలో వ్యవసాయ కార్మిక వేతనాలు 25 శాతం పెరిగినా నిజవేతనాలు పెరుగుదల మాత్రం నాలుగు శాతం లోపే ఉందని రాస్తా డు. గ్రామీణ రైతాంగ ప్రతిఘటనోద్యమంలో వేతన కార్మికుల ప్రాధాన్యతను ముందుకు తెచ్చే విశ్లేషణ ఇది. సాధారణంగా భూముల జాతీయ కరణ సోషలిస్టులు లేదా కమ్యూనిస్టుల నినాద మన్న అభిప్రాయం నాటికీ, నేటికీ ఉంది. ఈ ప్రచారాన్ని తిరస్కరిస్తూ “భూముల జాతీయ కరణ, ప్రైవేటు భూములను జాతీయ వనరుగా మార్చాలన్న వాదన ముందుకు తెచ్చింది బూర్జు వా వర్గమేనని పెట్టుబడి, తత్వశాస్త్ర దారిద్ర్యం, అదనపు విలువ సిద్ధాంతం రచనల్లో మార్క్స్ నిర్ధారించాడు. ఈ చర్య ద్వారా పెట్టుబడిదారీ విధానం మరింత వేగంగా విస్తరించగులు తుందన్న అభిప్రాయం ఉంది. అయితే బూర్జువా లు ముందుకు తెచ్చిన భూముల జాతీయాకరణ నినాదానికి కమ్యూనిస్టుల సామాజికీకరణ నినాదానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాల” ని రష్యాలో వ్యవసాయక సమస్య అన్న రచన లో హెచ్చరిస్తాడు.

రష్యా విప్లవం ముంగిట్లోకి ప్రవేశించిన తర్వాత వ్యవసాయక సమస్యపై పార్టీ అవగాహ

నను ప్రభావితం చేస్తూ లెనిన్ చేసిన కృషి సంకలిత రచనలు 24వ సంపుటంలో నిక్షిప్తమై ఉంది. 1917 మార్చిలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడే నాటికి గ్రామీణ రష్యాలో రైతాంగ పోరాటాలు పతాక స్థాయికి చేరుకుంటాయి. ఈ పరిస్థితుల్లో మెన్షివిక్ ప్రభుత్వంలో వ్యవ సాయ శాఖ మంత్రిగా ఉన్న చెర్నోవ్ ప్రతిపాద నలను సూత్రప్రాయంగా అంగీకరిస్తూ జాతీయ భూకమిటీని నియమిస్తుంది. ఈ కమిటీ రూపొం దించే ప్రతిపాదనలు రాజ్యాంగపరిషత్‌లో చర్చకు పెట్టడం ద్వారా రష్యాలో వ్యవసా యక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ప్రభుత్వంలో మెజారిటీగా ఉన్న సోషలిస్టు రివల్యూషనరీ, కానిస్టిట్యూషనల్ డెమోక్రాట్ పార్టీలు హామీ ఇస్తాయి. ఈ తరుణంలో గ్రామీ ణ ప్రజలు ఈ పార్టీలు ముందుకు తెచ్చిన రాజ్యాంగబద్ధ పాలన భ్రమల్లో కొట్టుకు పోకుండా, విప్లవోద్యమానికి విఘాతం కలగకుం డా ఉండటానికి లెనిన్ చేసిన వాదనలు ఇందులో ఇమిడి ఉన్నాయి.

1917 ఏప్రిల్‌లో రాసిన మన విప్లవంలో కార్మికవర్గం పాత్ర అన్న రచనలో భూముల జాతీయకరణ నినాదాన్ని మళ్లీ ముందుకు తెస్తాడు. రీసెటిల్మెంట్ ఫండ్ మొదలు కౌలు దళారీల రద్దు వరకు 1917లో రైతాంగ ప్రతి ఘటన ముందుకు తెచ్చిన అనేక సమస్యలకు సంబంధించి ఆచరణాత్మక ప్రత్యామ్నాయాలను చర్చకు పెడతాడు. ఈ సమయంలోనే రాజ్యాంగ పరిషత్ కోసం రష్యాలో ఉద్యమం జరుగు తోంది. ప్రజలు విరివిగా సోవియట్లలో సమీకృ తులై ఉన్నారు. ఈ క్రమంలో భూ పంపకం అధికారాలు సోవియట్లకు అప్పగించాలన్న నినా దాన్ని ముందుకు తెస్తాడు. 1917 ఏప్రిల్‌లో వ్యవసాయక సమస్య మీద రష్యన్ పార్లమెంట్‌లో జరిగిన చర్చల నేపథ్యంలో 1917లో బోల్షివిక్ పార్టీ వ్యవసాయక సమస్యపై తన ఎత్తుగడలు మార్చుకుంటూ మరో తీర్మానం ప్రతిపాదిస్తుంది. ఈ తీర్మానం మీద జరిగిన చర్చలో 1906 లో స్టాక్‌హోంలో జరిగిన మెన్షివిక్కుల మహాసభ ఆమోదించిన ప్రతిపాదనల – భూస్వాముల ఎస్టేట్లను స్థానిక స్వపరిపాలన సంఘాలకు అప్ప గించాలన్న ప్రతిపాదనను రైతాంగం తిరస్కరిం చిందని, పార్లమెంట్‌లో జరిగిన చర్చల సరళిని పరిశీలిస్తే భూముల జాతీయకరణకే రైతాంగం మొగ్గు చూపుతున్నట్లు స్పష్టమవుతోందని లెనిన్ వాదిస్తాడు. "భూస్వాముల ఎస్టేట్లను ఎంత దృఢనిశ్చయంతో ముక్కలు చేస్తామో, రష్యాలో బూర్జువా వ్యవసాయక సంస్కరణలు అమలు జరపటంలో ఎంత నిక్కచ్చిగా వ్యవహరిస్తామో,

"విప్లవాన్ని విజయవంతం చేయటం కోసం విశాల ప్రజాతంత్ర శక్తులతో ఐక్య సంఘటన నిర్మా ణానికి లెనిన్ ఎంత ప్రాధాన్యత ఇచ్చారో తెలుసు కోవటానికి 1917 నవంబరు 8న విడుదల చేసిన భూమిపై నివేదికను పరిశీలించాలి. ఈ నివేదికలోనే ప్రఖ్యాత భూమి డిక్రీని పొందుపర్చారు."

బూర్జువా రైతాంగానికి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికుల వర్గ పోరాటాలు అంతే వేగంగా ఊపందుకుంటాయని" తీర్మానం పేర్కొంటుంది.

సంకలిత రచనలు 25వ సంపుటంలో రష్యాలో వ్యవసాయ కార్మికసంఘం ప్రారంభిం చాల్సిన ఆవశ్యకత గురించి వివస్తాడు లెనిన్. గ్రామీణ ప్రాంతంలో విశాల సంఖ్యలో ఉన్న వ్యవసాయ కార్మికులను సంఘటితం చేయాల్సిన అవసరం, విప్లవోద్యమంలో అటువంటి సంఘ టన ప్రాధాన్యతను వివరిస్తూ లెనిన్ " భూము లు జాతీయకరణ చేసినంత మాత్రాన వ్యవసాయ కార్మికులందరికీ భూములు వస్తాయని, వ్యవసా యంలో వేతన కార్మికులకు పని ఉండదన్న అపోహను తొలగించాలి. ఇది తప్పుడు భావనే కాదు. హానికరమైనది కూడా. వ్యక్తిగత ఆస్తిగా ఉన్న భూమిని జాతీయం చేయటం మహత్తర మైన పురోగామి చర్య. నిస్సందేహంగా కార్మిక వర్గపు ఆర్థికాభివృద్ధి అవసరాలు తీర్చే చర్య. ప్రతి వేతన కార్మికుడు ఈ చర్యను బలపరుస్తాడు. అయితే ఈ చర్య వలన వేతన శ్రమ రద్దు కాదు." అని స్పష్టం చేస్తూ గ్రామీణ ప్రాంతంలో వేతన శ్రమపై ఆధారపడి జీవించే వ్యవసాయ కార్మికులను సమీకరించటం కోసం సంఘం పెట్టాలని ప్రతిపాదిస్తాడు.

విప్లవాన్ని విజయవంతం చేయటం కోసం విశాల ప్రజాతంత్ర శక్తులతో ఐక్యసంఘటన నిర్మాణానికి లెనిన్ ఎంత ప్రాధాన్యత ఇచ్చారో తెలుసుకోవటానికి 1917 నవంబరు 8న విడుదల చేసిన భూమిపై నివేదికను పరిశీలిం చాలి. ఈ నివేదికలోనే ప్రఖ్యాత భూమి డిక్రీని పొందుపర్చారు. ఈ నివేదికలో భూమి డిక్రీ సోషలిస్టు రివల్యూషనరీల కార్యక్రమం నుండి స్వీకరించిందని స్పష్టం చేస్తుంది. గ్రామీణ ప్రాం తంలో విస్తృతమైన పార్టీ యంత్రాంగం కలిగిన సోషలిస్టు రివల్యూషనరీలు స్థానిక సోవియట్లలో ఆధిపత్యం కూడా కలిగి ఉన్నారు. 1916-17 కాలంలో జరిగిన గ్రామీణ ఉద్యమాల్లో ప్రధాన పోరాటాలకు నాయకత్వం వహించింది ఈ పార్టీ. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పార్టీకి ఉన్న ప్రజాదరణ, ఆ ప్రజాదరణతో రూపొందించిన నినాదాలు విప్లవోద్యమంలో అంతర్భాగంగా మార్చటానికి బోల్షివిక్ పార్టీ అంగీకరిస్తుంది. తద్వారా యావత్తు గ్రామీణ ప్రజానీకాన్ని బోల్షి విక్ పార్టీ సారథ్యంలో సాగిన అక్టోబరు విప్ల వంలో ఎటువంటి పొరపొచ్చాలకు అవకాశం లేకుండా భాగస్వాములను చేస్తుంది. ఇక్కడ మారుతున్న పరిస్థితులను అధ్యయనం చేయటమే కాదు. సదరు అధ్యయనం, దాని ప్రాతిపదికన రూపొందించే నినాదాలు విప్లవోద్యమ ఐక్యతను పెంపొందించేదిగా ఉండాలని, విప్లవోద్యమాన్ని మరో మెట్టు పైకి ఎక్కించేదిగా ఉండాలన్న దార్శనికత కూడా లెనిన్ ప్రదర్శిస్తాడు.

విప్లవానంతరం పాలక కార్మికవర్గ పార్టీ నేతగా కూడా లెనిన్ వ్యవసాయక సమస్యపై తన అవగాహనను తాజాపర్చుకుంటూ పోవ టాన్ని కార్మికులు, శ్రమ దోపిడీకి గురవుతున్న రైతాంగం మధ్య పొత్తు అనే లేఖను (సంపుటి 26), వామపక్షం పిల్ల చేష్టలు, పెటీ బూర్జువా మనస్తత్వం (సంపుటి 27) సెంట్రల్ గుబెర్నియా పేద రైతుల కమిటీ ప్రతినిధుల సమావేశంలో ఉపన్యాసం (సంపుటి 28) విప్లవ సాధన అనం తరం మారిన పరిస్థితుల్లో బోల్షివిక్ పార్టీ కార్య క్రమాన్ని తాజాపర్చుకునేందుకు రూపొందించిన ముసాయిదా కార్యక్రమంలో వ్యవసాయక సమస్య అధ్యాయం, బోల్షివిక్ పార్టీ 8వ మహాసభలో గ్రామీణ ప్రాంత కృషిపై నివేదిక (సంపుటి 29), వస్తురూపంలో సుంకం : నూతన ఆర్థిక విధా నం ప్రాధాన్యత (సంపుటి32) వంటి రచనల్లో చూడవచ్చు. స్థూలంగా చెప్పాలంటే రష్యా విప్లవంలో వ్యవసాయక సమస్య ప్రాధాన్యతపై లెనిన్ సాగించిన రచనలను నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయానికి సరైన ఉదాహరణగానే కాదు. విప్లవోద్యమ రాజకీయ లక్ష్యానికి అనుగుణంగా ఒక సమస్యపై ఆచరణాత్మక వైఖరిని ఎలా చేప ట్టాలో సోదాహరణ వివరణ అని చెప్పటానికి సందేహించక్కర్లేదు. ❋

# మోడి విధానాలపై రైతుల తిరుగుబాటు

- వెంకటేష్ రామకృష్ణన్, పూర్ణిమ ఎస్. త్రిపాఠి

నోట్లరద్దు, ప్రభుత్వ అచేతనంతో విసిగి పోయిన మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, ఉత్తరప్రదేశ్ రైతులు ఎదురు తిరిగి, మూడేళ్లు తను పరిపాలనను పూర్తి చేసిన సందర్భంలో నరేంద్ర మోదీ చూపబోయిన అత్యుత్సాహంపై నీళ్ళు చల్లారు.

భారతీయ జనతా పార్టీ, నరేంద్ర మోదీ నాయకత్వంలోని జాతీయ ప్రజాతంత్ర సంఘటన (ఎన్.డి.ఎ) తమ మూడేళ్ళ పరిపాలన ముగిసిన సందర్భంలో ఘనంగా ఉత్సవాలు జరుపుతామని మే నెల మధ్యలో గర్వంగా ప్రక టించాయి. మే 25 నుండి జూన్ 15 వరకు బిజెపి, దాని సంఘటన భాగస్వాములు, ప్రభు త్వం భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న 'మోదీ' అంటూ అట్టహాసంగా కార్యక్రమాలు మొదలు పెట్టాలని నిర్ణయించారు. ఈ ఉత్సవా లు దేశవ్యాప్తంగా 900 నగరాలలో జరపాలనీ, అందులో బెంగుళూరు, కలకత్తా, పూనా లాంటి పెద్ద పెద్ద నగరాలలో మోదీయే స్వయంగా పాల్గొనాలనీ నిర్ణయించారు. ఇందులో భాగం గానే మోదీ స్వయంగా రెండు కోట్ల ఉత్తరాలు, పదికోట్ల ఎస్.ఎమ్.ఎస్. ల ద్వారా సాధారణ ప్రజానీకానికి సందేశాలు పంపాలని, దేశంలోని 400 దినపత్రికలకు మొదటి పేజీ ప్రకటనలు ఇవ్వాలని, అందులో మోదీ దృక్పథం, ప్రభుత్వ విజయాలూ వివరించాలని, రేడియో, టెలివిజన్ లలో 30-60 సెకండ్ల ప్రకటనలను ఆ 22 రోజులూ ఇవ్వాలని, ఎక్కువ రాష్ట్రాలలో 300 బహుళ మాధ్యమ వ్యవస్థలతో కూడిన ప్రదర్శ నలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇవేకాక ప్రతి మంత్రిత్వశాఖ ఓ చిన్న పుస్తకాన్ని 'అప్పుడు, ఇప్పుడు' (యుపిఏ,ఎన్‌డిఏ) అని మోదీ నాయ కత్వంలో దేశం శరవేగంగా ఎలా పరిగెడు తున్న దో చూపాలని ప్రణాళికను రచించారు. రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు మొదలు పెట్టిన కార్యక్రమాలు, ముఖ్యంగా గత మూడేళ్ల చేసిన ప్రత్యేక కృషిని ఈ పుస్తకాలలో ఎత్తి చూపాలనుకున్నారు.

ఈ రకమయిన అధికార దుర్వినియోగంతో ఉత్సవాలు జూన్ ఒకటవ తేదీ వరకు, అంటే ఒకవారం పాటు, కార్యకర్తలకు సంతృప్తి కలిగించే రీతిలోనే కొనసాగాయి. కాని జూన్ ఒకటవ తేదీ మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర రైతులు తమ ఉమ్మడి డిమాండ్లను, ప్రత్యేక డిమాండ్లను పరి ష్కరించాలంటూ ఆందోళనలు మొదలు పెట్టా రు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఆయా రాష్ట్రా ల ప్రభుత్వాలు ఇది వరకే రైతుల రుణమాఫీ, కనీస మద్దత్తుధరపై వాగ్దానాలు చేసి ఉన్నాయి. అవి నెరవేర్చాలన్నది వారి ఉమ్మడి డిమాండు. రైతుల జాతీయ కమిషన్ ఛైర్ పర్సన్ ఎమ్. ఎస్.స్వామినాధన్ 2006లో ఇచ్చిన నివేదిక ఆధారంగా రైతులకు మద్దత్తు ధరను నిర్ణయి స్తామని 2014లో లోక్‌సభకు ఎన్నికలు జరుగు తున్న సందర్భంలో బిజెపి వాగ్దానం చేసింది. రైతులకు పంట ఖర్చుల కంటే 50 శాతం ఎక్కు వ మద్దత్తు ధర నిర్ణయించాలని ఆ నివేదికలో స్వామినాధన్ కమిషన్ సిఫార్సు చేసింది.

ఎన్నికల ముందు వ్యవసాయ రంగానికి చేసిన వాగ్దానాలను గాని, వాటి వైఫల్యాలను గాని ప్రభుత్వం నిర్వహించే ప్రచార కార్యక్రమాలలో ప్రస్తావించ లేదు. అందుకు బదులుగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (ప్రధాన మంత్రి పంటల భీమా పథకం) కింద గత రెండేళ్ళలో మొత్తం పంటలన్నింటికీ బీమా ఎలా కల్పించబడిందో, రుతుపవనాలపైనే ఆధారపడే రైతులకు అనేక రకాల నీటి వసతులు కల్పించే పథకాలు, వాటి కేటాయింపులను గూర్చి వివరించడం జరిగింది. ప్రభుత్వం ప్రచురించిన పుస్తకంలో అద్భుతమైన గ్రామీణ అభివృద్ధికి నాందిగా రైతుల ఆదాయాలు 2022 నాటికి వాస్తవంలో రెట్టింపు చేసేందుకు ప్రభుత్వ పథకాలు, 'ఒకదేశం, ఒక మార్కెట్' లక్ష్యం సాకారం చేసేందుకు ప్రభుత్వం చిన్నాభిన్నమైన మార్కెట్ వ్యవస్థను ఎలా ఏకం చేయనుందో వివరించబడింది. అయితే రైతుల ఆందోళనలు మొదలయిన వారంలోపే మోదీ అట్టహాసంగా ప్రారంభించిన మూడేళ్ళ పాలనోత్సవాలు నీరు గారిపోయాయి. గ్రామీణ ఆర్థికవ్యవస్థను అభి వృద్ధి చేయటం, రైతుల ఆదాయాలను రెట్టింపు చేయడం లాంటి మోదీ ప్రభుత్వ వాగ్దానాలలోని డొల్లతనాన్ని బహిర్గత పరిచాయి. రెండు పెద్ద రాష్ట్రాలలో ఆ సంఘటనాత్మక వారంలో రైతులు తాము పండించిన కూరగాయాలను, పాలను రోడ్డుపై పారబోసారు. తమకు అడ్డు వచ్చిన పోలీసులకు, రక్షక దళాలకు ఎదురు తిరిగి తమ పోరాటాన్ని కొనసాగించారు. ఫలితంగా జూన్ ఆరవ తేదీ మధ్యప్రదేశ్‌లోని మందసార్ సమీ పంలోని పిప్లియాలో ఆరుగురు రైతులు పోలీసు తూటాలకు బలయ్యారు. ఈ వార్త మధ్య ప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలన్నింటా పాకింది. మధ్య ప్రదేశ్ రైతులందరూ సంఘీభావంగా ప్రదర్శన లలో పాల్గొంటూ చనిపోయిన రైతుల కుటుంబా లకు సానుభూతిని తెలిపారు. అదే సమయంలో వారి డిమాండ్లనూ ముందుకు తెచ్చారు.

మహారాష్ట్ర బిజెపి ముఖ్యమంత్రి ఫడ్నవీస్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మొదట్లో దీనిని ప్రతిపక్షాలయిన కాంగ్రెస్, ఎన్‌సిపిల రాజకీయ దుశ్చర్యగా అభివర్ణించారు. మోదీ అధినాయకత్వంలో వ్యవసాయరంగం విజయాలు సాధిస్తున్నదని నొక్కి చెప్పారు. రైతు లు అనవసర యాగీ చేస్తున్నారన్నారు. ఈ దబాయింపు ఎంతవరకూ వెళ్ళిందంటే రైతుల ప్రతినిధులతో సంప్రదింపులకు సిద్ధపడలేదు. ఎంపిక చేసిన రైతు సంఘాలు, నాయకులతో చర్చలు జరపడంతో సరిపెట్టారు.

కాని ఈ ఎత్తుగడలేవీ పనిచేయలేదు. జూన్ ఒకటవ తేదీ పరిణామాలు, మందసార్‌లో రైతు లపై కాల్పులు, దేశవ్యాప్తంగా అవి సృష్టించిన ప్రకంపనలు ముఖ్యమంత్రులను ఆలోచింప జేసాయి. ఫడ్నవీస్, చౌహాన్ ఈ ఒత్తిడికి వేరు వేరుగా స్పందించారు. ఫడ్నవీస్ రెండు హెక్టార్ల కన్నా తక్కువ భూమి ఉన్న రైతుల రుణాలు మాఫీచేస్తానని ప్రకటించగా చౌహాన్ నిరవధిక నిరాహార దీక్షను నాటకీయంగా ప్రారంభించి రైతుల ఆందోళనలు శాంతపడిన తరువాత కనీస మద్దత్తు ధరకన్నా ఎక్కువిచ్చి పంటకొనడం నేరం అవుతుందని ప్రకటించాడు.

ఈ రెండు ప్రకటనలు ఆందోళన చేస్తున్న రైతులకు ప్రభుత్వ ఏజెన్సీలకు మధ్య ఒప్పందాన్ని కుదిర్చి ఉండవచ్చు. రాష్ట్రాలలో కొంత శాంతిని నెలకొల్పి ఉండవచ్చు; కాని వ్యవసాయ రంగం లో, ఆ రెండు రాష్ట్రాలలో గాని, ఇతర రాష్ట్రాల

లో గాని ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు దోహద పడుతుందనే నమ్మకం లేదు. ఇప్పటికే హర్యానా రైతులు రుణమాఫీ డిమాండ్ చేస్తున్నారు. మహారాష్ట్రలో రాజూశెట్టి 'స్వాభిమాని షేత్‌కారి సంఘటన' నాయకుడు ; ఇది రైతు ఆందోళనలో పాల్గొన్న అతి పెద్ద సంఘం. జూలై 25వ తేదీ లోపు ప్రభుత్వం తన వాగ్దానాన్ని నిలుపుకోవాలనీ, అంతవవరకే రైతులు ఎదురు చూస్తారని రాజూశెట్టి హెచ్చరించారు. 'వాగ్దానాన్ని నిలుపుకోకపోతే ఆందోళనను రెట్టింపు స్థాయిలో చేస్తామని' అన్నారు.

మధ్యప్రదేశ్‌లో కూడా రైతు సంఘటనలు రూపాలు మార్చుకుంటున్నాయి ; ఒక నిర్మాణాత్మక ఉద్యమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. హోసంగాబాద్‌లో ప్రైవేటు వ్యక్తుల వద్ద రుణం తీసుకుని చెల్లించలేక పోయిన కారణంగా ఇద్దరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన విషయం వెలుగులోకి వచ్చింది. ఇది రాష్ట్రంలో అశాంతికి దారి తీసింది.

**రాజకీయ దిగజారుడుతనం :**

అనుపమ్ 'స్వరాజ్‌అభియన్' అనే రైతు సంఘం నాయకుడు. నిరంతరం రైతుల సమస్యల పైనే పనిచేస్తుంటారు. ఆయన ఫడ్నవీస్‌గాని, చౌహాన్ గాని, కేంద్ర ప్రభుత్వంగాని రైతుల రక్షణ, మధ్యంతర, దీర్ఘకాల అవసరాలను గుర్తించనందువలననే రైతులు ఆందోళన బాట పట్టవలసి వచ్చిందంటున్నారు. "ఈ నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఇది రైతుల సమస్యలను పరిష్కరించలేదు. ఇప్పుడు ప్రకటించినవీ అదే కోవకి చెందుతాయి." అన్నారు. జూన్ మాసంలో జరిగిన సంఘటనలు ఇదే విషయాన్ని నొక్కి చెప్పాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రైతులు రుణమాఫీ కోరడానికి కారణం నరేంద్రమోదీ. ఆయన స్వయంగా ఉత్తర ప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పుడు, బిజెపిని ఎన్నికలలో గెలిపించితే ఉత్తరప్రదేశ్ రైతుల రుణాలు రద్దు అవుతాయని ప్రకటించాడు. అంతేకాదు రాష్ట్ర రుణమాఫీకయిన ఖర్చును కేంద్రమే భరిస్తుందని ప్రకటించాడు. ఉత్తరప్రదేశ్ కొత్త కేబినెట్ చేసే తొలి సంతకం రైతులరుణాల రద్దేనని బీరండాలు పలికారు. రాష్ట్రంలో బిజెపి గెలిచింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు రైతుల రుణాల రద్దును ప్రకటించక తప్పలేదు. ఇదే ఇతర రాష్ట్రాలలోని ఆందోళనలకు అసలు కారణం. వాస్తవానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తన ప్రకటనను అమలు చేయలేకపోతున్నది. దానితో ఆ ప్రభుత్వం యెడల ప్రజలలో అసంతృప్తి రాజుకుంటున్నది.

"రైతుల కష్టాలను, అందుకు కారణమయిన వాస్తవ పరిస్థితులను తెలుసుకుని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్న విషయం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లోని ఉద్యమాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఈ రెండు రాష్ట్రా లలో పంట నష్టపోయినచోట, పంట బాగా పండని చోట ఉద్యమాలు ప్రారంభం కాలేదు."



రుణాల రద్దుకోసం రైతుల సమ్మె

రైతుల కష్టాలను, అందుకు కారణమయిన వాస్తవ పరిస్థితులను తెలుసుకుని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్న విషయం మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని ఉద్యమాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఈ రెండు రాష్ట్రాలలో పంట నష్టపోయినచోట, పంట బాగా పండని చోట ఉద్యమాలు ప్రారంభం కాలేదు. పంటలు బాగాపండి, సరైన మద్దత్తు ధర లభించని చోట ప్రారంభమయ్యాయి. ఉదాహరణకు మధ్యప్రదేశ్‌లో కందిపప్పు, సోయా, ఉల్లిసాగు పెరిగింది. గత సంవత్సరం ఈ పంటలకు మంచిధర పలకడం వలన ఈ ఏడు ఆ పంటల విస్తీర్ణం పెరిగింది. "గతేడాది ధరలు ఈ ఏడు పప్పు ధాన్యాలు, ఉల్లి పండించేందుకు ప్రోత్సాహన్నిచ్చింది. పంట బాగా పండింది. కాని ధర పూర్తిగా పడిపోయింది. గతేడాది క్వింటాలుకు రూ10,000 పలికిన కందిపప్పు ఈ ఏడు రూ 3,000 మాత్రమే పలికింది. గతేడాది కిలో రూ40-50 ఉన్న ఉల్లి ఈ ఏడాది 4-5 రూ।। మాత్రమే ఉంది" అని మాందసార్ బిజెపి పార్లమెంటు సభ్యులు సుధీర్‌గుప్తా అంటున్నారు. అయితే వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాల పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు అన్న విషయాన్ని ఆయన విస్మరించారు. శివరాజ్‌సింగ్‌చౌహాన్ గత ఐదేళ్లుగా వ్యవసాయ రంగం 20 శాతం వృద్ధిరేటు సాధించుతున్నట్టు ప్రకటించుకున్నారు. వ్యవసాయంలో అద్భుతాలు సాధించినందుకు ప్రభుత్వం ఇచ్చే 'కృషికర్మన్' అవార్డును గత ఐదు సంవత్సరాల నుండి వరుసగా దక్కించుకున్నారు.

ఇంతకు మునుపు దేవాస్ నుండి ఎన్నికయిన కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు సజ్జన్‌సింగ్‌వర్మ "ఇది రైతుల పుండుపై కారం చల్లినట్టయింది. ఒక వైపు రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదని ఆందోళన చెందుతున్నారు; ఉత్పత్తి ధరలు పెరిగాయి; రుణాల రద్దు అమలు జరగలేదు; వేరొక వైపు ప్రభుత్వం వ్యవసాయం అద్భుతంగా అభివృద్ధి చెందినందుకు అవార్డులు పొందుతున్నది. ఇదే మాందసార్ పరిస్థితి ప్రజ్వరిల్లడానికి కారణం అయ్యింది" అంటున్నారు.

బిజెపి ముఖ్యమంత్రి, మిగిలిన పార్టీ నాయకత్వం కూడా నోట్లరద్దు వలన ఏర్పడిన వ్యవసాయ సంక్షోభాన్ని తక్కువ చేసి చూపే ప్రయత్నం చేస్తున్నారు. మాందసౌర్‌లో రైతులు చంపబడిన తరువాత, జూన్ 7వ తేదీన రిజర్వుబ్యాంకు

(మిగతా 35వ పేజీలో)

# ఆర్యుల వలసలకు జన్యుశాస్త్ర పరిష్కారం

టోనీ జోసెఫ్

భారతదేశ చరిత్రలో ఒక గొప్ప వివాదాస్పద విషయానికి కొత్తగా కనుగొన్న కణములోని అనువంశికత రుజువు ఇచ్చి పరిష్కరించింది. అది ఎంత ఖచ్చితమైన సమాధానం ఇచ్చిందో తెలుసుకుంటే మనకు ఆశ్చర్యం వేస్తుంది

భారతదేశ చరిత్రలోనే అతికంటక ప్రాయమైన, అత్యంత వివాదాస్పదమైన ప్రశ్న ముడులు నెమ్మదిగా విడుతున్నాయి. సమాధానాలు దొరకబోతున్నాయి. 2000 బిసి – 1500 బిసి మధ్యలో ఇండో–యురోపియన్ భాషలు మాట్లాడే ఆర్యులు, సింధు నాగరికత అంతమయ్యేనాటికి భారతదేశంలోకి ప్రవేశించి తమతో సంస్కృతాన్ని, ప్రత్యేక సాంస్కృతిక అలవాట్లను తీసుకొని వచ్చారా? అనువంశిక జన్యు కణములలో పరిశోధనలు చేసి కొత్తగా కనుగొన్న రుజువుతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రజ్ఞులందరూ ముక్త కంఠంతో ఇందుకు అవుననే సమాధాన మిస్తున్నారు.

ఇది కొందరికి ఆశ్చర్యాన్ని కలిగిస్తే మరి కొందరిని తీవ్రంగా కుదిపి ఉండవచ్చు. ఎందుకంటే ఈమధ్య కాలంలో అనువంశిక కణముల పరిశోధనలు, ఈ సిద్ధాంతం తప్పని రుజువు చేసినట్టు తీవ్రంగా ప్రచారం జరుగుతున్నది. నిజమైన శాస్త్రీయ పరిశోధనా పత్రాలు చదివే వారందరికీ ఈ వివరణ ఒక కొనసాగింపుగానే ఉంటుంది. అయితే కొత్తగా వెల్లువెత్తిన 'వై' జన్యు కణాల సమాచారం సంకోచాలన్నింటినీ పటాపంచలు చేసింది. (వై జన్యు కణాలు తండ్రి నుండి తనయుడికి సంక్ర మించే కణాలు)

**అనువంశీకరణ/వారసత్వం**

ఇప్పటివరకు ఎమ్‌టిడిఎన్‌ఏ (తల్లి నుండి కుమార్తెలకు మాత్రమే సంక్రమించే అనువంశిక జన్యు కణాలు) మాత్రమే అందుబాటులో ఉండేవి. అందువలన భారతీయుల కణములలో దాదాపు 12,500 సంవత్సరాల నాటినుండి ఇప్పటి వరకు ఎటువంటి బయటి నుండి వచ్చి కలిసిన జన్యు కణాలు ఉన్నట్లు గట్టి ఆధారాలు దొరకలేదు. ఇప్పుడు కొత్తగా కనుగొనబడిన 'వై' జీవ కణం రుజువు ఈ నమ్మకాన్ని పటాపంచలు చేసింది. ఇది 'వై' జన్యుకణాలు తండ్రుల నుంచి తనయులకు సంక్రమించాయని దృఢంగా నిరూపించింది. వెనక్కి తిరిగి చూసుకుంటే, (ఎమ్‌టిడిఎన్‌ఏ, వైడిఎన్‌ఏ) తల్లి నుండి కుమార్తెకు సంక్రమించిన జన్యుకణాలలోకి, తండ్రి నుండి తనయునికి సంక్రమించిన జన్యుకణాలతో ఇంతగా వ్యత్యాసం ఎంచుకుందో అర్థం అవుతుంది.

రాగి యుగంలోని వలసలలో లింగ బేధం తీవ్రంగా ఉండేది. వలస వచ్చిన వారిలో అధికులు పురుషులే. అందువలన మహిళల జన్యు కణాలలో వారసత్వ ఛాయలు కనిపించలేదు. భారతీయ పురుషులలో దాదాపు 17.5 శాతం ఒకే వంశానికి చెందినవారే – ఆర్1ఏ. వీరు మధ్య ఆసియా, యూరప్, దక్షిణ ఆసియాలలో విస్తరించి ఉన్నారు. పాక్ కాస్పియన్ స్టెప్పీ నుండి ఆర్1ఏ తూర్పు పడమరలకు వ్యాపించింది.

ఈ మధ్యనే 'బిఎమ్‌సి జీవశాస్త్ర పరిణామ క్రమం' అనే పత్రికలో కొత్తగా కనుగొన్న భారత దేశ వలసల గురించిన పరిశోధన ప్రచురించబడింది. అందులో ఇంగ్లండ్‌లోని హడ్స్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య. మార్టిన్. పి. రిఛార్డ్స్" రాగి యుగంలో మధ్య ఆసియా నుండి పురుషులే అత్యధికంగా వలసలు వెళ్ళారు. అప్పుడున్న ఇండోయూరప్ సమాజం పూర్తిగా పితృస్వామ్య వ్యవస్థగా ఉండేది. అందువలననే యురేషియా అంతటా 5000 నుండి 3500 సంవత్సరాల క్రితం వరకు వీరి 'వై' జన్యు కణాలు విస్తారంగా కనిపిస్తాయి" అన్నారు.

స్టాన్‌ఫోర్డ్ వైద్య విశ్వవిద్యాలయంలోని పీటర్ అండర్‌హిల్ అనే మరో శాస్త్రజ్ఞుడు ఈ పరిశోధనలో మరో కేంద్రంగా పనిచేశారు. మూడు సంవత్సరాలు 32 మంది శాస్త్రవేత్తలు అయన ఆధ్వర్యంలో ఆర్1ఏ జన్యుకణం విస్తరించిన విధానాన్ని, ఆ అనువంశిక లక్షణ సంపుటిలో జన్యుకణపు స్థలాన్ని కనుగొనడంలో యురేషియాలోని 126 రకాల ప్రజలలోని 16,244 మందిపై పరిశోధనలు చేశారు. డా॥ అండర్‌హిల్ ఆర్1ఏలో రెండు వారసత్వాలుగా విభజించబడి ఒక భాగం యూరప్‌కి పరిమితమైతే రెండవభాగం మధ్య, దక్షిణాసియాలకు విస్తరించింది అని కనుగొన్నారు. యూరప్‌లోని ఇర్1ఏలో 96 శాతం 'జడ్282'గాను, దక్షిణ మధ్య ఆసియాలోని ఆర్1ఏలో 98.4 శాతం 'జడ్ 93'గాను గుర్తించారు. ఈ రెండు గ్రూపులు దాదాపు 5,800 సంవత్సరాల క్రితం విడిపోయాయి. భారతదేశంలో అత్యధికంగా ఉన్న జడ్ 93 గ్రూపు మరిన్ని భాగాలుగా విడిపోయిందని డా॥ అండర్‌హిల్ కనుగొన్నారు. ఈ రకం త్వరత్వరగా పెరిగి విస్తరించి అనేక భాగాలయింది. జడ్93 ప్రముఖంగా భారత దేశమే గాక పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, హిమాలయాలలో విస్తరించింది. ఈ పరిశోధన వలన ఆర్1ఏ జన్యుకణం భారతదేశంలోనే ఆవిర్భవించి ఇతర ప్రాంతాలకు పాకిందన్న ఆపోహ తొలిగి పోయింది.

**జన్యుకణాల నిర్ణయంతో వలసల నిర్థారణ :**

ఇప్పుడిక రాగియుగంలో మధ్య ఆసియా నుండి వలసలు వచ్చి భారతదేశంలో స్థిరపడ్డారని నిర్ధారించాము. కాబట్టి (జడ్93) ఈ వలసలు ఏకాలంలో జరిగి ఉంటాయో తెలుసుకునేందుకు ప్రయత్నించవచ్చు. 2016 ఏప్రిల్ మాసంలో ప్రచురించబడిన ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవులలోని పురుష జనాభా 1244 వై జన్యుకణ వరుసక్రమం యొక్క విస్తృతం అనే పరిశోధనా పత్రంలో వెల్లడించబడింది. ఈ వ్యాసాన్ని డేవిడ్ పోజ్‌నిక్ ప్రచురించారు. ఈ పత్రంలో 4000 నుండి 4500 సంవత్సరాలకు ముందు 293 జీవకణం బాగా వ్యాప్తి చెందినట్టు డా॥ అండర్ హోల్, ఆయన ఆధ్వర్యంలోని 42 మంది శాస్త్రవేత్తలలో ఒకరు కనుగొన్నారు. అదే సింధు నాగరికత విచ్చిన్నమవుతున్న కాలం. (ఇప్పటికీ ఒకదాని వలన ఒకటి సంభవించిందనే దానికి ఆధారాలు ఏమీ లేవు. రెండు సమాంతరంగా కూడా జరిగి ఉండవచ్చు)

ఇప్పుడు బయట పడ్డ ఆధారాలు ఎంత బలమైనవంటే ఇదివరకు రాగియుగంలో వలసల గురించి మాట్లాడని, లేదా తటస్థంగా ఉన్న శాస్త్రవేత్తలందరూ వారి అభిప్రాయాలను మార్చుకున్నారు. అందులో డా॥ అండర్ హోల్ కూడా ఒకరు. 2010లో ఆయన తన పరిశోధనా గ్రంథంలో ఒకదాంట్లో గత ఐదారు సహస్రాబ్దాలలో తూర్పు యూరప్ నుండి భారత దేశంలో సహా ఆసియాకు వలసలు వచ్చిన దాఖలాలు లేవని వ్రాశారు. కానీ అదే వ్యక్తి

'ఆ రోజు ఒక చీకటి గదిలోకి కన్నంలో నుంచి చిన్న టార్చి వేసుకొని చూస్తున్నట్టు ఉంటుంది. మనం అప్పుడు కొన్ని మూలలు మాత్రమే చూడ గలం. అంతా చూడలేం. దృశ్యం అంతా సరిగ్గా కనిపించదు. కానీ ఈ రోజు జన్యుకణ విశ్లేషణ వలన మనకు గదంతా మరింత వెలు తురులో కనిపిస్తున్నది" అని వ్రాశారు.

అండర్ హాల్ ఒక్కరే కారు. డేవిడ్ రైక్ కూడా హార్వర్డ్ వైద్య విద్యాలయంలో జన్యు శాస్త్రంలో ఆచార్యుడు. ఆయన భారత జనాభా చరిత్ర పునర్నిర్మాణం' అనే అత్యుత్తమ అధ్యయ నంలో భారతదేశ జనాభా జన్యు నిర్మాణంపై అధ్యయనం చేస్తూ, ఉత్తర భాతరదేశ పూర్వీకులు (ఎఎన్ఐ) దక్షిణ భారతదేశ పూర్వీకులు (ఎస్ఎన్ ఐ) అనే భాగాలుగా భారతదేశం విడివడి ఉ ందని కనుగొన్నారు. ఇందులో ఉత్తర భారతీ యుల జన్యు నిర్మాణం మధ్య ఉత్తర, మధ్య ఆసియా యూరోపియన్‌ల జన్యువులలో కలుస్తు న్నాయని, కానీ దక్షిణ భారతీయుల జన్యువులు ప్రత్యేకంగా ఉన్నాయని కనుగొన్నారు. అంతేకాదు ఎ.ఎన్.ఐ. వారసత్వం గలవారు అగ్రకులాలలో ఉన్నట్టు, ఇండో యూరోపియన్ భాష మాట్లాడే వారుగానూ గుర్తించారు. ఇందువలన ఇండో యూరోపియన్లు భారతదేశం వచ్చారన్నది నిరూ పించబడడమేగాక, వారు మధ్య ఆసియాలోజన్యు సంబంధం గలవారని కూడా రుజువవుతున్నది.

అయితే ఈ అధ్యయనాలు చేసిన వారు ఒక హెచ్చరిక కూడా చేస్తున్నారు. ఈ జనాభాలో జీవకణ అధ్యయనశాస్త్రంలో 'సూక్ష్మ రూపాల'ను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. అవి చరిత్రను నిర్ధారించడాన్ని మరీ సాధారణీకరించాయి. ఉ దాహరణకు మన సూక్ష్మరూపం అనుకున్నట్టు మన పూర్వీకులు అంతా ఏకశిలా సదృశ్యంగా ఉండి ఉండకపోవచ్చు. వివిధ కాలాలలో రక రకాల గ్రూపులు సంయోగం అయి ఉండవచ్చు" అంటే ఎ.ఎన్.ఐ. రకరకాల వలసల వలన సంభవించి ఉండవచ్చు. అందులో ఇండో–యూరోపియన్ భాష మాట్లాడేవారు ఒక గ్రూపు వారు అయి ఉండవచ్చు.

**వాస్తవాలు కట్టు కథలూ**

ఈ పరిశోధనలు ప్రచార మాధ్యమంలో ఎలా వెలుగుచూశాయి? 'ఆర్యులు, ద్రవిడులన్న భేదం ఓ మిధ్యా – పరిశోధన' అంటూ 2009 సెప్టెంబర్ 25వ తేదీ ఒక వార్తా పత్రిక ప్రము ఖంగా ప్రచురించింది. ఇది కేంద్ర సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బైయాలజీ డైరెక్టర్ లాల్ జీసింగ్ (అతనూ వ్యాస రచయితలలో ఒకరు) ఈ పత్రం చరిత్రను తిరగరాసింది. ఉత్తర,

**"ఇందులో ఉత్తర భారతీ యుల జన్యు నిర్మాణం మధ్య ఉత్తర, మధ్య ఆసియా యూరోపియన్‌ల జన్యువు లలో కలుస్తు న్నాయని, కానీ దక్షిణ భారతీయుల జన్యు వులు ప్రత్యేకంగా ఉన్నాయని కనుగొన్నారు. అంతేకాదు ఎ.ఎన్.ఐ. వారసత్వం గలవారు అగ్రకులాలలో ఉన్నట్టు, ఇండో యూరోపియన్ భాష మాట్లాడే వారుగానూ గుర్తించారు."**



డా।। రజీబ్ ఖాన్



డేవిడ్ రైక్

దక్షిణ భారతాలనే తేడాలే లేవు" అన్నట్టు ప్రచు రించింది. అందులోనే 65,000 సంవత్సరాల క్రితం అండమాన్లలో మొట్టమొదటిసారిగా స్థిర పడ్డారు. అదే సమయంలో దక్షిణ భారత దేశంలోనూ స్థిర నివాసమేర్పరుచు కున్నారు. అందువలన అక్కడి జనాభా పెరిగింది. 40,000 సంవత్సరాల తరువాత ప్రాచీన ఉ త్తర భారతీయులు ఆవిర్భవించారు. వీరి సంఖ్య పెరిగింది. ఒకానొక సమయంలో ఉత్తర భారతీ యులు కలిసారు. ఫలితంగా జనాభాలో మార్పు వచ్చి మరొక రకమైన జనాభా ఆవిర్భవించింది. ఇదే ఇప్పుడున్న జనాభా. కానీ నిజానికి ఆ అధ్యయనంలో 65,000, 40,000 అంకెలతో సహా ఇటువంటి ప్రకటనలు ఏం లేవు.!

ఈ భేదం ప్రపంచం గమనించపోలేదు. డిస్కవరీ పత్రికలో జీవశాస్త్రజ్ఞుడు రజీబ్ ఖాన్ ఉటంకింపులలో డా।। రైక్ చెప్పిన దానికి మిగిలిన వారు చెప్పినట్టు ప్రచార మాధ్యమంలో వస్తున్న దానికి పొంతన లేదు. ఉత్తర భారతీ యులు ఇండో యూరోపియన్లకు దగ్గర వారనే బదులు అవి ఈ వాస్తవాన్ని తిరస్కరిస్తున్నాయి" అన్నారు. "2000 నుండి 4000 సంవత్సరాల మధ్యకాలంలో భారతదేశంలో జనాభా మిశ్ర మం పెద్దఎత్తున జరిగింది. ఇది ప్రపంచంలోనే అతి పురాతన హిందుమత గ్రంథమైన రుగ్వేదకాలంతో సరిపోతున్నది. "క్లుప్తంగా ఒకే కాలంలో ఇండో యూరోపియన్ భాష మాట్లాడే వారు అటు యూరప్, ఇటు మధ్య ఆసియాలో విస్తరించి జనాభా పెరుగుదలకు కారణమయ్యా రని రైక్ అంటున్నారు. 'భారత జనాభాలో పెద్దఎత్తున మిశ్రమం జరిగిన సందర్భం' అని రైక్ అంటున్నారంటే అది 2013లో 'అమెరికన్ జర్నల్ ఆఫ్ హ్యూమన్ జెనెటిక్స్'లో ప్రచురించ బడిన పరిశోధనా వ్యాసాన్ని మన దృష్టికి తెస్తున్నా రన్నమాట. దానికి ప్రియా ముఖర్జీ (హార్వర్డ్ వైద్య విద్యాలయం) రచయిత కాగా, రైక్, లాల్‌జీ సింగ్ సహ రచయితలు. ఇందులో కూడా ఇండో యూరోపియన్ భాష మాట్లాడేవారు భారతదే శానికి వలస వచ్చిన ప్రత్యేక స్థితిని ముందుకు తెచ్చినా ప్రత్యేకంగా ఆ విషయాన్ని ప్రస్తావించ లేదు. ఇందులో ఈ విషయం రుజువు చేయబడ లేదు. కారణం ఆ పరిశోధన పరిధులు వేరు. రకరకాల పరిశోధనల వారు కలిసి తరువాత కాలంలో సజాతి పోరాటలవైపు మరలి ప్రాచీన గ్రంథంలో ఉన్నదాన్ని తమ పరిశోధనతో సరిపోతున్నదని చూపింది. ఆమె ఇంకా 2013 లో తన పరిశోధన ప్రచురించేనాటికి ప్రాచీన పశ్చిమ యూరోపియన్ నమూనాలు లేవు. ఈ నమూనాలు అందుబాటులోకి రావడంతో ఉ త్తర భారతదేశ (ఎ.ఎన్.ఐ.) యొక్క ప్రాచీన మూలాలు దక్షిణాసియాలో లభ్యమయ్యాయి.

ఈ ఆధారాలు పరిశీలిస్తున్నప్పుడు మరో రెండు ముఖ్యమైన విషయాలను గమనించాలి. మొదటిది వివిధ రకాల అధ్యయనాలు భారత చరిత్రకు సంబంధించిన ఒక కాలాన్ని నిర్ధారించ డంతో ఒకే నిర్ణయానికి ఎలా వచ్చాయి? ప్రియా మూర్చే ప్రకారం 2000 బి.సి.లో జనాభాలో పెద్దఎత్తున మిశ్రమం జరిగింది, దాదాపు ఉ పఖండంలో ఏ మూలా ఇందుకు మినహా యింపు కాదు. ఒక్క అండమాన్ నికోబార్

(మిగతా 35వ పేజీలో)

# 'ఛలో నాగపూర్' ఉద్యమం

**అభినయ రమేష్**

ఛలో నాగపూర్ ఉద్యమం వేల సంఖ్యలో మహిళా ఉద్యమకారిణిలను కూడగట్టింది. అది అధమ కులాలు, అణగారిన వర్గాలకు చెందిన మహిళలు అనుభవిస్తున్న దోపిడీ, హింస పట్ల దృష్టిని ఆకర్షించడమే కాదు, ప్రపంచంలో అదే లక్ష్యాల సాధన కొరకు ఉద్యమిస్తున్న మహిళలతో సంబంధాలను ఏ విధంగా ఏర్పరచుకోవాలన్న అంశాలను కూడ చర్చించింది.

మహారాష్ట్రలోని నాగపూర్ నగరానికి అంబేద్కర్‌వాద సామాజిక స్పృహ అంశంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నది. దీక్షాభూమిగా గుర్తింపబడుతున్న, బౌద్ధ సాంప్రదాయం కోసం జరిగిన ఒక ప్రజా చారిత్రక పోరాట ప్రాంతం అది. నాగపూర్ ఊచకోత వలన ఏర్పడిన గాయానికి (ఖైర్లాంజిలోని భోట్ మాంగే కుటుంబానికి చెందిన నలుగురిని అనాగరికంగా, మూకుమ్మడిగా హత్య చేశారు), దానికి వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటానికి కూడ చెప్పుకోదగిన ప్రాంతం. మార్చి 10, 2017న ప్రథమ సంస్కర్త సావిత్రీభాయి పూలే 110వ వర్థంతి రోజున ఒక కవాతును నిర్వహించాలని పూలే-అంబేద్కర్ భావజాలం పట్ల విశ్వాసం ఉన్న మహిళలు నిర్ణయించుకున్నపుడు, నాగపూర్ దీనికి వేదికగా ఎంపిక చేయబడింది. అణగారిన వర్గాలకు చెందిన మహిళలకు వ్యతిరేకంగా పెరుగుతున్న హింసను నిరసిస్తూ వేల మంది మహిళలు కదం తొక్కారు. బ్రాహ్మణవాద, మనువాద, హిందూత్వవాద భావజాలంలో నుండి పుట్టిందే హింస. మహిళల యొక్క అణచివేత, వారిపట్ల వివక్ష, వారిపట్ల ఆధిపత్యం ప్రదర్శించడం సామాజిక క్రమం యొక్క ఆదర్శరూపాలుగా, న్యాయబద్ధమైనవిగా ఆ భావజాలం పరిగణిస్తున్నది.

కదం తొక్కిన మహిళలు, సావిత్రీబాయి, ఫాతిమాషేక్ మహిళలకు చేసిన సేవలను కొనియాడి, వారికి వందనం చేశారు. ప్రజాస్వామిక గొంతులను లింగ అణచివేతతో పాటు, కుల వివక్షకు, వర్గ దోపిడీకి వ్యతిరేకమైన పోరాటానికి 'ఛలో నాగపూర్' ఉద్యమం ఒక సూచికగా ఉన్నది. అంతేకాకుండా మహిళలను ఒక సరుకుగా మార్చడానికి, వారు ఎదుర్కొంటున్న భౌతిక, లైంగిక మరియు అన్ని రూపాల దాడులకు ఇది వ్యతిరేక పోరాటం.

**ఏర్పాట్లు చర్చలు:**

క్షేత్రస్థాయిలో పని, దీని నిర్వహణలో భాగమైన మహిళల మధ్య జరిగిన సుదీర్ఘ చర్చలు లేకుండా ఇంత గొప్ప కార్యక్రమం సాధ్యమై ఉండేది కాదు. ఆరు నెలల పైన ఈ ఆలోచనలు సాగాయి. అనేక సమస్యలపై చర్చలు నడిచాయి: ఉమ్మడి సమస్యలపై ప్రసంగాలు, పోరాట చిహ్నాలు, లింగ వివక్షను ప్రశ్నించే మార్గాలపై ఉపన్యాసాలు, బ్రాహ్మణవాద సంస్కృతిని, రాజకీయాలను వ్యతిరేకించే దృక్పథం, అణచివేత పట్ల మన దృష్టికోణం, మహిళలు ఎదుర్కొంటున్న హింస, వారియొక్క పోరాటాల తీరు. ఇంతేకాక 'వ్యత్యాసాల' భావన, లింగ సమస్యలను ప్రశ్నించే తీరుకు సంబంధించిన వ్యవహారాల తీరు ఉపన్యాసాలలో పాతుకుపోయి ఉన్నాయి. కాబట్టి ఉమ్మడి కార్యాచరణ ఏదైనా నానా విధాలుగా ఉన్న సమస్యలను ప్రతిబింబిస్తాయి.

పూలే, అంబేద్కర్‌ల దృక్పథం కలిగిన మాలో కొంతమంది మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకున్నారు. మేము కులం, లింగ వివక్ష, దోపిడి, అణచివేత, నిస్సహాయత, కుల, వర్గ విభజనలలో మహిళలు ఎదుర్కొంటున్న హింసతో ఉన్న సంబంధాల పట్ల జాగ్రత్త వహించాం. మహిళలకు వ్యతిరేకంగా జరిగే హింస, దోపిడీకి సంబంధించిన అంశాలు లింగ వివక్షకు సంబంధించినవి కావు. అవి కులం, వర్గానికి సంబంధించినవి. కాబట్టి మేము పట్టించుకుంటున్న అంశాలు, మేం పరిష్కారం కావాలంటున్న నానా రూపాలలో ఉన్న సమస్యలు నేడు మహిళలు ఎదుర్కొంటున్నవే.

నేడు మహిళలు ఎదుర్కొంటున్న అణచివేత, హింస లాంటి సమస్యలను పట్టించుకోవలసిన అవసరం ఉన్నది. హింస, దుర్మార్గాలు, నిస్సహాయతల సంస్థాగత రూపాలను, వాటి ప్రమాణాల పట్ల స్పృహ కలిగించే విధంగా పోరాటం చేయాలని మేము నమ్ముతున్నాం. అగౌరవాన్ని సృష్టించే విధానాలను ప్రశ్నించకుండా న్యాయం కొరకు అన్వేషణ జరగదు. అన్యాయాన్ని, అగౌరవాన్ని సృష్టించే హద్దుల కట్టడాలలో కనిపిస్తూ, దానిలోనే మిగిలిపోతే మనం న్యాయం సాధించలేం. స్వేచ్ఛ, విముక్తి కొరకు సమస్యలను ప్రశ్నించాలంటే సామాజిక, భౌతిక, సాంస్కృతిక అధీనతను సవాలు చేయాల్సిన, నాశనం చేయాల్సిన అవసరం ఉన్నది.

**అక్రమ లావాదేవీల, అక్రమ చర్యల క్షతగాత్రులు:**

ఈ అవగాహన, నిమ్న కులాల, నిమ్న వర్గాల, ఆదివాసీ, నిస్సహాయ వర్గాలకు చెందిన మహిళలకు వ్యతిరేకంగా వివిధ రూపాలలో అక్రమ లావాదేవీల ద్వారా జరుగుతున్న దోపిడీ, అనాగరిక హింసను మనకు తెలియజేస్తుంది. మహిళలకు వ్యతిరేకంగా జరిగే దుర్మార్గాలు, హింసతోపాటు వ్యభిచారం లాంటివి సంస్థాగతమైన హింసా రూపాలుగా తలచుకునే విధంగా చేశాయి. ఈ సంస్థాగతమైన హింసా రూపాల హద్దులలో ఉండి మహిళలు స్వేచ్ఛ, విముక్తి లక్ష్యాలను సాధించలేరని మేం నమ్ముతున్నాం. లింగ వివక్ష, కుల, వర్గాలపై ఆధారపడిన హింస ద్వారా ఏర్పడే దోపిడీ పద్ధతిలో పాతుకుపోయిన వ్యభిచారానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని మేం నొక్కి చెప్తాం.

అణగదొక్కబడిన, దోపిడీ చేయబడుతున్న వర్గాల నుండి మహిళలు ఇష్టపూర్తిగా వ్యభిచార కూపంలోకి ప్రవేశించరు. కానీ వారు సామాజిక, ఆర్థిక నిస్సహాయతల కారణాలతో బలవంతంగా దానిలోకి నెట్టబడతారు. మహిళలు, పిల్లలు బలవంతంగా వ్యభిచారం ద్వారా జీవించరాదు. పూలే, అంబేద్కర్‌వాదులమైన మేం హింస, దోపిడీ విధానాలను నిర్ద్వందంగా నిరాకరిస్తున్నాం. మేము అణచివేత విధానాలను సవాల్ చేసినపుడు, దోపిడీ, హింస ద్వారా క్షతగాత్రులైన వారిని వదిలివేయమని కోరబోం. ఆ విధానాలకు వ్యతిరేకంగా అందరిలో స్పృహ కలిగించే విధంగా పనిచేయా లని కోరుతాం. అణగారిన వర్గాలకు చెందిన మహిళలను తమ దోపిడీతో, దుర్మార్గాలతో జీవించమని ఎవరైతే ప్రేరేపిస్తారో వారే హింసను అమలుచేసే ప్రతినిధులు. ఎవరైతే వ్యభిచారాన్ని సమర్థిస్తారో వారు ఏ విధమైన దుర్మార్గాలకు, హింసకు గురికాకుండా జీవిస్తున్నారు. ఈ దోపిడీ, హింస ప్రతినిధుల ద్వారానే దుర్మార్గం, అణచివేత సాధారణ పరిస్థితులుగా మారిపోతున్నాయి.

మరొక ఉదాహరణ తీసుకుంటే, కుటుంబ పోషణ కొరకు నేటికి కొంతమంది బలవంతంగా చేతులతో పాకీ పనిచేస్తూ జీవిస్తున్నారు. పాకీ పనివారు గౌరవంగా బ్రతకాలని డిమాండ్ చేసేవారు నిజానికి హింసకు ప్రతినిధులు. అదే విధంగా మహిళలకు గౌరవం, న్యాయం జరగాలన్న పోరాటం, అణచివేత విధాన తిరస్కరణలో పాతుకుపోవాలి.

**అనువాదం : బోడపట్ల రవీందర్** ❋

# కమ్యూనిస్టు వ్యవస్థలో విలువలే మారిపోతాయి

సందేహాలు సమాధానాలు



- బి.వి.రాఘవులు

**మిగులు విలువ అంటే శ్రమ ద్వారా ఏర్పడే వస్తువు విలువలో కొంత భాగాన్ని పెట్టుబడిదారులు లాభంగా తీసుకోవడంగా మార్క్సిజం చెబుతున్నట్లు నేను అర్థం చేసుకున్నాను. కానీ ప్రస్తుతం జరుగుచున్నది వస్తువు విలువను కృత్రిమంగా పెట్టుబడిదారులు సృష్టిస్తూ, బ్రాండ్ ఇమేజ్ ద్వారా అధిక ధరలు పొందుతూ వినియోగదారులను దోచుకోవడం చూస్తున్నాం. ఆ వస్తువుకు ఆ బ్రాండ్ లేకుంటే ఆ ధర రాదనేది వాస్తవం. ఆ కంపెనీలలో కార్మికులు కూడా సమాజంలోని సగటు జీవుల కంటే మెరుగైన జీవితాన్ని గడుపుతున్నారు. ఇక్కడ దోపిడీకి గురి అయ్యేది వినియోగదారుడని నా అభిప్రాయం. దీనిని జనరిక్ మందులకు అన్వయించినట్లైతే పెట్టుబడి దారుని కంటే మధ్య దళారులు లాభం ఎక్కువగా పొందుచున్నారు?**

**- పి. రమణారెడ్డి, నేరేడుచర్ల**

పెట్టుబడిదారులు కార్మికుల శ్రమనుండి పొందేది అదనపు విలువ. (మిగులు విలువ అన్నపదం సరిపోదు). జీతం రూపంలో కార్మికునికిచ్చే విలువకు కార్మికుడు జీతం కోసం పనిజేసిన సమయంలో ఉత్పత్తి అయ్యే విలువకు మధ్య వుండే వ్యత్యాసాన్నే అదనపు విలువ అంటాం. అంటే కార్మికునికిచ్చే జీతం అతను లేక ఆమె చేసిన కాలంలో కొంత భాగానికే సరిపోతుంది. మిగతా భాగాన్ని చెల్లింపులేని శ్రమగా పెట్టుబడిదారుడు ఉపయోగించుకుంటాడు. ఈ శ్రమభాగం నుండి ఉత్పత్తి విలువను పెట్టుబడిదారుడు ఖర్చు లేకుండా స్వంతం చేసుకుంటాడు.

కార్మికునికిచ్చే విలువ తక్కువగానూ, అతని శ్రమవలన తీసుకునేది ఎక్కువగాను ఉంటుంది. అట్లాకాని యెడల పెట్టుబడిదారుడు కార్మికులను పనిలోనే పెట్టుకోడు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండదు. ఈ అదనపు విలువనే అన్ని రకాల పెట్టుబడిదారులు పంచుకుంటారు. ఉత్పత్తి పెట్టుబడిదారుడు తనకు ఒనగూరిన అదనపు విలువను ద్రవ్యపెట్టుబడిదారునికి వడ్డీ, భూస్వామికి అద్దె, టోకు వ్యాపారికి కమిషన్ రూపంలో వాటా ఇస్తాడు. ఎందుకంటే ఈ పెట్టుబడులు కూడా సరుకుల ఉత్పత్తికి, పంపిణీకి సహాయ పడుతున్నాయి కదా! ఆ పనులన్నీ ఉత్పత్తి పెట్టుబడి దారుడే చేసుకుంటే అదనపు విలువ మొత్తం అతనివద్దే లాభంగా ఉంటుంది. అయితే పెట్టుబడిదారుల మధ్య కూడా పని విభజన ఉంటున్నందున, అదనపు విలువ కూడా అందుకనుగుణంగా విభజించుకుంటారు. వారికి వచ్చే వాటాయే వారిలాభం.

సరుకు (వస్తువు అంటే స్వంతానికి వినియోగించుకునేది, సరుకు అంటేఅమ్ముకొనేది) విలువను కృత్రిమంగా సృష్టించడం సాధ్యం కాదు. సరుకు యొక్క విలువ ఉత్పత్తిలో ఏర్పడుతుంది. ఆ విలువే మార్కెట్టులో (కొనుగోలు అమ్మకాలలో) ధరగా మారుతుంది. సరఫరా, గిరాకీలను బట్టి, సరుకు ఉత్పత్తిలో గుత్తాధిపత్యాన్ని బట్టి సరుకు ధర దాని అసలు విలువ కంటె కొంత ఎక్కువగానో, తక్కువ గానో ఉండవచ్చు. కాని దాని విలువతో నిమిత్తం లేకుండా పెట్టుబడిదారులు కృత్రిమంగా సృష్టిస్తేనో, బ్రాండ్ ఇమేజ్ ద్వారానో, వ్యాపార ప్రకటనల ద్వారానో విలువ నిర్ణయించబడదు. వాటి ద్వారా విలువ నుండి ధర హెచ్చుతగ్గులకులోను జేయవచ్చు. ఈ హెచ్చుతగ్గుల ద్వారా కొంత మంది పెట్టుబడిదారులు అదనపు లాభాన్ని, లేక నష్టాన్ని పొందవచ్చు. కృత్రిమ పద్ధతుల ద్వారా బియ్యం ధరను బంగారం ధరకు దగ్గరగా, బంగారం ధరను బియ్యం ధరకు దగ్గరగా తీసుకురావడం సాధ్యం అవుతుందా! జనరిక్ మందుల ధరలు తక్కువగా ఉండడం, బ్రాండెడ్ మందుల ధరలు ఎక్కువగా ఉండడం పెట్టుబడి దారుని నష్టాన్ని సూచించదు. పంపిణీ పెట్టుబడి దారులు లేకుండా, ఆ పని చేసినందుకు లాభంలో భాగం అడగకుండా సేవజేసే వ్యక్తులు, సంస్థల పాత్రను సూచిస్తుంది. దళారులని మనం ఎవరిని అంటున్నామో, వాళ్లు పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగం. పెట్టుబడిదారీ వ్యవస్థ పోకుండా వ్యాపార పెట్టుబడిదారులు(దళారీలు) పోరు. వినియోగదారుల దోపిడీ వలన లాభాలు వస్తాయనేది పెట్టుబడిదారీ దోపిడీని మరుగు పర్చేందుకు జరిగే ప్రచారాలలో ముఖ్యమైనది. ఇటువంటి అభిప్రాయంమార్క్స్ కాలం నాడు కూడా విస్తృతంగా ఉండేది. పెట్టు బడి గ్రంథంలో మార్క్స్ ఈ వాదనలను చిత్తు జేస్తూ వివరించారు.

వినియోగదారుని దోపిడి అంటే వ్యాపారంలో దోపిడి. వ్యాపారంలో దోపిడి అంటే తక్కువకు కొనడం, ఎక్కువకు అమ్మడం ద్వారా లాభం పొందడం. ప్రతిమనిషి ఒకసారి అమ్మకం దారుడుగా, ఇంకొసారి కొనుగోలుదారుడుగా ఉంటాడు. అమ్మినపుడు పొందింది కొన్నప్పుడు పోగొట్టుకుంటాడు. కొందరు ఎప్పుడూ అమ్మకం దార్లుగా, కొందరు ఎప్పుడూ కొనుగోలుదార్లగా ఉండడం సాధ్యంకాదు. కొనుగోలు అమ్మకాలలో మోసం ద్వారా లాభనష్టాలు పొందినా ఒకరు కోల్పోయింది ఇంకొకరికి చేరడం తప్ప నిరకంగా అదనంగా పొందేది ఏమీ ఉండదు. కానీ సమాజంలో, అదనపు విలువ గాని, అదనపు సంపదగాని, లాభం గాని (ఏ పేరుతో పిల్చినా) కొత్తగా చేరేది తప్ప ఉన్నది అటు ఇటు మారడం కాదు. ఈ అదనపు విలువ (లాభం) ఉత్పత్తిలో జనిస్తుంది. శ్రమలోంచి ఉద్భవిస్తుంది. ఈ శ్రమ జీతం కోసం పనిచేసే కార్మికుడిది కావచ్చు. స్వంత వనరులతో కాయకష్టం చేసే రైతుది కావచ్చు. ఉత్పత్తిలో వచ్చిన అదనపు విలువే పంపిణి ద్వారా పెట్టుబడిదారులకు, వారిపై ఆధారపడే ఇతరులకు పంపిణి అవుతుంది. అందువలన ఉత్పత్తితో సంబంధం లేని వినియోగంలో అదనపు విలువ సృష్టి జరుగదు. విని యోగదారుల దోపిడి జరిగిం దంటే వారు శ్రామిక ఉత్పత్తిదారులుగా ఉన్న పుడు జరిగిందన్న మాట! వినియోగ దారులుగా మోసపోవచ్చు. అందువలన వినియోగదారులకు అన్యాయం జరుగుతుండ వచ్చు. కానీ లాభానికి మూలం వినియోగదారులు అనుకోవడం డబ్బు సృష్టించే మాయజాలం మాత్రమే.

కంపెనీలలో కార్మికులు సమాజంలోని సగటు జీవులకంటె మెరుగైన జీవితం గడపడం దోపిడి జరగకపోవడానికి నిదర్శనంగా భావించడం పొరపాటు. కార్మికులకు ఎక్కువ జీతాలు ఇస్తున్నంత మాత్రాన దోపిడీ లేదనుకోగూడదు. ఎక్కువ జీతం ఇచ్చినా పెట్టుబడిదారుడు అదనపు విలువను పొందుతున్నాడని అర్థం. అదనపు విలువ మిగలనంతగా జీతం ఇస్తే, పెట్టుబడిదారీ వ్యవస్తే ఉండదు. అటువంటి పరిస్థితి వస్తే పెట్టుబడిదారుడు కార్మికులను జీతానికి పెట్టుకోడు. అదనపు విలువ ఉత్పత్తిని పేదరి కంతో కొలవడం సాధ్యం కాదు. శ్రమయొక్క ఉత్పాదకత

ఎక్కువగా వున్నప్పుడు అవసరమైతే ఎక్కువ జీతం ఇచ్చి ఎక్కువగా దోపిడి జేసుకో వడానికి పెట్టుబడిదారుడు వెనకాడడు. మీరు లేవనెత్తిన ప్రశ్నలకు క్లుప్తమైన సమాధానంతో న్యాయం జరుగదు. పెట్టుబడి గ్రంథం ముద్రణ జరిగి 150 సంవత్సరాలు అయిన సందర్భంలో ఆ గ్రంథం పట్ల తిరిగి ఆసక్తి పెరుగుతున్నది. మీ ప్రశ్నకు సంపూర్ణ సమాధానం ఆ గ్రంథ అధ్యయనం ద్వారా లభిస్తుంది.

**శక్తి కొద్దీ పని, అవసరం కొద్ది ఫలం. కాని రాజ్యం అంతరించి పోవడం సాధ్యమా! సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులతో ఎప్పటి కప్పుడు నూతన సాంకేతికతతో కొత్త వస్తువులు వస్తున్నప్పుడు అవసరం కొద్ది వస్తువుల లభ్యత ఎలా సాధ్యమౌతుంది?**

శక్తికొద్ది పని, అవసరం కొద్ది అనుభవం అన్నది కమ్యూనిస్టు వ్యవస్థ యొక్క స్వరూపం. ప్రస్తుత వ్యవస్థలోని విలువల దృష్టితో చూసిన పుడు అది సాధ్యమా అన్న అనుమా నం కలుగు తుంది. గతంలో రాజరిక, బానిస సమాజాలలో నివసించిన ప్రజలకు కూడా ఆ వ్యవస్థలు మారవు, అవి శాశ్వతంగా ఉంటాయని అనిపిం చింది. ఆ నాటి రచనలను, సిద్ధాంతాలను పరిశీ లిస్తే ఈ విషయం అర్థం అవుతుంది. అయినా వ్యక్తుల అభిలాషతో నిమిత్తం లేకుండా సమాజం ఒక ప్రవాహంలా మారుతూనే ఉన్నది. పాత వ్యవస్థల స్థానంలో కొత్త వ్యవస్థలు వస్తున్నాయి. ప్రస్తుతం వ్యక్తిగత ఆస్తిపై ఆధార పడ్డ కొంతమంది శ్రమ చేయకుండా బ్రతకడం, కొంతమందికి శ్రమే బతుకు గావడంతో ఉన్న సమాజం మారుతుందా అన్న సంశయం చాలా మందికి కలుగుతుంది. వేల సంవత్సరాల మానవ చరిత్రను పరిశీలించే వారికి ఈ అను మానం రాదు. మార్క్స్ ఈ చరిత్రనే పరిశీలించి పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్గత వైరుధ్యాలే దాన్ని విచ్ఛిన్నం జేసి, కొత్త వ్యవస్థకు మార్గం చూపుతాయని చెప్పారు. ఇది ఒక తరంలో జరగపోవచ్చు. ఎవరైనా తన జీవితంలో జరగ నంత మాత్రాన సుదీర్ఘ మానవ ప్రస్థానంలో జరగదనుకోరాదు.

శక్తికొద్ది పని, పనికొద్ది ప్రతిఫలం సోషలి జంలో ఉంటుందని, శక్తికొద్ది పని, అవసరం కొద్ది అనుభవం కమ్యూనిజంలో ఉంటుందని మార్క్స్ చెప్పారు. శక్తి కొద్ది పని అంటే భౌతికంగా శ్రమ చెయ్యగల్గిన వారందరూ చెయ్యాలి. మానవ మనుగడకు ప్రకృతి తల్లి అయితే శ్రమ తండ్రి అన్న విలియం పెట్టి మాటలను మార్క్స్ పెట్టుబడి గ్రంథంలో ఉ టంకించాడు శ్రమ లేకుండా మానవ మనుగడ సాధ్యం కాదు. పెట్టుబడిదారుడు, భూస్వామి లేకుండా సమాజం బ్రతకగలదు. శ్రామికుడు లేకుండా సమాజం మన లేదు. అందువల్లనే సోషలిజంలో శ్రమ జెయ్యడానికి అంత ప్రాధా న్యత ఉంది. ఆస్తిమీద హక్కు పేరుతో శ్రమ జెయ్యడకుండా ఇతరుల శ్రమపై ఆధారపడి బతకడం కమ్యూనిజంలో ఉండదు. దీనికి బలవంతం అవసరం లేదు. సామాజిక విలువ ల్లోనే మార్పు వస్తుంది. అందు వలన ఒత్తిడి చెయ్యడానికి రాజ్యం అవసరం ఉండదు. ఉత్పత్తి అయిన సంపదను పునరుత్పత్తికి అవసర మైన పెట్టుబడి బాగాన్ని వేరుగా పెట్టి, మిగిలిన భాగాన్ని శ్రమస్థాయిని బట్టి ప్రారంభదశలో సమాజ సభ్యుల మధ్య పంపిణీ అవుతుంది. ఉత్పత్తి ఉన్నతస్థాయికి చేరినపుడు వ్యక్తుల అవసరాలను బట్టి పంపిణీ చేయబడు తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలోని పంపిణీ వ్యవస్థ దృష్టితో చూస్తే అవసరాన్ని బట్టి పంపిణీ సాధ్య మవుతుందా అన్న అనుమానం కలుగుతుంది. కాని కమ్యూనిస్టు వ్యవస్థలో విలువలే మారిపోతాయి. ఊరక కూర్చుని తినే వారుండరు. (భౌతికంగా పనిజేయలేనివారు తప్ప. సమాజమే వీరి బాధ్యత తీసుకుంటుంది) అందువలన ఉత్పత్తి పెరుగుతుంది. ఒళ్ళు దాచుకునే వారు ఉండరు. అందువలన కూడా ఉత్పత్తి పెరుగు తుంది. పర్యావరణం, ప్రకృతి పట్ల బాధ్యత పెరుగు తుంది. అవి భరించగల, మోయ గల మేరకే ఉత్పత్తి అవసరాలను సమాజం నిర్ణయించు కుంటుంది. లాభదృష్టితో, టర్నోవర్ దృష్టితో పెట్టుబడిదారీ వ్యవస్థ హానికరమైన అవసరాలను, అనవసరమైన అలవాట్లను నేర్పుతుంది. అటువంటివి సోషలి జంలో అంతరిస్తాయి. ప్రకృతికి, మానవునికి తోడ్పడే పద్దతిలో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించ బడుతుంది. లాభదృష్టి కాకుండా మానవ ప్రయోజనం విజ్ఞా నాన్ని,సాంకేతిక పద్ధతుల అభివృద్ధిని శాసిస్తుం ది. అందులన అవసరం లేని కొత్త వస్తువులు తయారు కావు.

**సోషలిస్టు సమాజంలో ఉత్పత్తికి వేతనానికి – సంబంధం లేకుండా స్వచ్ఛందంగా సమాజం కోసం పని చేసేటట్లు చూడాలని రంగనాయకమ్మ గారి పుస్తకంలో చూడటం జరిగింది. అది సాధ్యమౌతుందా?**

పెట్టుబడిదారీ సమాజంలో మాత్రమే సరుకు, డబ్బు, పెట్టుబడి, జీతం వంటి పద్ధతు లు, భావాలు సర్వవ్యాపితం అయ్యాయి. కమ్యూ నిజంలో ఇవి ఉండవు. ఉత్పత్తి పంపిణీ, వినిమ యం అన్నీ ప్రజల అవసరాలను బట్టి, ప్రజలే ప్రణాళికాబద్ధంగా నిర్వహించుంటారు. అందుకే వేతనం కోసం పని పద్ధతి సోషలిజం, కమ్యూని జంలో ఉండదు అని రంగనాయకమ్మ గారు రాశారు. మార్క్స్ పెట్టుబడి గ్రంథం చదివితే జీతం అనేది పెట్టుబడిదారీ విధాన లక్షణం అని, అది శ్రమదోపిడీ కన్పించకుండా మరుగు పర్చే ఒక పద్ధతని సోషలిస్టు వ్యవస్థలో వేతన బానిసత్వం అంతరిస్తుందని అర్థమవుతుంది.

**పీపుల్స్ డెమొక్రసీలో తులసీదాస్‌గారి ప్రశ్నకు ప్రకాశ్ కరత్ ఇచ్చిన సమాధానం...**

**ప్రశ్న : ప్రభాత్ పట్నాయక్ పీపుల్స్ డెమొక్రసీ జూన్ 25వ తేదీ సంచికలో " మౌలిక సమస్య అయిన ద్రవ్యపెట్టుబడి యొక్క ఆధిపత్యాన్ని ఎదుర్కోలేక పోయాయి కాబట్టి ట్రంప్ విధా నాలు, అతి మిత వాదుల విధానాలు విఫలమ య్యాయని చెప్పాడు. ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం కొనసాగుతున్న కారణంగా ప్రపంచీకరణతో విడగొట్టుకోవాల్సిన అవసరంపై వామపక్షాలు ఎక్కువ స్పష్టతతో ఉన్నందున, ఉదారవాద బూర్జువా వర్గ వైఖరిలోని దివాళా కోరుతనం కార్మికవర్గ ప్రజానీకాన్ని అంతకంతకూ ఎక్కువగా వామపక్షాలను బలపరిచేలా చేస్తుంది. కార్బిన్, శాండర్స్, మెలం కోన్ లాంటివారు ముందుకు రావటంతో ఇది ఇంతకు ముందే జరుగుతున్నది. ప్రపంచీకరణపై వామపక్షాలు తమ సందిగ్ధ వైఖరిని విడనాడితే ఈ క్రమం మరింతవేగం పుంజుకుంటుంది". అని రాశారు. ఈరోజున్న పరిస్థితులలో ప్రపంచీకరణ నుండి విడగొట్టు కోవటం సాధ్య మౌతుందా? ప్రపంచీకరణపై సందిగ్ధ వైఖరిని విడనాడటం అంటే ఏమిటి? ప్రపంచీకరణకు వ్యతిరేకంగా పోరాడటం, దానికి ప్రతిఘటనను నిర్మించటం ప్రపంచీకరణ నుండి విడగొట్టుకో వటం కన్నా భిన్నమైనదని నేను భావిస్తున్నాను.**

ప్రపంచీకరణ నుండి
విడగొట్టుకోవడం అంటే ...!

ప్రపంచీకరణ నుండి విడగొట్టుకోవడం అనే అంశాన్ని అర్థం చేసుకోవాలంటే నూతన సరళీ కరణ ఆర్థిక విధానాల్లోని ఏదో ఒక అంశాన్ని, దాని ప్రభావాలను పరిశీలించాలి. ఉదాహర ణకు విద్య ప్రైవేటీకరణను పరిశీలిద్దాం. దీనిని వ్యతిరేకించడమంటే, పెద్ద మొత్తంలో ప్రభుత్వ నిధులను విద్యపై ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తున్నామని అర్థం. ఇలా చేయాలంటే పన్ను లను భారీగా పెంచి ఆదాయాన్ని రాబట్టు కోవా లి, లేదా పెద్ద మొత్తంలో ద్రవ్యలోటు భరించ డానికి ప్రభుత్వం సిద్ధం కావాలి. ఇదీ కాదను కుంటే, ఇతర రంగాలకు ఖర్చు చేసే మొత్తాన్ని విద్యారంగానికి తరలించాలి. ఏ పేరుతోనైనా పేదలపై భారం మోపడం సాధ్యం కాదు. దానిని వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తాయి. ధన వంతుల నుండి వనరులను సమీకరించుకో వడానికో, దవ్యలోటును భరించడానికో ప్రభుత్వా

లు సిద్ధం కావాలి. అయితే, ధనవంతులపైకొత్త పన్నులు వేయడం, లేదా ద్రవ్యలోటును పెంచ డం వంటి చర్యలు వెంటనే అంతర్జాతీయ సమా జాన్ని ఆకర్షిస్తాయి. అంతర్జాతీయ ద్రవ్య సంస్థల్లో భయాందోళనలను సృష్టిస్తాయి. క్రెడిట్ రేటింగ్ సంస్థలు దేశ ర్యాంకును తగ్గించివేస్తాయి. ఇది నిల్వలపై ప్రభావం చూపి చెల్లింపుల సమస్యను తీసుకువస్తుంది. రూపాయి విలువ గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉందన్న ఊహాగానాలు చెలరేగుతాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ కారణాలు ద్రవ్య పెట్టుబడిపై ప్రభావం చూపు తాయి. దేశం నుండి ద్రవ్య పెట్టుబడి బయటకు తరలే అవకాశం ఉంది. ఇది సమస్యను మరిం త తీవ్రం చేస్తుంది. ఇటువంటి పరిణామాలు మరికొన్ని జరుగుతాయి. కాబట్టి పెట్టుబడి ప్రవాహంపై ఆంక్షలు పెట్టడానికి సిద్ధపడినప్పుడే పురోగామి భావజాల అజెండాను అమలు చేయడం సాధ్యమవుతుంది. ముఖ్యంగా ద్రవ్య పెట్టుబడిపై ఆంక్షలకు సిద్దపడాల్సిఉంటుంది. చెల్లింపుల సమస్యను ఎదుర్కునేందుకు కొన్ని రకాల వ్యాపారాలపై కూడా ఆంక్షలువిధించాల్సి ఉంటుంది. ఆ రకమైన ఆంక్షలు విధించడమే ప్రపంచీకరణ నుండి విడగొట్టుకోవడం అవు తుంది. ప్రగతిశీల అజెండాను అమలు చేయా లంటే ఏ దేశమైనా ఇలా ప్రపంచీకరణ నుండి విడగొట్టుకోవాల్సిఉంటుంది. స్థానిక పరిస్థితు లను బట్టి ఇది ఏ స్థాయిలో అమలు చేయాన్నది ఆధారపడుతుంది.

ప్రపంచీకరణ నుండి విడగొట్టుకోకుండా, ప్రగతిశీల అంశాల గురించి ఏ దేశమైనా చెబితే, అది కేవలం మాటలకే పరిమితమవు తుంది. గ్రీసులో చోటుచేసుకున్న పరిణామాలను పరిశీ లించండి. ప్రపంచీకరణ పై పోరాటం వంటి నినాదాలతో అక్కడ సిరిజా అధికారంలోకి వచ్చింది. ద్రవ్య పెట్టుబడిపై పోరాటం చేస్తా మంటూ అధికారంలోకి వచ్చిన ఆ కూటమి ఆచరణలో ప్రపంచీకరణ నుండి విడగొట్టుకో వడానికి సిద్దపడలేదు (గ్రీస్ పరిభాషలో యూరోజోన్ నుండి బయటకు రావడం) ఇది ప్రజలకిచ్చిన హామీ నుండి వెనక్కి రావడమే. ఒక రకంగా మోసం చేయడమే! గ్రీసు లాంటి చిన్న దేశాల్లో సిరిజా కూటమి వంటివి ఇంత పెద్ద నిర్ణయాలను అమలు చేయగలవా అన్నది చర్చనీయాంశం. (ద్రవ్య పెట్టుబడి పెత్తనం నుండి బయటకు రావడానికి చిన్న దేశాలు సంఘటితం కావాల్సిఉంటుంది) కానీ, ప్రధానమైన అంశమే మిటంటే ప్రపంచీకరణపై పోరాటం చేయడాన్నే మానుకుంది. ప్రపంచీకరణపై పోరాటాన్ని దాని నుండి విడగొట్టుకోవాలన్న లక్ష్యంతో చేయాల్సిఉ ంటుంది. భారత్ వంటి పెద్ద దేశాల్లో ప్రపంచీ కరణ కారణంగా పేద ప్రజలపై పడుతున్న పెనుభారాలను తిప్పికొట్టడానికి అటువంటి చర్య తప్పనిసరి అవసరం. దీనిని మరో విధంగా చూద్దాం! ప్రపంచీ కరణ భారాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కార్మికులను, రైతులను సంఘటిత పరిచి పోరాటం చేయడం ఒక పద్ధతి. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలను సమన్వయ పరిచి ద్రవ్య పెట్టుబడిపై ఒత్తిడి చేయడం రెండవది. అంతర్జాతీయంగా సమన్వయంతో సాగే కార్మిక పోరాటాలు లేని ప్రస్తుత పరిస్థితుల్లో రెండవది సాధ్యం కాదు. కాబట్టి జాతీయ స్థాయి పోరా టాలు చేయడం మాత్రమే ప్రస్తుతం ముందున్న మార్గం. ఈ పోరాటం అర్ధవంతంగా సాగా లంటే ప్రపంచీకరణ నుండి విడగొట్టు కోవడానికి సంసిద్ధత అవసరం.

అనేక వామపక్ష పార్టీలు ఈ అంశాన్ని ఇలా అర్థం చేసుకోవడం లేదు. ప్రపంచీకరణ నుండి విడగొట్టుకోవడంపై వామపక్ష పార్టీల్లోని భిన్నాభి ప్రాయాలే దీనికి కారణం. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పెద్ద ఎత్తున సంఘటి మవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ అనిశ్చితిని వదిలించుకోవడంపైనే వామపక్షాల రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంది. ప్రపంచీకరణ నుండి విడగొట్టుకోవడానికి సంబంధించి స్పష్టమైన అజెండాను పోరాడుతున్న కార్మికలోకం ముందు వామపక్షాలు ఉంచగలగాలి. అనుభవిస్తున్న కష్టా లకు ముస్లింలు, చైనీయులే కారణం తప్ప ప్రపంచీ కరణ కాదంటూ ప్రజలను చీలుస్తున్న పాసిస్టు శక్తుల బండారాన్ని బట్టబయలు చేయాలి.

❊

---

# మోడి విధానాలపై రైతుల తిరుగుబాటు

(26వ పేజీ తరువాయి)

తన ద్వైమాసిక నివేదికను ప్రచురించింది. నోట్ల రద్దు వ్యవసాయ రంగాన్ని తీవ్ర విస్మయానికి గురిచేసిందని ద్రవ్యవిధాన ప్రకటనలో పేర్కొంది. "ఆయా కాలాల్లో వచ్చే ఉత్పత్తుల కన్నా ఈ సంవత్సరం ఎక్కువ మార్కెటుకు చేరుకున్నాయి. కూరగాయల ధరలు, ముఖ్యంగా 2016 జూలై తరువాత పతనమయ్యాయి. రుతుపవనాలకు ముందు సహజంగా పెరిగే ధరలు పెరగలేదు. ఇంధన విషయానికి వసే గ్యాస్, కిరోసిన్ ధరలు అంతర్జాతీయ ధరల కనుగుణంగా పెరిగాయి. అదే సమయంలో క్రమబద్ధంగా వాటిపై ఇచ్చే సబ్సిడీలు తగ్గాయి. మూడు నెలలపాటు వరుసగా గ్రామీణులు వాడే ఇంధన ధరలు పెరిగాయి. గ్రామీణ, పట్టణ ఇంధన వినియోగదారుల మధ్య నున్న అంతరం తగ్గుతూ వచ్చింది. ఫిబ్రవరి, మార్చి మాసాలలో పెరుగుతూ వస్తున్న ధరలు అర్థాంతరంగా ఏప్రిల్ నెలలో బాగా పడి పోయాయి. ఇది ధరల ముందస్తు సూచికనే ప్రశ్నార్థకం చేసింది. ఏప్రిల్ నెలలో తగ్గిన ధరలు స్థిరంగా ఉంటాయా అన్నది మొదటి ప్రశ్న. రెండ వది, పప్పులు విపరీతంగా పండగా దిగుమ తులు పెరగటంతో వాటి ధరలు పతనమ య్యాయి. దిగుమతులపై ఆంక్షలు విధించే విధానపరమైన నిర్ణయాల ద్వారా ధరలు పడి పోకుండా ఆపగలమా అని ఆలోచించాలి. పండిన పంట మార్కెట్‌లోకి రావటం, అప్పుడే దిగుమతయిన పంటలు విపరీతంగా మార్కెట్ లోకి రావడం వలన వచ్చిన కాడికి పంటను అమ్ముకోవలసిన స్థితి ఏర్పడటం నోట్లరద్దు సమయంలో ధరలు పడిపోవడానికి కారణాలుగా రిజర్వుబ్యాంకు సరిగ్గానే గుర్తించింది.

వ్యవసాయ రంగంలోని సమస్యలను సమగ్రంగా పరిష్కరించే దిశగా ఆలోచన చేయక పోవడం, లేదా చేయలేక పోవడం ఈ పరిస్థితికి దారి తీసిందని భారతీయ క్రిషక్ సమాజ్ అధ్యక్షు లు డా॥క్రిషన్‌బీర్ చౌదరి 'ఫ్రంట్‌లైన్'తో అన్నారు. రుణమాఫీ తాత్కాలికంగా రాష్ట్రాలలోని రైతుల కు కొంత ఊరట నివ్వవచ్చు. కాని వ్యవసాయ రంగంలో దీర్ఘకాల స్థిరత్వం సాధించేందుకు విధాన పరమయిన మార్పులు తీసుకు రావడం లో చొరవ చూపించవలసిఉంటుంది. అందు లో అతి ముఖ్యమయినది కార్పొరేట్ల దోపిడీ నుండి వ్యవసాయరంగాన్ని కాపాడేందుకు అన్ని రకాలుగా జోక్యం చేసుకోవాలి. ప్రోత్సహకాలు ఇవ్వాలి. ఈ దోపిడీ గత రెండున్నర దశాబ్దా లుగా కొనసాగుతూనే ఉన్నది. ప్రభుత్వాలు మారుతున్నాయి. పాలించే రాజకీయ పార్టీలు కూడా మారుతున్నాయి. కాని ప్రతిసారి ఈ దోపిడీ విధానాల దుస్థితిని అర్థం చేసుకున్నాం అంటూనే విధాన పరమయిన నిర్ణయాలు తీసుకో వలసిన సమయం వచ్చేటప్పటికి వినాశనానికి దారితీసే విధానాలనే అనుసరిస్తున్నారు. ఏ ప్రభు త్వమయినా రాజకీయ లక్ష్యంతో వీరి సమస్యలను పరిష్కరించి, రైతులను, తద్వారా దేశాన్ని కాపా డుతుందా అన్నదే ఇప్పుడు అతి పెద్ద ప్రశ్న... అని కిషన్‌బీర్ చౌదరి గారు అంటు న్నారు. ఈనాటి పరిస్థితులను చూస్తే అటువంటి మౌలిక విధాన సవరణలు చేసే పరిస్థితి ఉన్నట్టు అగుపించడం లేదన్నది ఆయన అభిప్రాయం. **అనువాదం: కె. ఉషారాణి**

# ప్రగతివాద ప్రతిధ్వని, కళా సాహిత్య ఖని

(2వ పేజీ తరువాయి)

వరిస్తూనే వచ్చారు. వాటిలో ప్రధానంగా మధ్య తరగతి మనుషుల సమస్యలు, సంఘర్షణ లు, దేశంలో రాజకీయ విలువల క్షీణత, దోపిడీ దౌర్జన్యాల ఖండన చేస్తూ వచ్చారు. మరోవైపు అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్య మండలి కార్యవర్గాలలో కొనసాగారు. మధ్య తరగతి మందహాసం, మంటలూ మానవుడు, మట్టి మనిషి ఆకాశం, అక్షరాల గవాక్షాలు ఇలా ఏటేటా కొత్త పుస్తకాలు వస్తూనే ఉండేవి. తర్వాతి కాలంలో తన 82వ జన్మదినం వరకూ కూడా సినారె పుట్టిన రోజున పుస్తకం విడుదల ఒక ఆనవాయితీగా చేసుకున్నారు. ఇంత విస్తారంగా కవిత్వం రాసిన, పుస్తకాలు వేసిన కవి మరొకరు కనిపించరు. ఇదే సమయంలో ఆయన ఉర్రూతలూపే ఉపన్యాసకుడు కూడా. రోజూ సభల్లో పాల్గొనే వారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆయన తెలుగు పాఠం వినడానికి ఇతర విభాగాల విద్యార్థులు కూడా వచ్చి కూచునే వారంటే ఎంత మధుర బోధకుడో అర్థం అవుతుంది.

సినారే కఠిన పదాలు ఏమాత్రంలేకుండా మామూలు మాటల్లోనే జీవిత సత్యాలు చెబుతాడు. మనను మనం చూసుకునేట్టు చేస్తాడు. స్తబ్దతకు అవకాశం లేని సజీవత కావాలంటాడు.

'గోళ్లు గిల్లుతూ కూచోడం మానేసి/ కాలం కష్టంగా ప్రవహించడం నేర్చుకో/ నేలమీద పరుచుకోవడం ఆపేసి/ నిటారుగా పెరగడం నేర్చుకో

కాళ్లు చతికిల బడ్డ నీళ్లలో / కమలాలే కాదు, క్రిములూ పుడతాయి/

చీకట్లను శపించడం కట్టిపెట్టి/చిరుదివ్వె వెలిగించడం మంచిది/ లోకాన్ని వెక్కిరించడం చాలించి/లోచూపు ఆవిష్కరించడం మంచిది (మధ్యమ పురుషం)

నిట్టూర్పుల వంతెన మీదుగా/ నిజాయితీని చేరుకుంటాను/

నిరాశల వూడల్ని పట్టుకుని/ నింగి అంచుల్ని అందుకుంటాను/

విల్లులా వంగిన వెన్నుపూసతోనే/ విజయ దశమి జరుపుకుంటాను/

కొడిగట్టిన ఆశయాలతోనే/ కోటిదివ్వెలు వెలిగించుకుంటాను(మధ్య తరగతి మందహాసం)

మానవుల చిరంతన ఘర్షణకు సంకేత మైంది విశ్వంభర. శృంగార ప్రధానంగా గాక సామాజిక, మానవీయ కోణాలతో రూపొందిన తెలుగు గజల్స్ అచ్చంగా ఆయన సృష్టి. వాగ్గేయ సంప్రదాయంలో వినూత్న ప్రయత్నం అది. అలాగే ప్రపంచ పదులు. పెద్ద వయసులోనూ వాటిని తనే మృదు మధురంగా ఆలపించి అభిరుచి చాటుకున్న కళాపిపాసి.

**అభ్యుదయ కవితా భాష్యం**

ప్రాచీన కావ్యాలకే పరిమితమైన తెలుగు పరిశోధనను సమగ్ర ఆధునికత వైపు మరల్చిన అగ్రగామి ఆయన. అభ్యుదయ కవిత్వం అంటే శ్రీశ్రీ మహాప్రస్థానంతో సహా చాలా కావ్యాల పేర్లు, కవితలూ చెబుతుంటాము. కాని ఈ ప్రక్రియ పరిణామం ఎలా సంభవించాయి? అంతకు ముందున్న సంప్రదాయ కవిత్వంతో పోలిస్తే ఈ నవ కవిత ఎలా ముందడుగు వేసింది? ముఖ్యంగా మహాప్రస్థానంలో శ్రీశ్రీ ప్రయోగాలకూ, ప్రతీకలకు అర్థం పరమార్థం ఏమిటి? ఈ ప్రశ్నలకు పరిశోధనా ప్రమాణాలతో, కొత్త కొలబద్దలతో సినారె సమాధానం అందించారు. అభ్యుదయ కవిత్వం అన్నది అపహాస్యం చేయదగిన నినాద సాహిత్యం కాదు, తరతరాల వారసత్వానికి చారిత్రికమైన కొనసాగింపు అని నిరూపించారు. శ్రీశ్రీ దేశ చరిత్రలు గేయాన్ని విశ్లేషించడం కోసం గతితార్కిక భౌతిక వాదాన్ని సవివరంగా ఉల్లేఖించారు. శ్రీశ్రీకి ముందు గురజాడ, తర్వాత ఆరుద్ర తదితరులు చేసిన కృషిని కూడా ఒక చారిత్రిక క్రమంలో సినారె ఆ గ్రంథంలో పరిశీలించారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆ నాటికి అంతకు మించిన మరో గ్రంథం ఆ విషయమై రాలేదు. తర్వాత కూడా దాని విలువ తగ్గలేదు. ఈ గ్రంథం వచ్చేనాటికి నెమ్మదిగా దిగంబర కవితా ఛాయలు ప్రసరిస్తున్నాయి. ఆయన పరిశోధనా గ్రంథంలో అతినవ్య కవితా ధోరణులు అన్న అధ్యాయంలో ఇలాటివి కొన్ని ప్రస్తావించారు.. పడగొట్టండోయ్ తాజ్ మహలును వంటి అర్థరహితమైన ప్రయోగాల వల్ల ఫలితం శూన్యమని తేల్చిచెప్పారు. ఆధునిక ఆంధ్ర కవిత్వము, సంప్రదాయములు ప్రయోగములు అన్న పరిశోధనతో ఆయనకు 1968లో వొక్క పిహెచ్‌డి వచ్చింది గాని దానివల్ల వందల మంది డాక్టరేట్లు పొందారన్నది సాహిత్య లోకంలో అనుకునే మాట.

**సినీ గీతాల్లోనూ ప్రత్యేకత...**

ఎన్టీఆర్ పిలుపుపై 'నన్నుదోచుకుందువటే' అంటూ సినిమా జగత్తులో ప్రవేశించిన సినారె 'రవ్వంత సడిలేని రసరమ్య గీతాల'తో అందరినీ దోచుకున్నారు. 'పగలే వెన్నెల' కాయించారు. 'అ అమ్మ ఆ ఆవు' అంటూ అక్షరాభ్యాస గీతాలు రాసి అలరించిన ఆయన 'చదవులతో పనిఏమి హృదయమున్నచాలు' అని అవిద్యావంతులనూ ఓదార్చారు. 'అనగనగా ఒకరాజు' అంటూ కొడుకుల అనాదరణ చూసిన పెద్దమనిషిపై పాట కట్టిన ఆయన 'అనుబంధం ఆత్మీయతా' అంతా ఒక బూటకం అంటూ మానవ సంబంధాల విచ్ఛిన్నాన్ని గానం చేశారు. 'మనసున్న మనిషికి సుఖము లేదంతే' అని ఆత్రేయ శోకిస్తుంటే 'మనసే మనిషికి తీయని వరమూ' అని సినారె ఆశాభావం చాటారు. మరింత బలంగా 'గోరంతదీపం కొండంత వెలుగు, చిగురంత ఆశ జగమంత వెలుగు' అని రాశారు. 'గాలికి కులమేది' అని ప్రశ్నించారు.. 'స్నేహమేరా జీవితం' అంటూ కవ్వాలిని అద్భుత సందేశంతో తెలుగీకరించారు. కృష్ణ కుచేల గాథను ఆధునిక హరికథగా మలచి ఉర్రూతలూపారు. 'వందే మాతర గీతం వరసమారుతున్నదని' హెచ్చరించారు. సిన్ని ఓ సిన్ని అని కోనసీమ పాటనూ ఒసే రాములమ్మ అంటూ తెలంగాణ గొంతును ఇది రాయలసీమ గడ్డ అంటూ సీమ స్వరాన్ని కూడా కవికట్టారు. కదిలింది అరుణసైన్యం అని చైతన్యగానం చేశారు. రాశిలోనూ, వాసిలోనూ కూడా సినిమా పాటల విషయంలో సినారె మిగతా వారికంటే ఒక మెట్టుపైన ఉంటారన్నది నిర్వివాదాంశం. సన్నివేశాలతో, కథతో సంబంధం లేని పాటలు రాయలేక తనే తప్పుకున్నానని ఒక సందర్భంలో చెప్పారు.

**అచంచల ఆశయబలం**

అలనాటి హైదరాబాద్ రాష్ట్రంలో తెలంగాణ రచయితల సంఘం బాధ్యుడుగా మొదలై తర్వాత అభ్యుదయ రచయితల సంఘం వరకూ పనిచేసిన సినారె కడవరకూ ప్రగతిశీల ప్రజాస్వామ్య వాది. హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రారంభ ఘట్టాలన్నిటిలో ఉన్నారు. సోవియట్ విచ్ఛిన్నం తర్వాతా 'పైనున్న మంచు కరిగినా పర్వతం కరిగిపోదు'అని ఆశయాల ఆజేయత్వాన్ని చాటారు. అర్థం కాని వారికోసం 'ఎవడురా కూసింది కమ్యూనిజం చచ్చిపోయిందని.. మనిషి రక్తం ఎర్రగా ఉన్నంత వరకూ అది అజేయం' అని మరింత సూటిగా చెప్పారు. పచ్చదనాన్ని నిషేదించాలనుకున్న రాజుగారి భంగపాటుపై పాట రాశారు. గద్దర్‌పై హత్యాప్రయత్నం జరిగితే డొక్క కడుపులో పొడిచారని అభిశంసించారు. బాబరీ మసీదు విధ్వంసాన్ని తీవ్రంగా ఖండిస్తూ 'నిర్మించండి కూల్చకండి' అని వివేకానందుణ్ని ఉటంకించారు. తెలుగు జాతి మనది 'నిండుగ' వెలుగు జాతి మనది అని, 'రెండుగ' వెలుగు జాతి మనదిఅని

ఆయా సందర్భాలలో తన హృదయ స్పందనను అందంగా పొందించారు.

**చమత్కార భాషణం**

'వచ్చిందన్నా వచ్చాదన్నా వరాల తెలుగు ఒకటేనన్నా' అని ఘంటాపథంగా చెప్పిన సినారెకు ఉర్దూ హిందీ కూడా కరతలామలకమే. శ్రీశ్రీ అనంతర శబ్దబ్రహ్మ ఆయన. మితంగా గాక విస్తారంగా రాస్తూనే ఉన్నారు గనక భాషా పరమైన ప్రయోగాలు మరెన్నో చేయడానికి అవకాశం ఏర్పడింది. సినారె కవితా చరణా లు, చలన చిత్ర గీతాలూ, ప్రసంగ పద విన్యా సాలు వాటికవే పాఠాలుగా ఉంటాయి. బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చింది అనే ఆయన వాక్యానికి నేను కిక్ కల్చర్ కిక్‌బ్యాక్ కల్చర్ వచ్చింది అని జోడిస్తే మహానందపడిపోయారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రారంభానికి వచ్చిన ఒక మంత్రి గారు 'ఇక్కడ విశ్వరంభ లాటి చాలా పుస్తకాలు చూశాను' అన్నారు. తర్వాత మాట్లాడిన సినారె ' ఇక్కడ అన్ని రకాల మంచి పుస్తకాలు ఉన్నాయి. విశ్వంభరలు ఉన్నాయి.. విశ్వరంభలు లేవు'అనగానే చప్పట్లు! ఇరవై ఏండ్ల కిందట జ్ఞానపీఠం వచ్చినప్పుడు 'అరిస్తే' గొంతు పోతుం దంటారు. 'అణిస్తే' కూడా పోతుంది.. పురస్కారం తర్వాత సంతోషం గొప్పగా ప్రకటించకుండా వినయం నటిస్తూ మాట్లాడుతుంటే గొంతు పోయింది అన్నారు. 'ఈ పురస్కారం కోసం గతంలో నేనే స్వయంగా శ్రీశ్రీ ఆరుద్రల పేర్లు ప్రతిపాదించాను. కేంద్రం అంగీకరించలేదు. ఏం చేస్తాను.. ఇప్పుడు నాకు వచ్చింది' అంటూ చెప్పడం ఆయన నమ్రత. ఆరోగ్యం దెబ్బ తిన్నాక ఒక సారి సుద్దాల హనుమంతు సంస్మరణ సభకు వచ్చారు. "ఎక్కువ సేపు మాట్లాడను. ఉన్నాడు మన తెలకపల్లి రవి,చిట్టా విప్పుతాడు, గుట్టు మట్టు చెప్పుతాడు" అంటూ చమత్కరించి వెళ్లి పోయారు. ఆయనతో పాల్గొన్న సభల్లో ఇలాటి జ్ఞాపకాలు అందరికీ ఉంటాయి. కొత్తగా కలం పట్టుకున్న ప్రతివారినీ ఆయన ప్రోత్సహిస్తూ వచ్చారు. వందలాది మందికి ముందు మాట లు రాశారు. ఆశీస్సులందించారు. ఆ విధంగా ప్రతివూళ్లోనూ ఆయన నుంచి ఉత్తరాలు అందు కున్నవారుంటారు. విద్యా సంస్థలలో, వివిధ ప్రభుత్వాలలో అనేక పదవులు, బాధ్యతలు నిర్వహించినా, వాటి వల్లకీర్తి ప్రతిష్టలుపొందినా ఎవరినీ వ్యక్తిగతంగా కీర్తించలేదనీ, వాటిని ఉపయోగించి చాలామందికి సహాయం చేశానని ఆయన తృప్తిగా చెప్పుకున్న మాట చాలా వరకూ నిజం.ఇంత సుదీర్ఘ జీవితంలో ఏనాడూ వివాదాలలో కూరుకుపోవడం గాని, ప్రగతిశీల శక్తులను చిన్నబుచ్చడం గాని ఆయనలో చూడం. అదే ఆయన నిబద్ధతకు నిదర్శనం. ఆయన క్రమశిక్షణ, శ్రమ శిక్షణ, సృజన భాషణ అత్యంత అనుసరణీయాలు. వాటిపై మరింత అధ్యయనం జరగాలి. ఆ ప్రతిభా పాటవాలు అందిపుచ్చుకోవడానికి కొత్తతరాలూ కృషిచేయాలి.

# ఆర్యుల వలసలకు జన్యుశాస్త్ర పరిష్కారం

(29వ పేజీ తరువాయి)

దీవులలోని జీన్‌జీ తెగే ఈ గందరగోళ కాలంలో మినహాయించబడింది. డేవిడ్ ఫోజ్‌నిక్ 2016 లోని పరిశోధనలో కూడా 2000 బిసిలో 'వై' జన్యు కణం, ఆర్1ఏ కణంలోని జడ్93 భాగం విడివడి 'ఎంతో స్పష్టంగా', చాలా తొందరగా అభివృద్ధి చెంది విస్తృతి చెందింది అని వ్రాశారు. చివరిగా 2000 బిసిలోనే సింధూ నాగరికత పతనం చెందిన విషయం మనకు తెలుసు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే భారత చరిత్ర లోని తప్పిపోయిన ఒక లంకె మనకు కనిపిస్తుంది.

రెండవది ఈ పరిశోధనలన్నీ ప్రపంచ వ్యాప్తంగా జరిగాయి. అవి ఎదుర్కొన్న ప్రశ్న లైనా, సేకరించిన నమూనాలైనా లేదా పద్ధతు లైనా. ఉదాహరణకు ఫోజ్‌నిక్ పరిశోధన ఆర్1ఎ నుండి జడ్93 అనే వంశ భాగం విడివడిందని చెప్పింది. 'వై' జీవకణం విస్తరణ గురించిన పరిశోధన ఒక్క భారతదేశానికి సంబంధించినది కాదు. నాలుగు ఖండాలకు సంబంధించినది. అమెరికాలో క్యూటిఎ-ఎమ్2 గ్రూపు 15,000 సంవత్సరాలకు విస్తరించిందని పరిశోధన వెల్లడించింది. అంటే అందరూ అంగీకరించి నట్టు ఆ కాలంలోనే వలసల బారిన పడింది. అంటే ఈ పరిశోధనలు ఒక భారతదేశం చరిత్ర లోని ఖాళీలను మాత్రమే పూరించలేదు. ప్రపంచ చరిత్రలోని ఖాళీలనే పూరిస్తున్నది. ప్రపంచ వలసల చిత్రం పూర్తిగా పూరించబడితే ప్రపం చ జనాభా పెరిగిన తీరు తెన్నులను ఎవ రూ తలక్రిందులు చేయలేరు. జన్యుశాస్త్ర పరిశో ధనలలో వచ్చిన నూతన ఆవిష్కరణలే ఈ రకం గా చరిత్రను పునర్నిర్మించడానికి ఎంతగానో సహకరిస్తున్నాయి. ఈ టెక్నాలజీని మరిన్ని విభా గాలకు అన్వయించి మంచి మంచి ఫలితాలు పొందవచ్చు.

ఇప్పటివరకు మనం ఇంకో యూరోపియన్ వలసల గురించి మాత్రమే చర్చించాం. ఎందు కంటే ప్రపంచంలో ఇప్పటికీ ఇదొక పెద్ద చర్చనీ యాంశం. అయితే మనం మర్చిపోకూడని అంశం ఏమిటంటే ఆర్1ఎ వంశీయులు భారత దేశ పురుషులలో 17.5 శాతం మాత్ర మే ఉన్నారు. మహిళలలో ఇంకా తక్కువగా ఉ న్నారు. భారతదేశంలోని మిగిలిన అశేషజనం మూలా లు వేరు వేరు ప్రాంతాలలో ఉన్నాయి. ఆఫ్రికా ఖండం నుండి 55,000 నుండి 65,000 సం॥ల క్రితం వచ్చిన వారు, పశ్చిమ ఆసియా నుండి వ్యవసాయ వలసలుగా వరుసగా అనేకసార్లు 10,000 బిసి తరువాత వచ్చినవారు లేదా ఉత్తర ఆసియాలోని ఆస్ట్రో ఆసియా భాష మాట్లాడే ముండాలాంటి వారు. వీరు ఎప్పుడు వచ్చిందీ ఇంకా ఖచ్చితంగా నిర్ణయించాల్సినఅవ సరం ఉంది. ఉత్తర ఆసియా నుండే వచ్చినటిబె టో బర్మన్ భాష మాట్లాడే వసలవాదులు వచ్చిన సమయం కూడా నిర్ధారించవలసి ఉంది.

అయితే ఖచ్చితమైన విషయం ఏమిటంటే మనది వివిధ నాగరికతల మూలాలున్న మిశ్రమ నాగరికత. ఒకే సంస్కృతి ఆధారంగా ఏర్పడ్డ ఒకే మూలం ఉన్న జాతి కాదు. సంప్రదా యాలు, ఆచారాలు వివిధ వలస చరిత్రల ఆధా రంగా ఏర్పడ్డాయి. ఆఫ్రికా నుండి వచ్చిన మార్గ దర్శకులు ఈ భూమిని వాస్తవంగా కనుగొన్న నిర్భయ అన్వేషకులు, అందులో స్థిర నివాస మేర్పరుచుకోవచ్చి సింధూ నాగరికతను నిర్మించి నవారు, ఈనాటి మన సంప్రదాయాలకు పరిపుష్టత చేకూర్చినవారు; ఉత్తర ఆసియానుండి వచ్చిన వారు, బహుశా వారితో పాటు వరి సేద్యం తెచ్చినవారు, ఆ తరువాత కాలంలో సంస్కృతమనే భాషతో వచ్చిన వారు, దానితో పాటే కొన్ని నమ్మకాలను తమతో తెచ్చారు. ఆ తరువాత వ్యాపారం కోసమో, జయించడానికో వచ్చిన వారు స్థిరపడి ఇక్కడే ఉండిపోయారు. అందరూ కలిసి ఈ నాగరికత అభివృద్ధి చేసేం దుకు దోహదపడ్డారు. ఇదే భారతదేశం. మనం అందరం వలసవాదులమే.

❀

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-07-2017 (36 pages) Postal Regd. No VJ/172/2015-17

# కులాల వారీ వృత్తి విభజన అభివృద్ధిని మందగింపజేసింది



**– ఇయంయస్ నంబూద్రిపాద్**

**భూ**మితో పాటుఇతర సంపదల మీద అధికారం సంపాదించిన వారి ఆస్తులు, ఆదాయం ఎక్కువగా ఉన్నందు వలన అదనంగా ఉన్నవాటిని విక్రయించి, ఇతరుల వద్ద అదనంగా ఉన్న, తమకు అవసరమైన వాటిని కొనటం –వ్యాపారం–ప్రారంభమైంది. వ్యవసాయం, చేతివృత్తులు, వ్యాపారంతో కూడిన ఆర్థిక జీవనం, దానిని సంరక్షించటానికి కావలసిన పాలనావ్యవస్థ, ఈ రెండు కలిసినదే భారతీయ సమాజం అనేస్థితి ఏర్పడింది.

ఇవన్నీ సంభవించిన తర్వాత గ్రామస్థాయికి పైబడిన సాంఘిక, రాజకీయ సంబంధాలు కొత్తరూపుదాల్చాయి. ఆక్రమణలు, ఆధిక్యతలు ఏర్పడడానికి, పతనం చెందడానికి కారకులైన సామ్రాజ్యాల పాత పాలనా విధానానికి బదులుగా ఉత్పత్తి, పంపిణీ అనే ఆర్థికరంగాన్ని మరింత క్రమబద్ధమొనర్చే ఒక పాలనా వ్యవస్థ క్రింద నుండిపై దాకా రూపొందనారంభించింది. భూమిని, ఇతర ఉత్పత్తి సాధనాలను తమ ఆధీనంలో ఉంచుకొన్న ఉన్నతకులాల వారిని సంరక్షిస్తూ ఉన్న సామంతులూ, రాజులూ గ్రామాలపై అధికారం చెలాయించేవారుగా మారారు. వీరిలోనే అత్యధికులు 'దైవస్వం' (దేవతల కొరకైనది), 'బ్రహ్మస్వం' (బ్రాహ్మణుల కొరకైనది) వంటి రూపాలలో ఉన్న భూములను, ఇతర సంపదలను వశపరచుకొన్న వారుగానూ ఉన్నారు. కుల ప్రాతిపదికన వారు ఉన్నత కులాలకు చెందినవారుగా ఉన్నారు.

ఇలా సమాజం, ఆర్థిక, రాజకీయ రంగాలతో పాటు సాంస్కృతిక రంగంలోనూ ఉన్నత స్థితిని పొందిన ఒక పాలకవర్గం సమాజంలో జన్మించింది. దీని తోడ్పాటుతోనే హిందూ, ముస్లిం తారతమ్యం లేకుండా రాజులూ, చక్రవర్తులూ దేశపాలన గావించారు.

ఇదీ ఒక విధమైన భూస్వామ్య వ్యవస్థయే. ఐరోపా దేశాలతో పోల్చినప్పుడు పలు భేదాలున్నప్పటికీ భూస్వామ్య వ్యవస్థ యొక్క అనేక ప్రధాన అంశాలు ఇందులో ఉన్నాయి. అవి ఏవి? భూస్వాములకు, పాలకులకు మధ్య వేరుచేయలేని సంబంధం, రాజ్యపాలనకు ప్రధాన సాధనమైన సైన్యం యొక్క సాధారణ స్వభావం, సామంతులూ, రాజులూ, వీరిననుసరించియే చక్రవర్తులు, పాదుషాలు దేశాన్ని పరిపాలించగలరనే స్థితి ఏర్పడింది. వ్యవసాయం, చేతివృత్తులు, వ్యాపారం వృద్ధియై ఆర్థిక జీవనంలో ఏర్పడిన సర్వతోముఖ వికాసం, వీటన్నింటి అవిభాజ్య అంగంగా ధనం యొక్క ఉపయోగం ఎక్కువవుతున్న పరిస్థితి. ఇవన్నీ ఐరోపాలోని భూస్వామ్య వ్యవస్థలో నిండివున్నాయనుకుంటే, క్రీస్తు తర్వాత మొదటి శతాబ్దం నుంచీ ఇవన్నీ భారతదేశంలోనూ వృద్ధి కాబోతున్నాయి.

అయితే ఇవి మొత్తం గ్రామీణ ప్రజల సామాజిక జీవన విధానానికి పునాదియైన వర్ణ(కుల) వ్యవస్థలో ఏ విధమైన మార్పునూ తేలేకపోయాయి. ఐరోపా దేశాలలోలాగా ప్రత్యక్షమైన యజమాని, బానిస సంబంధాలు భారతదేశంలో అభివృద్ధి చెందలేదనీ, దానికి బదులుగా 'ఉన్నత కులాల' వారు, 'దాసులు' అనే రెండు శాఖలు రూపొందాయని ఇంతకుమునుపే చెప్పాం కదా. ప్రత్యక్షంగా కాకపోయినా యజమాని, బానిస సంబంధాల ఒక రూపమే 'దాసులు', 'ఉన్నతకులాల' వారి మధ్య ఉన్నదనే విషయం నిజం. వ్యవసాయం, చేతివృత్తులు, వాణిజ్యం, పాలన, సాంస్కృతిక రంగాలలో అభివృద్ధి ఏర్పడినప్పుడు 'దాసుల'లోనూ 'ఉన్నత కులాల' వారిలోనూ విభిన్న శాఖలు (అసంఖ్యాకమైన కులాలు, ఉపకులాలు) రూపొందాయి. ఫలానా కులానికి పాలనావృత్తి, ఫలానా వృత్తికి ఫలానా కులం అనే విధంగా వృత్తి విభజనలు జరిగాయి. ఈ విభిన్న వృత్తులు గ్రామ ప్రాంతాల్లోనే జరుగుతున్నందువల్ల ఒక్కొక్క గ్రామంలోనూ దానికవసరమైన విభిన్న వృత్తులు చేయడానికి నిర్ణయింపబడ్డ విభిన్న కులాల వారూ, వారి జీవనాధారానికి కావలసిన ఆర్థిక ఏర్పాట్లు, గ్రామ జీవితం యొక్క అవిభాజ్య అంశాలైనాయి. ఒక్కొక్క గ్రామానికి కమ్మరి, కుమ్మరి, చాకలి, మంగలివారు తప్పక అవసరమయ్యారు. భూస్వామ్య వ్యవస్థ ఉదయించడానికి పూర్వమే ఇవన్నీ కలిగిన గ్రామీణ వ్యవస్థ రూపొంది ఉన్నది. ఇప్పుడు కూడా అది ఒక మేరకు కొనసాగుతూనే ఉన్నది.

ఈ సామాజిక వ్యవస్థ అనివార్యమైన ఒక ఫలితమేమంటే, ఆ వృత్తులు చేసిన వారందరి దృక్పథంలోను, కార్యాచరణలోను నిండియున్న పురాతన దృక్కోణం : పాత కుటుంబ పెద్దలు చెప్పినవాటిని తు.చ. తప్పక అనుసరించడం తప్ప, వృత్తుల సంబంధంగా కొత్త పుంతలు త్రొక్కడానికి ఎవరూ సాహసించలేదు. వేరెవరినీ తమ వృత్తులు చేయమని పిలువనూ లేదు. తాము వేరు వృత్తులకు వెళ్ళనూ లేదు. ఈ విధంగా ఒక తరం నుండి మరో తరానికి వంశపారంపర్యం లభించిన వృత్తిని పాటించడం తప్ప. విభిన్న వృత్తులను ఆధునికపరచాలనే ఆలోచన ఎవరికీ తోచలేదు.

(ఇయమ్‌యస్ రచించిన వేదభూమి పుస్తకం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275 .Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.12, No.3. Published on July 1, 2017